ఏప్రిల్, 2024
సంపుటి 04, సంచిక 07

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలంగాణ సాహిత్య మాసపత్రిక





తెలంగాణ వైతాళికులు, సంస్కృతాంధ్ర పండితులు

## ఒద్దిరాజు సీతారామచంద్రరావు

జననం : 02-04-1887

## ఒద్దిరాజు రాఘవ రంగారావు

జననం : 04-04-1894

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **BHARATHA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక


జీవించడం కళ అంటున్న **రామా చంద్రమౌళి** కథ **"నేలపై వినీలాకాశం"** ....పేజీ 39

జీవితమే పాట అంటున్న ఎం వి ఉమాదేవి కవిత **"పాట కథ చెప్పనా...?"** ....పేజీ 10

మరణించాక కూడా జీవిస్తానంటున్న **సైదాచారి** కవిత **"నేనింక చావను"** ....పేజీ 18

మగ దురహంకారాన్ని పాతాళానికి పంపాలంటున్న **వకుళ వాసు** కవిత **"బంగారం"** ....పేజీ 38

అమ్మ గుడ్డ ప్రేమను చెబుతున్న **గిడ్డ కింద మాణిక్యం** కవిత **"మాయమ్మ గుడ్డ"** ....పేజీ 26



19 గ్రామాల్లోని కులాతీత మానవ సంబంధాలను తెలుపుతున్న **దోరవేటి** కథ **"నీరు"**



35 గౌరవంతో ఆపదలో ఆదుకున్న మైత్రి చిత్రించిన **మద్దూరి నరసింహమూర్తి** కథ **"గురుభావం"**




27 సామంతుని సాహసాన్ని యుక్తితో అరికట్టిన యుగంధర మంత్రి కథ **"గుణపాఠం" అమ్మంగి వేణుగోపాల్**



45 **సాహిత్యం కొత్తదారులకు కవాటం తెరవాలి అంటున్న టి. రంగస్వామితో సాగర్ల సత్తయ్య** ముఖాముఖి



31 ఒగ్గు కథల పాటలకు ఒక వివరణ ఒగ్గు కథ గానాలు **సతీష్ కుమార్** వ్యాసం **"మల్లన్న క్షేత్రాలలో ఒగ్గు కథాగానాలు..."**



11 **"బహుజనం మార్గంలో సాహిత్య చరిత్రను నడిపించిన దేవి ప్రసాద్ యాదవ్"**ని పరిచయం చేస్తున్న **సంగిశెట్టి శ్రీనివాస్** వ్యాసం

23 మహిళా సాహిత్య ప్రస్థానంలో మహబూబ్ నగర్ **భీంపల్లి శ్రీకాంత్** వ్యాసం **"ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహిళా సాహిత్యం"**

07 నిజాం జమానాకు అద్దం పట్టిన బెల్లంకొండ **నరసింహాచార్యులు** నాటికథ **"సియాసీ సభలు"**

ప్రియమైన శత్రువుకి తలుపు తీయనంటున్న **ఏరువ శ్రీనాథరెడ్డి** కవిత **"ప్రియమైన శత్రువు"** ....పేజీ 22

కన్నీళ్ల అశక్త ప్రకటనతో ఎందుకో అమ్మ యాదికి వస్తుంది అన్న **పిన్నంశెట్టి** కవిత **"ఎందుకో అమ్మ యాదికి వస్తుంది"** ....పేజీ 50

నది పచ్చని పద్యాలను స్రవిస్తుందనే **అనంతాచార్య** కవిత **"ఒక్కసారి నదితో మాట్లాడు"** ....పేజీ 44

జాతి గుండెల చప్పుడు విఠలాచార్య గారిని వర్ణించిన **మండల స్వామి** కవిత **"కీర్తి కొండ"** ....పేజీ 30

కేసీఆర్ వ్యక్తిత్వాన్ని కవిత్వంతో ఆవిష్కరించిన **కల్లెం నవీన్ రెడ్డి** **"యోధ" కేసీఆర్ ధీర గాథ** ...పేజీ 55

తెలంగాణ కవి జీవిత ప్రస్థానంలోని ఒడిదుడుకులు సృష్టించిన **సంకేపల్లి** **"రామసింహ కవి జీవితం ఆత్మకథ ఒక పరిశీలన"** ...పేజీ 51

**"ఓటు"** దివ్యాస్త్రం అంటున్న **గడ్డం లక్ష్మయ్య** పద్య కవిత్వం ...పేజీ 43

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...


**తంగేడులో ప్రచురిస్తున్న రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు ఆయా సృజన కారుల సొంతం. వీటితో సంపాదకులకు ఏకీభావం ఉండవలసిన అవసరం లేదు. విభిన్న ప్రక్రియలకు, అభిప్రాయాలకు, వేదిక కావడమే తంగేడు లక్ష్యం.**

# శ్రీ మన్నెంకొండ శ్రీహరి శతకం

**శ్రీ పంతులు చిన్నయ్య**



నాటికవి శ్రీ పంతులు చిన్నయ్య క్రీస్తుశకం 1712లో జన్మించారు. ఈయన పరిగి సమీప మండలమైన కుల్కచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందినవారు. ఈయన భారత భాగవతాది గ్రంథములు తాళపత్రాల మీద వ్రాసి ఆనాటి పెద్దలకు అంకితం చేసి బహుమతులు పొందినట్లు చెబుతారు. ఆయన రచనల్లో ఇప్పుడు లభిస్తున్నది మన్యంకొండ శ్రీహరి శతకం. ఆయన గ్రామంలోని సాహితీ ప్రియులు కొత్తపల్లి భీమరెడ్డి మరియు హనుమయ్య ఈ శతకాన్ని శివయోగి గారి చేత సవరింపజేసి ముద్రించారు. 99 చంపకమాలలు తర్వాత ఉత్పల కందపద్యాలతో కలిపి మొత్తం 108 ఉన్నాయి. ఈ కవి శ్రీకారంలో మొదట ఆరు పద్యాలు రాశారు. శతకంలో మన్యంకొండ శ్రీహరీ అనే మకుటంతో ఆద్యంతం ఆకర్షణీయంగా రచన కొనసాగించారు. చిన్నయ్య పంతులు గారి కొన్ని శతక పద్యాలు మా పాఠకుల కోసం.....

ఉ॥ శ్రీ కమలాలయారమణ । శీఘ్రముగా దయదల్చి నా మనో
వ్యాకులమంత దీర్పుమిక । వారిజలోచన పత్ర హస్త, నే
లోకుల గొల్వనేల భువిలో । నను వంచనశాయ బోకుడీ
నీకు నమస్కరించెదను । నేర్పుగ మన్నెముకొండ శ్రీహరీ ॥

ఉ॥ శ్రీ నరసింహ మీ భజన । చేసెడి భక్తులతోడ గూడితే
నేను పవిత్ర మయ్యెదను । నీచుల సంగతి చాలు చాలు, నీ
మానవ జన్మమెత్తి । బహుమందిని వేడితి పొట్టకోసమై
దీనుడనయ్య నన్ను । కడ తేర్చుమి మన్నెముకొండ శ్రీహరీ ॥

ఉ॥ శ్రీ తరుణి మనోవిదిత । శ్రీధర సన్నుత చారునీల జీ
మూత శరీర పాతక వి । మోచన సద్గుణజాల భక్త కం
జాత గుణార్క తద్దనుజ । సర్వ భగేశ్వరయామినేక రా
శ్వేత యశోవిశాల । మునిసేవిత మన్నెముకొండ శ్రీహరీ ॥

ఉ॥ శ్రీ రమణీశ మీకథలు । ప్రార్థన శెయ్యగలేను గాన సం
సారము కోసమైతె । ఘనజారుల నీచులనైన గొల్చెదన్
చారెడు పొట్టకై సకల । జాతి మనుష్యుల చాల గొల్చితిన్
మీరిక నాకు ముక్తి । కడువేడుక మన్నెముకొండ శ్రీహరీ ॥

- సేకరణ : అంజయ్య అష్టావధాని

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

ఏప్రిల్, 2024

సంపుటి 04 సంచిక 07



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# జయం ధీశాలిదే...

"ప్రమాదోధీమతామపి"అనేది ఆర్య వాక్యం. అంటే ధైర్యవంతులు ప్రమాదాలకు భయపడరు అని అర్థం. ముఖ్యంగా సృజన కారులను గురించి ప్రాచీన లాక్షణికులు చెప్పిన అంశం ఇది. "No man ever became great or good and except through many and great mistakes" అంటాడు William E. Gladstone. ఒక రచనా ప్రయత్నాన్ని చేసే వ్యక్తి తప్పులకు భయపడితే ఆ రచన చేయలేడు. అలాగని తప్పులను పదేపదే చేయమని దీని అర్థం కాదు. తప్పులను సవరించుకుంటూ ముందుకు నడవాలి. తప్పులు చేస్తామేమో అనే భయంతో, ఎవరో విమర్శిస్తారు అని అనుమానంతో మనం సృజన మానకూడదు. ఇది కేవలం సాహిత్య రంగానికి మాత్రమే కాకుండా అన్ని రంగాలకు కూడా వర్తించే అంశం. రాజకీయాలకు కూడ వర్తించే అంశం. మనిషి జీవించడానికి, జీవితంలో ముందుకు కొనసాగడానికి అవశ్యం గుర్తుంచుకోదగిన అంశం. ఇప్పటికీ కూడా నన్నయ పదబంధాలలో, శ్రీ శ్రీ కవితా నిర్మాణంలో, తప్పులు వెతికే వాళ్ళు ఉన్నారు. వేమన్నకు యతిదోషం అని తన పాండిత్య ప్రకర్షను ప్రదర్శించే వాళ్ళున్నారు. అయినా ఆ మహాకవులకు లోటు వచ్చిందా? సాహిత్యంలో వాళ్ల పేరు ఏమైనా తక్కువ అయిందా? కాబట్టి జీవితంలో, సాహిత్యంలో లేక రాజకీయాలలో కూడా హిమాలయ పర్వతంతో సమానమైన వ్యక్తిత్వం ఉన్న వాళ్ళని ఎవరు ఏమి చేయలేరు. వాళ్ళ వ్యక్తిత్వం ముందు శత్రువర్గాలు కావాలని చేసే ఆటంకాలు, ఇబ్బందులు, దూది పింజల్లా తేలిపోతాయి. మబ్బులు తొలగిపోయిన ఆకాశం వలె వాళ్ల స్వచ్ఛ కీర్తి ప్రపంచంలో నిలిచిపోతుంది. ధీమంతులకు కష్టం ఎదురైతే అది వాళ్లను మరింత రాటుదేలేలా చేస్తుంది. విజయ పథం వైపు నడిపిస్తుంది. అదే ఉండవలసిన అంత ధైర్యం లేకపోతే వాళ్లు ఆ సమస్యకు బలైపోయే ప్రమాదం ఉంటుంది. ఏ మాత్రం ధైర్యాన్ని విడిచిపెట్టినా సమస్య గోరంతది కొండంతై అసలుకే ప్రమాదం తెస్తుంది. ధైర్యంగా ఉన్న వాళ్లకి పాము తాడు వలె కనిపిస్తే పిరికివాళ్ళకి తాడు పాము వలె కనిపిస్తుంది. Beauty lies in our eyes only అంటాడు ఒక కవి. ఒక బ్యూటీ మాత్రమే కాదు ప్రతిదీ మనలోనే ఉంటుంది. అది సందర్భాన్ని బట్టి, పరిస్థితులను బట్టి బయటికి వస్తుంది. వచ్చిన అవకాశం విడిచిపెట్టకుండా ఉపయోగించుకోవడం మనిషి చాతుర్యాన్ని బట్టి ఉంటుంది. ఇప్పుడున్న సామాజిక పరిస్థితులలో సాహిత్య రంగంలో ఆటంకాలు కలుగజేయడం కొందరికి ఒక వినోదం అయింది. కానీ ఆ ఆటంకాలు కలుగజేస్తున్నప్పుడు వాళ్లు ఒకరకంగా సృజన కారులకు మేలు చేసే వాళ్లే అవుతారు. తాత్కాలికంగా ఇబ్బంది పడ్డా, వాళ్లలో సంయమనం మరింత పెరుగుతుంది. వస్తువు పట్ల మరింత నిబద్ధులవుతారు. దీని వల్ల ఏతా వాతా చివరికి అది మంచి పరిణామానికి దారి తీస్తుంది. మానవుడు, అతను నివసిస్తున్న సమాజం కూడా పరిపూర్ణత వైపు ప్రయాణించాలనేదే అన్ని తాత్విక దృక్పథాల మౌలిక చింతన. ఈ తాత్విక దృక్పథాలను ఒక వస్తువు ద్వారా ఇతర ఉపకరణాల ద్వారా ప్రకటించడమే సాహిత్యం పని. పరిపూర్ణత ఒక స్వప్నమే కాని సాధ్యమయే పని కాదని ఒక వాదం ఉంది. ఆధునికానంతర కవిత్వంలో ఈ ధోరణి మనం గమనించాం. అయినా ప్రయత్నం మానవ సహజ లక్షణం. ప్రతికూలతను త్రోసి రాజందాం. అనుకూలతను ఆహ్వానిద్దాం.

**జై తెలంగాణ! జై జాగృతి!!**

ఈ మాసం కవిత

పూనా యూనివర్సిటీ లో మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన దాసరి మోహన్ వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం చేసి ప్రస్తుతం రచనలకు అంకితం అయ్యారు. దండెం, అల్మారా కవితా సంపుటాలు ,రాళ్ల కుచ్చె కథా సంపుటి, వెంకటయ్య బావి నవలను రచించి ప్రచురించారు. దాసరి మోహన్ రాసిన కథలు తెలుగు వెలుగు, నమస్తే తెలంగాణ బతుకమ్మ, తంగేడు, ఏషియా నెట్ న్యూస్, సాహితీ కిరణంలో ప్రచురించారు. కవితలు అన్ని ప్రముఖ దిన పత్రికలలో ప్రచురితం అవుతున్నాయి.

నమస్తే తెలంగాణా దిన పత్రిక నిర్వహించిన కవితల పోటీలో ద్వితీయ బహుమతి. పాలపిట్ట, సాహితీ కిరణం, విశాలాక్షి మాస పత్రిక, కవి సంధ్య, పాల్వంచ సంస్థ నిర్వహించిన వివిధ కథల పోటీ, కవితల పోటీలో బహుమతులు సాధించారు.

దాసరి మోహన్ ఉద్వేగ భరితమైన ఈ కవిత, మా తంగేడు పాఠకుల కోసం ఈ మాసం కవితగా......

# అంతా సముద్రమే చెబుతుంది...



దాసరి మోహన్, 9985309080

తీరం తిరస్కరించింది అని
అల అక్కడే ఆగలేదు కదా
ఓటమి ఎదురయినప్పుడు
ఓర్పుతో మరింత నేర్పుతో
గమ్యం కోసం గట్టిగా పోరాడాల్సిందే....

నింగి నేలా కలిసాయా
అభిప్రాయాలు కూడా అంతే
మనుషులు మమతలు పొసగకున్నా
మనసుని సముదాయించి
కలుపుకుని ముందుకు సాగి పోవాల్సిందే....

కాళ్ళ కింద ఇసుక కదిలినట్లు
బతుకు జారి పోయినట్లవుతుంది
ఒక్కసారిగా చీకటి అలుముకుంటుంది
తూలిపడ్డా దిగులు పడ్డా తొందరగా
తిరిగి నువ్వు నిలదొక్కుకోవాల్సిందే...

కోరకుండానే కెరటం ఒకటి
కాళ్లను కౌగిలించుకుని వెళ్తుంది
అమ్మాయి కూడా అంతే
ఆశల్ని వెదజల్లి బ్రేక్ అప్ చెబుతుంది
జ్ఞాపకాలతో పాత పాట పాడుకోవాల్సిందే....

తనలో ఎన్ని నీళ్లున్నా
దాహం తీర్చక నిరాశ పరుస్తుంది
బంధాలు అనుబంధాలు అంతే
ఆప్యాయతలు అనురాగం అందక పోవచ్చు
తపిస్తునే గడపాలేమో కడ వరకు...

నేనేం చెప్పనూ
అంతా సముద్రమే చెబుతుంది
ఒక హద్దు వరకూ హాయిగా
మతి చెడి మోహం చెందితే
జీవితం వెనక్కి రాదు సుమా....



నాటి కథ

# సియాసీ సభలు

నాటి ప్రజల్లో క్రమంగా విరిసిన చైతన్యం చిత్రించిన కథ

బెల్లంకొండ నరసింహాచార్యులు

రెండు దినములైంది. ఆ వూరిలో ఎంత వెతికినా ఒక్క కోడి అయినా దొరకలేదు. అమీన్ సాబు కోరిక తీరలేదు. ఊరిలో నిలబెట్టి తలొకరికి చెంపవాత పెట్టినాడు. రైతులు ఒకరిలో ఒకరు మాటలాడుకొని పరికాపుల బండకు పోయి బలిసిన కోడిని తేవడానికి పాముల బండ నించి బయలువెడలినారు. ఆ వూరికి ఈ వూరికి చుట్టరికాలు ఎక్కువ. ఒక మాట మీద నిలబడే వారూ ఆ వూరిలోన్నూ, ఈ వూరిలోన్నూ సమానంగా యున్నారు. అయిననూ పరికాపుల బండలో నాలుగు వందల ఇండ్లు వుంటయి. ఇర్వై కోమట్ల కుటుంబాలు, ఇర్వై రెడ్ల కుటుంబాలు బతకవచ్చిన శ్రీ వైష్ణవుల కుటుంబము, స్థానికత్వం వున్న అధికార రాజాశ్రితమైన పది పురోహిత కుటుంబాలు, ప్రభువుల కార్యాలు నెరిపే కరణాలు, దేశ్పాండ్యలు, మామిళ్ళ, జామ తోటలు కలిగి పెద్దపెద్ద గచ్చుబావులు విశాల భవంతులు కలిగిన సలాం జాగీరుదారులు, రెండు వందలు కాపు కష్టం చేసుకునే వారి ఇండ్లు, నూరు మాల, మాదిగవారివి, తక్కినవి ఇతర జాతులవి ఇండ్లు వుంటయి.

పాముల బండ మూడువందల ఇండ్లు గల చిన్నవూరు. దొంతి వారి యేలు బడిలో నర్సాపురం మైబేలి చెప్పుచేతలో చివరకు హైదర్ ఆధిపత్యంలో భవిష్యత్తు

**కీ.శే.** బెల్లంకొండ నరసింహాచార్యులు (1896-1947) : తూప్రాన్ సమీపంలోని వడ్డేపల్లి గ్రామంలో జన్మించారు. అష్టావధానులుగా ప్రసిద్ధులు. 'దేశబంధు' అనే పత్రికను దాదాపు మూడు సంవత్సరాలు నడిపారు. నిజాం వ్యతిరేక పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. 'ఆంధ్ర రామాశ్వమేధం', 'ఆంధ్ర విశ్వ గుణదర్శనం', 'చారుమతి పరిణయం', 'కీచకవధ', 'కనకసేన విజయం', 'రాజహంసోపాఖ్యానం', 'చీనాసుందరి' నవల వీరి ప్రసిద్ధ రచనలు.

అరచేతుల ప్రాణాలు పెట్టుకొని ఉన్నది.

* * *

చెరువు దిగితే పరికాపుల బండ రాజయ్య ఎదురుగా వచ్చినాడు. చెప్పకుండ చెయ్యకుండ ఇదేం రాకయని ఆశ్చర్యంగా అడిగినాడు రాజయ్య.

'అమీన్ సాబ్ ఆజ్ఞ మంచి కోళ్ళు కావలె, లేనిచో రిక్తహస్తాల వూరు విడిచిపోలేము' దిగులుతో అన్నాడు శేఖరము.

'వైశాఖ మాసమనిన్నూ అంగ్రేజీ వారికి చక్కని మామిళ్ళు కొనిపోయి ఇచ్చుటకు పట్నం జాగీర్లు, దొరలు, పటేళ్ళు వూరిలో తిష్ఠవేసినారు. ఇక్కడ ఏ ఇంట వెతికినా కోడి రెక్కలయిననూ దొరకవు'.

'ఇంకనూ నిరాశయేనా?'

నిరాశపడకు. నీకొక రహస్యము చెవిన వేసెదను.

'అది యేమిటి?'

'ఈ ఊరికి శ్రీనివాసాచార్యులనే అయ్యగారు వచ్చియున్నాడు. గుడిపూజ ఒకటే కాదు. మాపటికి భక్తజనుల హరికథ, ఏకాదశి, పున్నమి అమావాస్యల నాడు భజనలు చేయుచున్నవాడు. గుడికింద అద్దెకరం చాలీచాలని భూమియున్నది. పోయినేడు కరువున అరిష్ట పూజలని రోజుకొక ఇంటివారు పూజలు చేయించి, అన్నతర్పణం చేయించినరు. పురోహితు లకు ఆయనంటే చాలా ఆగ్రహం. ఏ శాస్త్రంలో చెప్పనిది చేయడం యెందుకని వారి రంధి. బ్రాహ్మణ దానం, గోదానం, భూదానం, స్వర్ణదానం చేయాలని వారు సూచించిన వెంటనే ఆ వూరి దొరలకు గురి కుదరలేదు'.

'ఇదంతా ఎందుకు చెప్పుము! కోళ్ళు కావలయును ఇప్పుడు...' మరేదో పట్టకబోయాడు.

'ఆ విషయం చెప్పే ముందు చాలా విషయాలు గ్రహించాలి. ఓపిక పట్టుము. అక్కడున్న బూరుగు వృక్షం క్రింద తూమురాత మీద కూర్చుందము. మీ

పూరిలో చర్చించు విషయములు పెక్కుగా కలవు. నా అయ్యగారు కష్టకాలమున పూరిని ఆదుకొనుటయే కాదు. చాలా క్రొత్త విషయములు చెప్పుచూ హరికథలూ దేవాలయ కార్యక్రమములు నిర్వహించు చున్నాడు. రంగంప్యాట, జ్యోగిప్యాట, అందవోలు, టేకుమళ్ళ, పొట్లంచెరు, భిక్కనూరు పర్యంతము దేవాలయాలలో పలు భక్తులను పలు కార్యక్రమములకు సమాయత్తం చేయుంచి యా సియాసీ సభలకు యోచన చేయుచున్నాడు. ఇది బ్రహ్మ రహస్యము సుమ!'.

'సియాసి సభలు అంటే?'

'నిజాము రక్కసి ఫర్మానాలను ధిక్కరించి మెదులుకొను వ్యూహము'.

'ధిక్కరించి బతుకుతామా?'

'బతికినన్ని దినములైనను చాలు పూరు వాడ కదిలితే. ఊరిలోపల వారి కుటుంబాలు మూడు వందలకు పైగా మన వారలు ఒక్కటి కావలయు'నని చెప్పియున్నాడు.

'అది అట్లుంచుము. మనకు కోళ్ళ సంగతి...'

'శ్రీనివాసాచార్యులు పది కోళ్ళను కమ్మి యున్నాడు. మా పూరు ఫలానా అని చెప్పి అమీన్‌సాబు దెబ్బలన్నీ చూపి మార్గం చెప్పుమను... పూరి ప్రవేశం అయిన వెంటనే కుడిపక్క గుడి వెనక అతని నివాసగృహము'.

★ ★ ★

ఠీకు ఠాకున నలుగురు అయ్యగారి వద్దనించి సెలవు తీసుకొని వెళ్ళిపోయి నారు. రాజయ్యతో సహా ఐదుగురు శ్రీనివాసాచార్యులకు దండం పెట్టినారు.

'పంచదాసుడను దండ ప్రణామముల అయోగ్యునని ప్రతిదండము సమర్పించెను. మీదుగా చల్లగా నూరెండ్లు బతకాలె'.

'ఏమి కావలయును ఏపూరి వారలు?'

'నేను రాజయ్య వీడు రాయగడ సత్తినారి, పెంటి, నర్సి అయ్యగారూ! మాది పాములబండ. రెండు దినములుగా అమీన్ సాబ్ కోళ్ళ కొరకు ఆజ్ఞ చేయుచుండిరి. పూరినందు దొరకక ఈ పూరికి వచ్చితిమి. పూరు, వాడ చెప్పుకొనగా మీ సహాయము కొరకు వచ్చితిమి'.

'సరియైనచోటకే వచ్చితిరి'

'ఆ బావి దగ్గర కాళ్ళు కడుగుకొని ఈ కుండలో నీరు త్రాగుము. సేద తీర్చుకొండి, కోడినిచ్చి పంపెదను' అని అనెను శ్రీనివాసాచార్యులు.

అప్పటికి సమయం మధ్యాహ్నము మండుటెండ జాము నిగనిగలాడుచున్నది. ఆకలితో వచ్చినవారిని వదలి కడుపులు నింపుకొనుట ఇష్టము కాక పొద్దటి ఆరగింపు పులిహోర సొండెలు కలిపిన తాంబాలము తీసి చూసి ఊరి పటేళ్ళు, మాలీ పటేల్, పోలీస్ పటేల్ కరణాలు అందరి ఇండ్లకు పంచగా మిగిలినది తలా పిడికెడు అయిననూ సరిపడుతుంది అని తలంచి అందున సొండెలు కలపడము వలన కడుపు నిండుతుంది. ఆరేడు దొప్పలలో నింపి ఇచ్చెను.

రాజయ్యతో సహా ఆరుగురు తమ దొప్పలయందు ప్రసాదం తీసుకొని వాకిలి మొకాన పోబోయిరి.

'కాదు అది తప్పు. లోపల కూర్చొని సేవించెదము. రండి!' అని పిలిచెను.

ఆశ్చర్యంగా వారు లోనికి వచ్చినారు.

'వెట్టి బానిస బతుకుల నించి బయటకు మార్గం వెతకాలి. మనం బయటకు పోతే అంతా వృథా, బయటకు వెళ్ళకూడదు. మనం కలిసి భుజింతము... వర్ణ వైశమ్యములు ఆవలకు మనుష్యులు లోనకు రావలయును'.

'అయ్యగారు, మీ గురించి చాలా తెలుసుకున్నాము. పూజారి అయివుండి మమ్ములను కలుపుకుంటిరా? దేవుడు ఏమి చెప్పెను? ఇల్లు మైలపడిపోదా?'

'అయ్యో! ఎంతమాట. పుట్టుక మైల, చావు మైల, మట్టి మైల, మనం మనుషులం మైల కాము. దేవుడు చెప్పింది ముక్తి. గజేంద్రుని మొసలి పట్టుకుంటే కాలు విదిలించి బయటకు లాగుచూ పోరినది. చివరకు చక్రము గల శ్రీకృష్ణుడ్ని పిలిచినది. కృష్ణుని చక్రాయుధము కదా ముక్తి కలిగించినది. మనమునూ అంతే. మనమునూ ముక్తి మార్గము చూసుకొనవలెను'.



'ముక్తి అనగా ఏమి?' నర్సి నోరు విప్పినాడు.

'అనగా ఇప్పుడున్న భయానక పరిస్థితులను తొలగించుకొని బయటపడుట ముక్తియే యనబడును'.

'ఇప్పుడు ఎటువంటి ముక్తి కోరుట ఉచితము? తిండి గింజలు లేని కరువు కాలము ముక్తికి ఎవరు వత్తురు?'

నాటి కథ

రాజయ్య సత్తితో అన్నడు.

'పెద్దోళ్ళ మీదికి ఎదురుపోతే బతుకనిస్తరా అయ్యగారు?'

'పూరిల అయ్య, అవ్వలకు తొవ్వ జూపాలె, మమ్ములను సయిస్తరా? సర్వం కోల్పోయి వున్నాము' అన్నడు పెంటయ్య.

అయ్యగారు గస్తీ నిషాన్ 53 గురించిన్నూ వెట్టిచాకిరీ తత్వము గురించిన్నూ బోధించినాడు. కూలి ఇస్తేనే పనులు చేయాలని చెప్పినాడు.

'సరె. ఇవాళ సాయంత్రము ఈ పూరిలో రేపు సాయంత్రము మీ పూరిలో 'కీచకవధ' ఉత్తర గోగ్రహణము హరికథ కథనము, భక్తజనులకు ప్రసాద వితరణము యున్నది. పూరిలో చాటింపు చేయ'మని చెప్పినాడు.

"ఇప్పటికి నొక కోడి గడ్డివాము నందున్నది, తీసుకొని పొ"మ్మనెను.

రెండో రోజు పాములబండ పూరియందు కీచకవధ హరికథ సమాప్తం అయినది.

తెల్లవారి బండమీద పూరి జనులందరూ సమావేశమైనారు. ఇట్టి విషయములను ఎవడో అమీను సాబ్ చెవిలో పూది వచ్చినారు.

పట్నం నించి వచ్చిన తబ్లిక్ సంఘము వార్ని దివాన్ఖాన్లో మర్యాదలు చేసి గుర్రమెక్కి వచ్చినాడు అమీన్సాబ్. ఇరుగ్రామాల వారందరున్నూ అక్కడనే దర్శనమిచ్చినారు.

అయ్యగారు "బ్రతుకు స్వాతంత్ర్యం" అనే పుస్తకం ఇచ్చినాడు. మా పూరి వారికి ధైర్యం వచ్చినది. అయినను చదవరాని బెంగవారిని కలవరపరిచినది.

కోమట్లు, ఖాన్గి పంతుళ్ళు, అయ్యవార్లు దేవాలయాలలో చదువు నేర్పాలని శ్రీనివాసాచార్యులు అవిద్యనొక లోపమయినందున పలువురిని కోరినారు.

అమీన్సాబ్ ఈ తతంగం చూసి కోపోద్రిక్తుడయినాడు. "ఖబడ్దార్.... ఇది యేం నాట్కం" అని గొంతు పెంచాడు.

"ఇది 'భక్తవిజయం' హరికథా కాలక్షేపం..." అయ్యగారు చెప్పబోయాడు.

"అరె బంద్! ఇది యేషం నాకి తెల్సు

**రాంరెడ్డి, సిద్దిరెడ్డి, పోలీస్ పటేల్, హన్మంతరావు జాగీర్లు కాపులను పిలిచినారు. భూమంతుల పరిచారక సేవలకున్నూ, వెట్టిచాకిరీకి ఎవరూ రాలేదు. అమీన్సాబ్కు కోళ్ళు రాక ఆగిపోయినవి. నాగళ్ళ జాగీర్దారులంతా ఏకమై మీటింగ్ వేసుకున్నారు. లాఠీలతో బయలుదేరి బలవంతంగా పనిచేయించాలని కసితో పూరిమీద పడ్డారు. అయ్యగారు భజన చేస్తున్నాడు.**

గస్తీ నిషాన్ 53 జారీ షురు అయ్యింది. తెలుసా లేదా! మీకీ సంగం! ఏందీ సమావేశం?"

ఎవ్వరూ మాట్లాడలేదు. అయ్యగారి మాటలు ఆగలేదు. ఏకాకి వంతున

"అచ్చా మీ సంగతి చెప్తా అనుకొంటూ అమీన్సాబ్ వెళ్ళిపోయినాడు.

పూరూరా సియాసీ సభలు ఫర్మానాలకు వ్యతిరేకముగా వ్యవహరించుటకు నిర్ణయించినారు.

వర్షాకాలం సమీపించినది. మృగశిర కార్తె తొలి చిన్కులు కురిసిపోయినాయి. పూరి జనానికి బావులు పంటలు లేకున్నను సిరికలవారికి అన్ని సంపదలే.

రాంరెడ్డి, సిద్దిరెడ్డి, పోలీస్ పటేల్, హన్మంతరావు జాగీర్లు కాపులను పిలిచినారు. భూమంతుల పరిచారక సేవలకున్నూ, వెట్టిచాకిరీకి ఎవరూ రాలేదు. అమీన్సాబ్కు కోళ్ళు రాక ఆగిపోయినవి. నాగళ్ళ జాగీర్దారులంతా ఏకమై మీటింగ్ వేసుకున్నారు. లాఠీలతో బయలుదేరి బలవంతంగా పనిచేయించాలని కసితో పూరిమీద పడ్డారు. అయ్యగారు భజన చేస్తున్నాడు.

"అరె పట్టండి! ఏక్ సౌగారోంకో! నీదీ యే పూర్? నీది రూపం ఏది? సియాసీ సభ చేస్తవ్రే! భజనకారుల తలలు పగులగొడుతున్న పోలీసులు, అయ్యగారి దగ్గరికి పోబోయారు.

భజన తాళాల చర్మపు తాళ్ళు అందుకొని భజనకారులు తిరిగి భటుల బొమికల పులకరం జ్వరం రగిలించినారు. అమీన్సాబ్ తోకముడవక తప్పలేదు.

★ ★ ★

పదిరోజులు గడిచిపోయినాయి. ఆ పూరిలో కలవారి పాయఖానాలు, పశువుల పాకలు కంపు కొడుతున్నాయి. వాకిట ముగ్గులు లేవు. వంటచెరుకు సరఫరా తరిగిపోయినది. బావిల నీళ్ళు తోడువారు లేరు. పశువులకు నీరు, గ్రాసం మాత్రం ఇంటికొకరు వచ్చి వేసి వెళ్ళిపోతున్నారు.

ఈ శికాయత్ మొహతమీన్లకు చేరింది. అమీన్సాబ్ అవమానంతో చెప్పుకోలేదు.

మొహతమీన్ గ్రామస్తులను విచారించినాడు. "అయ్యా ఈ అమీన్సాబ్ కలవారితో చేయికలిపి తీరిక లేని యెట్టి చేయించుతున్నాడు. రోజూ తన బంధుమిత్ర పరివారానికి కోళ్ళు, గొర్లు, మ్యాకల విందు, సుర విందు పండుగ చేయిస్తున్నాడు. లేదంటే చెంపదెబ్బలు పెట్టినా ఏమీ చేయలేని వారము. దొరలు వాతలు పెడుతున్నారు. మేమేం తిని బతకాలె! మాకీ అమీన్ సాబ్ వద్దు మేమీ పూరు విడిచి వెళ్ళిపోతాం" అని ముక్తకంఠంగా అన్నారు.

నలుగురి చేతిలో పత్రికలు, అణాగ్రంథాలు కనిపించసాగాయి. బలపంతో దిద్దిన చేతులు కాయలు గాసిన చేతులు మొహతమీన్ను హెచ్చరించినాయి. తక్షణమే అమీన్ను విచారించినారు.

బలం లేనిచోట ప్రమాదమని ఒక్క లిప్తపాటు ఇక్కడ వున్నా మంచిది కాదని గ్రహించినారు. అల్లా! ఖల్సా నిర్మాణంబులు సల్పుమనినాడా? ఖంగాల్ చేయుమనినాడా? తప్పు జరిగింది.

ఈ అమీన్ను ఇక్కడినుండి బర్తరఫ్ చేయుచున్నానని చెప్పి మొహతమీన్ వెచ్చగా జారుకున్నాడు. పూర్లు పూర్లన్నీ ఉమ్మడిగా సియాసీ ఆదర్శములను, గెలుపును పాటించినాయి.

క
వి
త



# పాట కథ చెప్పనా...?



ఎం. వి. ఉమాదేవి, 7842368534

పాటలేం చేస్తాయిలే
పలుకే పాషాణమైన చోట?
కన్నీరో, కలకల నవ్వో..
ఓ పాట వల్లనే కదా!
పాట జాతిని ఏకంచేస్తూ..
అణిచివేతకి రుధిరాన్ని మరిగించే పాటవుతూ..,
విజయానికి వేకువ పల్లవి!

ఓ వెన్నెల రాత్రిలో
పాట ఏకాంతానికే వన్నె తెస్తూ..
బుగ్గలు నిమిరిపోతుందిలా!
రావి ఆకుల్లా గలగల్లాడే పాట
ప్రతి సంజె వేళ గుమ్మానికి
వేలాడే దీపమౌతూ
పూరింటి కప్పుపై పాకిన
సొరకాయ పాదులా..
పాట మనిషికి నిలువెల్లా పాకుతూ...!

ఉత్తర దక్షిణ ధృవాల్లా ఉన్న
ఇందరు కలిసిపోయేది పాట కోసమేగా?
వేయిసార్లయినా,వేచి ఉండేలా చేసేది కేవలం పాటే!
ఉన్నట్టుండి ఉల్కలా రాలిపడే పాట,
చేలగట్ల వెంబడి వీచే పిల్ల తెమ్మెరలా
రైతన్న తలగుడ్డనూ, మట్టి అంటిన చేతులనీ పలకరిస్తూ...
రెల్లుపూలను స్పృశిస్తూ చెరువులో అలలవుతూ
తాటిచెట్టు పొడవునా సాగుతూ!

పాటల కొలనులో
పరవశించి పోతున్నా.. నిత్యం
పాట లేకుండా మనలేని హృదయం..
జీవితమంతా పాటకచేరిగా  తలుస్తూ..!

ఏ పాటా ఉపశమనం ఇవ్వలేని సమయానికి
అమ్మ జోలపాట గుర్తొచ్చి అక్కున చేర్చుకోదూ..!?
చర్విత చరణాలను దాచని పాట...
ముడిపడిన మనసుల్ని జ్ఞాపకం చేస్తుంది!
పొత్తిళ్ళ వెచ్చని పాట, చుట్టిల్లు దాటి..
చివరికి సమవర్తికి అతిథిగా విశ్రమిస్తూ..!!

# సాహిత్య చరిత్రను బహుజన మార్గం పట్టించిన దేవిప్రసాద్ యాదవ్

బహుజన సాహిత్య చైతన్యం..



డా॥ సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

విస్మరణకు, వివక్షకూ గురై మూలలకు (మార్జిన్స్‌కు) నెట్టివేయబడిన, ఉటంకింపులకు మాత్రమే పరిమితం చేయబడ్డ స్ఫూర్తి ప్రదాతలను, చరిత్రను, సంస్కృతిని, సమాజాన్ని రికార్డు చేస్తూ సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథాన్ని వెలువరించారు. ఎన్నో ఏండ్లుగా పరిశోధన చేసి రాసిన ఈ పుస్తకాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు 1949లో మొదటిసారిగా అచ్చేసింది. ఇందులో ప్రతాపరెడ్డి "మన తాత, ముత్తాత లెట్టివారై యుండిరో, మన అవ్వలు ఎట్టి సొమ్ములు దాల్చిరో, యెట్టి అలంకరణలతో నుండిరో, మన పూర్వులే దేవతలను గొలిచిరో, ఏ విశ్వాసాలు కలిగియుండిరో, ఏ యాటపాటలతో వినోదించిరో, దొంగలు, దొరలు దోపిడీలూ చేసినప్పుడు, క్షామాదీతి బాధలు కలిగినప్పుడెటుల రక్షణము చేసుకొనిరో, జాడ్యాల కే చికిత్సలు పొందిరో, ఎట్టి కళలందు ప్రీతి కలిగి ఏ యే దేశాలతో వ్యాపారాలు చేసిరో యనిన్ని తెలుసుకొనవలెనని మనకు కుతూలహముండును. అదే విధముగా మన తరమును గురించి ముందు వచ్చువారు తెలుసుకొన నభిలషింతురు. తేలిన సారంశమేమన సాంఘిక చరిత్ర మన చరిత్రయే! మనము కూడ చరిత్ర కెక్కదగ్గ వారమే!!" అని ముందుమాటలో



పేర్కొన్నాడు. అంటే ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ పట్టింపు, ప్రచారం, గౌరవం, గుర్తింపు లేని విషయాలని పరిశోధించి, ప్రయత్న పూర్వకంగా వెలుగులోకి తెచ్చి మనము కూడా చరిత్రకెక్క దగ్గవారమే! అంటూ ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రను రికార్డు చేసిండు. ప్రధానంగా సాహిత్య గ్రంథాల ఆధారంగా సామాజిక చరిత్రను రికార్డు చేసిండు. ప్రతాపరెడ్డి ప్రోత్సాహము, మార్గదర్శనము, శిక్షణలో రాటు దేలి ఆయన బాటలో నడిచిన సాహిత్య చరిత్రకారులు మల్యాల దేవిప్రసాద్ యాదవ్. ప్రతాపరెడ్డి లాగే ఈయన కూడా బహుముఖాలుగా పనిచేసిండు. రాసిండు.

1934లో సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ కవుల సంచిక తీసుకొచ్చి తెలంగాణ విస్మృత కవిత్వాన్ని, కవులను వెలుగులోకి తెచ్చిండు. తెలంగాణ ఘనతను, సాహితీ ప్రతిభను కులాల వారిగా లెక్కగట్టి మరీ చిత్రికగట్టిండు. ఆధునిక కాలంలో తెలుగు కవితా సంకలనాలకు దారులు వేసిండు. అదే బాటలో పయనిస్తూ దేవిప్రసాద్ యాదవ్ 1969లో 'మెదక్ మండల సాహిత్య చరిత్ర'ను రాసి మరుగునపడ్డ ఎందరో సాహితీవేత్తలకు చరిత్రలో సుస్థిర స్థానం కల్పించిండు. "తెలంగాణ కావ్యకళకు ఈ సంచిక వెలుగుబాటైంది" అని దేవిప్రసాద్ 'గోలకొండ కవుల సంచిక'ను కీర్తించిండు. సంచికలో దేవిప్రసాద్ కవిత్వం కూడా చోటు చేసుకుంది. అంతేకాదు ఈయన కొంతకాలం గోలకొండ పత్రికలో సబ్‌ఎడిటర్‌గా కూడా పనిచేసిండు. గోలకొండ పత్రికా కార్యాలయంలోని 'దర్బార్', సాహిత్య వాతావరణమే తర్వాతి కాలంలో ఆయన్ని పత్రికా సంపాదకునిగా, చరిత్రకారునిగా, సాహితీవేత్తగా, ఉద్యమ కారుడిగా, సంస్థల నిర్వాహకుడిగా, రాజకీయ నాయకుడిగా తీర్చిదిద్దింది. ఈ పత్రికా కార్యాలయంలో నిత్యం జరిగే గోష్టిలో పాల్గొనని తెలుగు సాహితీవేత్త లేరంటే అతిశయోక్తి కాదు. వీరందరిని దగ్గరి నుంచి గమనించి, వారి ప్రతిభా

పాటవాలను తెలుసుకోవడానికి దేవిప్రసాద్‌కు అవకాశం కలిగింది. ఈ ప్రభావమే ఆయన్ని పరిశోధకుడిగా, రచయితగా, కవిగా తీర్చి దిద్దింది. అంతకుముందే అనుముల వెంకటసుబ్రహ్మణ్య శర్మ దగ్గర విద్యాభ్యాసం చేసినవాడు కావడంతో విషయాలు ఈజీగానే అర్థమయ్యేవి.

1939 ఆ ప్రాంతములో దేవిప్రసాద్ యాదవ్ తన మకాంని సంగారెడ్డికి మార్చుకున్నడు. అక్కడే 1950లో 'పల్లెటూరు' అనే పత్రికను ప్రారంభించాడు. ఇందులో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్యాంశాలుండేవి. ఈ పత్రికలో సుప్రసిద్ధ నవలకారులు, కథకులు సర్వదేవభట్ల నరసింహమూర్తి (కవిరాజమూర్తి) ఉత్తర, దక్షిణ అనే మారు పేర్లతో సమాజం పోకడల గురించి విలువైన వ్యాసాలు రాసిండు. ఆయనప్పుడు ఇప్పటి ఇక్రిసాట్ (వ్యవసాయ శాఖ) (పటాన్‌చెరువు)లో పనిచేసేవారు. అంతేగాదు సి.నారాయణరెడ్డి లాంటి కవులు ఈ పత్రికలో కవిత్వమే గాకుండా రాజకీయ వ్యాసాలూ వెలువరించారు. కథలు కూడా అచ్చయ్యేవి. అంతేగాదు విస్మరణకు గురైన పాతతరం కవుల రచనలెన్నింటినో పత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చాడు. హైదరాబాద్ రాష్ట్ర అవతరణానంతరం ఈ పత్రిక తెలంగాణలో తెలుగు సాహిత్యానికి, సమాజాభివృద్ధికి విలువైన విశ్లేషణాత్మక రచనలతో వెలుగు దారులు వేసింది.

1950 ఆరంభంలో ఆంధ్రసారస్వత పరిషత్తు తరపున జిల్లాల్లో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేవారు. పాఠశాలల్లో తెలుగు బోధన కోసం కొన్ని పుస్తకాలు కూడా ఈ సంస్థ ప్రచురించింది. అంతేగాదు తెలుగు బోధనా పరీక్షలను కూడా నిర్వహించేది. ఈ పరీక్ష పాసయిన వారిని హైదరాబాద్ ప్రభుత్వం ఉపాధ్యాయులుగా నియమించేది! దీంతో ఈ సంస్థ తెలంగాణలోని పలు పట్టణాలకు విస్తరించింది. దాదాపు ఇదే సమయములో తెలంగాణ రచయితల సంఘం కాళోజి, దాశరథి, నారాయణరెడ్డి తదితరుల నేతృత్వంలో ఏర్పడి తెలంగాణాలో సభలు, సమావేశాలు నిర్వహించి సాహితీవేత్తల పుస్తకాలు అచ్చేసి ప్రోత్సహించింది. మెదక్ జిల్లా తూప్రాన్‌లో భారీ ఎత్తున దేవులపల్లి రామానుజరావు నేతృత్వంలో సాహితీ సభలు నిర్వహించారు. తర్వాత గడియారం రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆలంపూరులో కూడా ఈ సభలు జరిగాయి. ఈ సభల ప్రభావం మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రమంతటా ఉండింది. ఇట్లా సిద్దిపేట, సంగారెడ్డి, జోగిపేట, రామాయంపేట, సదాశివపేట మొదలైన ఉమ్మడి మెదక్‌జిల్లాలోని పలు పట్టణాల్లో మొదట సాహిత్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.




1916 నుంచి పత్రికల్లో వివిధ కవుల రచనలు, విమర్శలు చదువుతూ వస్తున్న దేవిప్రసాద్ తనకు సాహిత్యం పట్ల మక్కువ కలుగడానికి, పెరగడానికి గోలకొండ కవుల సంచిక, ఆంధ్రసారస్వత పరిషత్తు కారణమని స్వయంగా చెప్పుకొన్నాడు. సాహితీ సంస్థలు, సాహిత్యం పట్ల ఈ మమకారమే ఆయన్ని 'మెదక్ మండల సాహిత్య చరిత్ర' రచనకు పురికొల్పింది. ఈ రచన ఒక రకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అంతకుముందు ఏ బహు జనుడు చేయని సాహసమది. దేవిప్రసాద్ కూడా ఈ రచనను 'సాహసం'గానే పేర్కొన్నాడు. "శ్రీ ఆదిరాజు వీరభద్రరావు గారు గ్రంథము నాసొంతముగా బరికించి నా **సాహసము**నకు సంతసించి విషయ విభాగము, కాల విభాగము, అక్షర విభాగము, చారిత్రిక గ్రంథమునకు రూపములని కవుల వరుస కాల విభాగంగా నుండాలని తెలిపిరి" అని 'విజ్ఞప్తి' చేసుకున్నాడు. ఈ సూచనలన్నీ పాటిస్తూ మెదక్ మండల సాహిత్య చరిత్రను దేవిప్రసాద్ ప్రామాణికంగా వెలువరించారు.

సృజనాత్మక సాహిత్య రంగం ఇంకా చెప్పాలంటే మొత్తం రచనా రంగమంతా ఆది నుంచి పూర్తిగా ఆధిపత్య కులాల చేతుల్లో ఉన్నది. దానితోపాటు వాటి లోని లోటుపాట్లను ఎత్తి చూపడం, చరిత్రలో చిత్రికగట్టడం అంతా వారి అజమాయిషి లోనే ఉండింది. ఇట్లా బలంగా బ్రాహ్మణీయ భావజాలంతో నిండిన చరిత్రను బహుజన మార్గములోకి మళ్లించిన మహనీయుడు మల్యాల దేవిప్రసాద్. 'యాదవ చంద్రిక' పేరిట పురాణ కాలము నుంచి ఆధునిక తరం వరకు యాదవుల చరిత్రను రికార్డు చేసిండు. ఇందులో శ్రీకృష్ణుడు మొదలు

సీరియల్

తెలంగాణ సంస్కర్త సంగెం సీతారామయ్య యాదవ్ వరకు యాదవ చరిత్రను రికార్డు చేసిండు. గొల్లకొండయే గోలకొండ అని సురవరం చేసిన ప్రతిపాదనను స్థిరీకరించాడు. అట్లాగే "మెదక్ మండల సాహిత్య చరిత్ర"లో యజ్ఞ కృష్ణమదాస్, గడ్డం రామదాస్, ఎల్లాదాస్, పండరి రామానుజరావు, మఠం సిద్ధివీరయ్యలతో పాటు ఇంకా ఎందరో బహుజనుల సాహిత్యాన్ని చరిత్రలో రికార్డు చేసిండు. దాదాపు వందమంది మెదక్ కవులు ఇందులో నమోదయ్యిండ్రు. బౌద్ధయుగం మొదలు అసఫ్ జాహి కాలం వరకు మెదక్ జిల్లా వాసులు సృజించిన సాహిత్యాన్ని నీర క్షీర వివేకముతో అత్యంత శ్రమకోర్చి, పరిశోధన చేసి ఆదిరాజు వీరభద్ర రావు, గడియారం రామకృష్ణశర్మ, బిరుదురాజు రామరాజు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి లాంటి పండితులను మెప్పించేలా చరిత్రను రాసిండు.

ఈ పుస్తకానికి చారిత్రకంగా చాలా ప్రాధాన్యత ఉంది. ఆధునిక కాలములో తెలంగాణ సాహిత్య చరిత్ర రాసిన తొలి బహుజనుడు మల్యాల దేవిప్రసాద్. అట్లాగే తెలంగాణా నుంచే గాకుండా మొత్తం తెలుగు సాహిత్యములోనే జిల్లా సాహిత్య చరిత్రలకు తొలి అడుగు వేసింది కూడా ఈయనే! కందుకూరి వీరేశలింగం, 'కవిత్వవేది' కల్లూరు నారాయణరావు, నిడదవోలు వెంకటరావు, నేలటూరి వెంకటరమణయ్య, చాగంటి శేషయ్య, ఆరుద్ర ఇట్లా ఎంతోమంది సాహిత్య చరిత్రలు రాసింద్రు. కానీ వాళ్లంతా తమ ఆధిపత్య సామాజిక దృక్కోణం నుంచే చరిత్రను రికార్డు చేసింద్రు. బహుజన దృక్కోణంతో మరుగునపడ్డ మణులను వెలుగులోకి తెచ్చిన కీర్తి మాత్రం మల్యాలకు దక్కుతుంది.

ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర 1965 ఏప్రిల్ నుంచి సంపుటాలుగా అచ్చవడం ప్రారంభమయింది. అయితే ఇందులో తెలంగాణకు న్యాయమైన ప్రాతినిధ్యం దక్కలేదు. అంతే కాదు

**ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర 1965 ఏప్రిల్ నుంచి సంపుటాలుగా అచ్చవడం ప్రారంభమయింది. అయితే ఇందులో తెలంగాణకు న్యాయమైన ప్రాతినిధ్యం దక్కలేదు. అంతే కాదు దాదాపు ఇదే సమయములో తెలంగాణలోని జిల్లాల్లో సైతం రచయి తల సంఘాలు చురుగ్గా పనిజేయడం ప్రారంభమయ్యింది.**

దాదాపు ఇదే సమయములో తెలంగాణలోని జిల్లాల్లో సైతం రచయి తల సంఘాలు చురుగ్గా పనిజేయడం ప్రారంభమయ్యింది. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అంతకుముందు చురుగ్గా పనిచేసిన ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణ రచయితల సంఘం, సాధన సమితి తదితర సంస్థల కార్యకలాపాలు దాదాపుగా ఆగిపోయాయి. అయితే ఈ పరిస్థితిలో 1965 నుంచి క్రమేణా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇందుకు దేవులపల్లి రామానుజరావు చేసిన కృషి ప్రధానమైంది. ఆంధ్ర సారస్వత పరిషత్తు తరపున ఆయన స్థానికులను ప్రోత్సహించిండు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఏర్పాటైన తర్వాత దానికి తానే అగ్రసనాధిపత్యం వహించి తెలంగాణ కవులు, పండితులు, రచయితలకు ప్రోత్సాహమిచ్చాడు. దేవిప్రసాద్ రచనకు కూడా రామానుజరావు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ తరపున ఆర్థిక సహాయాన్ని అందించాడు. అంతేగాదు ఈ దశలో తెలంగాణాలో కొత్తగా వెలుగులోకి వచ్చిన కవులు, రచయితలు ఆంధ్రా వారితో సమంగా పోటీపడ్డారు. యువ రచయితలు, కవులు జిల్లాల్లో రచయితల సమితి, సంఘాలను ఏర్పాటు చేసింద్రు. ఇందూరు భారతి (నిజామాబాద్), యువరచయితల సమితి (నల్లగొండ), సిరిసిల్ల యువ సాహితీ సమితి, వరంగల్ మిత్రమండలి, మెదక్ జిల్లా రచయితల సంఘం, ఖమ్మం రచయితల సంఘం ఇందుకు నిదర్శనాలు. ఈ కాలంలోనే జిల్లా స్థాయి కవిత సంకలనాలు అచ్చయ్యాయి. ఇందులో భాగంగానే వనపర్తి నుంచి ఎస్వీ రామారావు 1966లో 'జ్యోతిర్మయి' పేరిట కవితా సంకలనం వెలువరించారు. ఇదే తెలుగులో తొలి జిల్లా కవుల కవితా సంకలనం. అంటే ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సురవరం తెలంగాణా నుంచే గాకుండా ఆధునిక కాలములో మొత్తం తెలుగు సాహిత్యములోనే తొలి తెలుగు కవితా సంకలనం "గోలకొండ" కవుల సంచిక వెలువరించారు. ఆ తర్వాత మూడు దశాబ్దాల తర్వాత ఎస్వీ రామా రావు 1965లో చౌడూరు గోపాల రావు తదితరులతో కలిసి వనపర్తి కేంద్రంగా పాలమూరు జిల్లా సాహిత్య సమితిని ఏర్పాటు జేసిండు. దీని తరపున జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. 1967 లో జిల్లా సాహిత్య సభలను ఘనంగా నిర్వహించారు. ఈ సమితి తరపున 'జ్యోతిర్మయి' పేరిట జిల్లా కవితా, కథా సంకలనాలు, ఆత్మకూరు, ఆలంపూరు సంచికలు వెలువరించారు.

తన సొంత జిల్లాలో జరుగుతున్న సాహిత్య కార్యకలాపాలు దేవిప్రసాద్‌లో స్ఫూర్తిని నింపాయి. ఇదే సమయములో సిద్ధిపేట నుంచి మెదక్ మండల రచయితల సంఘం తరపున జిల్లా స్థాయి కవితా సంకలనం 'సమర్పణ' వెలువడింది. దీనికి కొనసాగింపుగా 1967లో వేముగంటి నరసింహాచార్యులు, రంగ కృష్ణమాచార్యులు, వెల్దుర్తి మాణిక్యరావు, వీరాగౌడ్ తదితరుల ప్రోత్సాహము, ఆదిరాజు వీరభద్ర రావు సూచనలతో జిల్లా సాహిత్య చరిత్ర రచనకు నడుం బిగించాడు. ఇట్లా ఒక జిల్లా సాహిత్య చరిత్రను రాయాలనుకోవడానికి ప్రధాన కారణం ఆంధ్ర ప్రాంతం వారు రాస్తున్న

సీరియల్

సాహిత్య చరిత్రలో తెలంగాణ వారికి న్యాయమైన ప్రాతినిధ్యం దక్కక పోవడం. అందుకు ఆంధ్రా వారిని నిందించి ప్రయోజనం లేదని తలంచి లోటుని పూరించడానికి మెదక్ జిల్లా రచయితల సంఘం తరపున తానే పూనుకున్నాడు. ఈ ఖాళీలు పూరించేందుకు 1967 మార్చిలో జహీరాబాద్‌కు దగ్గరలోని 'కోహీర్' పట్టణంలో జరిగిన రచయితల సంఘం సమావేశంలో దేవిప్రసాద్ మొదటిసారిగా జిల్లా కవుల చరిత్రపై వ్యాసాన్ని చదివి వినిపించాడు. సభలో పాల్గొన్న వారందరికీ ఈ విషయాలు కొత్తగా ఉండడమే గాకుండా జిల్లా వారిగా గర్వపడేలా చేసింది. సభలో పాల్గొన్న పండితులందరి ప్రోత్సాహంతో సమగ్ర జిల్లా సాహిత్య చరిత్ర రాసేందుకు నడుం బిగించాడు. జిల్లా సంఘం తరపున ఇచ్చిన పత్రికా ప్రకటనలో కవులు, రచయితల సమాచారం కావాలని కోరిండు. కానీ అది ఆశించిన ఫలితమివ్వలేదు. దరిమిలా తాను జిల్లా వ్యాప్తంగా తిరిగి సమాచారాన్ని సేకరించుకోవడమే గాకుండా హైదరాబాద్‌లోని లైబ్రరీలు, సంగారెడ్డి జిల్లా గ్రంథాలయం నుంచి, పండితుల నుంచి సమాచారాన్ని సేకరించుకున్నాడు. బౌద్ధ వాఙ్మయాన్ని అధ్యయనం చేశాడు.

రెండున్నర సంవత్సరాల నిరంతర పరిశోధన, ఆదిరాజు, గడియారం, బిరుదురాజు తదితర పండితుల సూచనలను క్రోడీకరించి దాదాపు సమగ్రమైన జిల్లా సాహిత్య చరిత్రను వెలువరించాడు. అమీన్ ఖాన్ వంటి ముస్లిం సాహితీ పోషకుల ఔదార్యాన్ని, మల్లినాథ సూరి, కపర్ది తదితరుల పాండిత్యాన్ని చర్చించి సోపపత్తికంగా రికార్డు చేసిండు.

పరిశోధన 1967లో ప్రారంభమయి నప్పటికీ పుస్తక ప్రచురణ 1969లో జరిగింది. అప్పటికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఊపు మీద ఉండింది. దీంతో ఈ పుస్తకం తొలిదశ తెలంగాణా ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచింది. మనమూ చరిత్రకెక్క దగ్గవారమే అని తెల్పి చెప్పింది. ప్రధాన స్రవంతి చరిత్రలో విస్మరణకు, వివక్షకు గురైన విషయాలను పట్టించుకొని కొత్త విషయాలను వెలుగు కాగడాగా అందించిన సందర్భమది. ఈ జిల్లా సాహిత్య చరిత్ర తర్వాతి తరం వారికి స్ఫూర్తిగా నిలిచింది. ఒక ఒరవడిని ఏర్పరిచింది. అకడమిక్ పరిశోధనలో భాగంగా గాకుండా తన తృప్తి కోసం చేసిన ఈ కృషి ఎందరికో మార్గనిర్దేశనం చేసింది. తృప్తికోసం చేసినా సమాజానికి ఎంతో అవసరమైన పని అనేది రూఢీ అయింది. తర్వాతి తరములో పాలమూరు నుంచి కపిలవాయి లింగమూర్తి, కరీంనగర్ నుంచి మలయశ్రీ, నిజామాబాద్ నుంచి నాగభూషణం, నల్లగొండ నుంచి శ్రీరంగాచార్య, వరంగల్ కు చెందిన శ్రీరంగ స్వామి ఇట్లా ఎందరికో దారి చూపింది. ఇటీవలి కాలంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి మొదలు చాలా మంది తెలంగాణ సాహిత్య చరిత్రలను రాసిండ్రు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొత్తగా 33 జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ 33 జిల్లాలకు సంబంధించిన మైక్రోస్థాయి చరిత్రలను వివిధ పరిశోధకులు, విమర్శకులు రాసే ప్రయత్నంలో ఉన్నారు. చాలా వరకు తెలంగాణ సాహిత్య అకాడెమి, తెలంగాణ సారస్వత పరిషత్తులు పుస్తకాలుగా వెలువరించాయి కూడా. వీటన్నింటికి పునాది వంటి పుస్తకం 'మెదక్ మండల సాహిత్య చరిత్ర'. కొన్ని సంస్థలు, విశ్వవిద్యాలయాలు కలిసి చేయాల్సిన పనిని ఒంటి చేత్తో చేయడమే గాకుండా సమగ్రంగా వెలువరించాడు. అందుకు ముందుగా మల్యాల దేవిప్రసాద్ యాదవ్‌కు వందనాలు. కస్తూరి రంగాచార్య, సేడిది విశ్వనాథం లాంటి వారు తమ కాలంలో పత్రికల్లో బాగానే ప్రచారంలో ఉన్నప్పటికీ ఇప్పటికీ ప్రధాన స్రవంతి సాహిత్యంలో భాగం కాలేదు. ఈ సాహిత్య చరిత్రలో వారి గురించి వివరంగానే రాసిండు.

1902లో పేద యాదవ కుటుంబంలో ప్రస్తుత వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో జన్మించిన దేవిప్రసాద్ యాదవ్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడం తో అక్కడికి సమీపంలోని కృష్ణా తీర గ్రామం గుమ్మడములో మేనమామల ఇంట్లో ఉంటూ పక్కనే గల యాపర్లలో విద్యాభ్యాసం చేశాడు. యాపర్లలో చాలా యేండ్లు విద్యాబోధన చేసిన అనుమల వేంకట సుబ్రహ్మణ్య శర్మ (1888-1959)కి దేవిప్రసాద్ ప్రియ శిష్యుడు. పెబ్బేరుకు దగ్గరలోని యాపర్ల గ్రామం సుప్రసిద్ధ సంస్కర్త, విద్యాదాత వామన నాయక్ జాగీరు గ్రామం. నాయక్ కోరిక మేరకు యాపర్లలో ఉపాధ్యాయునిగా చేరిన సుబ్రహ్మణ్య శాస్త్రి ఉర్దూలో నాలుగో తరగతి వరకు చదువుకున్న దేవిప్రసాద్‌కు సంస్కృతాంధ్రాలు నేర్పించాడు.


దేవిప్రసాద్‌కు ఆ పేరు రావడానికి కూడా ఒక చరిత్ర ఉంది. తల్లిదండ్రులు పెట్టిన పేరు సాయిలు. ఒకరోజు సాయిలు తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబీకులందరూ ఆయన ప్రాణాలపై ఆశలు వదులుకున్నారు. అయితే సుబ్రహ్మణ్య శర్మ జోగులాంబా దేవిని నమ్మిన వాడు కావడంతో పిల్లవాణ్ణి తన చేతుల మీదుగా దేవి ముందుంచి పూజలు చేయించడం జరిగింది. ఏమైతేనేం తర్వాత సాయిలుకు స్వస్థత చేకూరింది. అప్పటి నుంచి అతనికి దేవిప్రసాద్ (దేవీ ప్రసాదం) అని నామకరణం చేయడం జరిగింది. యాపర్లకు సమీపంలోని ఇటికాలపాడులో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి, అలాగే ఆంధ్ర బిల్హణ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, ప్రఖ్యాత పరిశోధకులు, నన్నెచోడుడే ప్రథమాంధ్ర కవి అని ప్రతిపాదించిన పరిశోధకుడు మానవల్లి రామకృష్ణ కవి, కవి, పరిశోధకులు గడియారం రామకృష్ణ శర్మలతో కూడా దేవిప్రసాద్‌కు సాన్నిహిత్యముండేది. వీరి సాంగత్యం వల్ల కవిత్వం కూడా రాశాడు.

వివాహానంతరం తన మకాంని 1939 ఆ ప్రాంతంలో మెదక్ జిల్లా సంగారెడ్డికి మార్చుకున్న దేవిప్రసాద్ అక్కడ గ్రామీణ రైతులు, ప్రజల అభ్యున్నతికి పాటుపడే

ఉద్దేశంతో 1951 నవంబరులో 'పల్లెటూరు' అనే పక్షపత్రికను ప్రారంభించాడు. ఇందులో సి. నారాయణ రెడ్డి తొలి కవితలు అచ్చయ్యాయి. ఈ పత్రిక ప్రచురణారంభంలో మాడపాటి హనుమంతరావు, సురవరము ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, వావిలాల గోపాలకృష్ణయ్య, పులిజాల హనుమంతరావు, దాశరథి, ఇలా అనేక మంది ఆశీస్సులందజేశారు. ఇందులో ఒద్దిరాజు సీతారామచంద్రరావు, సర్వదేవభట్ల నరసింహామూర్తి, పి.ఎస్.ఆర్. ఆంజనేయ శాస్త్రి, వీరమల్లాగౌడ్, తూములూరు వెంకటశాస్త్రి, ఆకెళ్ళ సుబ్రహ్మణ్య కవి ఇలా ఎందరో తమ కథలు, గేయాలు, వ్యాసాలు వెలువరించారు. ఈ పత్రిక ఆనాడు సమాజంలో నెలకొంటున్న మార్పులకు దర్పణం పట్టింది. వివిధ అంశాలపై విమర్శనాత్మక వ్యాసాల్ని దేవిప్రసాద్ స్వయంగా ప్రకటించడమే గాకుండా ఎన్నో జానపదాలను సేకరించి వెలువరించాడు. పత్రిక సంపాదకీయాలు కూడా ఘాటుగా ఉండేవి. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ఈ పత్రిక నిలదీసింది. ఇది మూడేళ్ళు నిలదొక్కుకుంది. ఇందులో ఎంతో మంది నూతన రచయితలకు ప్రోత్సాహమిస్తూ వారి కవితలు, కథల్ని దేవిప్రసాద్ అచ్చేశాడు. ముల్కీ గైర్ ముల్కీల గొడవ సందర్భంగా రాసిన సంపాదకీయం ఆనాటి పరిస్థితికి అద్దం పట్టింది.

సంపాదకుడిగానే కాకుండా మెదక్ జిల్లా రచయితల సంఘ స్థాపక ఉపాధ్యక్షుడిగా, ప్రచురణకర్తగా ఎన్నో విలువైన పుస్తకాల్ని వెలువరించాడు. 1964లో మఠం సిద్ధివీరయ్య, వేముగంటి నరసింహాచార్యులు, చిదిరె లక్ష్మణ శాస్త్రి, యం. రంగకృష్ణమాచార్యులు, వీరమల్లాగౌడు, దేవిప్రసాద్ యాదవ్ పూనిక మేరకు ఆ సంఘం ఏర్పాటయింది. సంఘం ఉపాధ్యక్షుడిగా ఉంటూ ఆ సంఘం తరఫున మొట్టమొదటి పుస్తకంగా 'సమర్పణ' అనే కవితా సంకలనం వెలువడింది. ఇందులో మెదక్ జిల్లాకు చెందిన 37 మంది ప్రముఖుల కవితలున్నాయి.

రచయితల సంఘం కార్యకలాపాలు ఊపందుకోవడంతో సభ్యుల నుంచి జిల్లాకు సంబంధించిన సమగ్ర చరిత్ర రాయించాలని డిమాండ్ వచ్చింది. దీంతో ఈ కార్యాన్ని ఒక బాధ్యతగా స్వీకరించి తెలుగులో ఒక జిల్లాకు సంబంధించిన సమగ్ర సాహిత్య చరిత్రను, కవుల జీవితాలను చిత్రిస్తూ 'మెదక్ మండల




సాహిత్య చరిత్ర'ను 1969లో వెలువరించాడు. 213 పేజీల ఈ పరిశోధన గ్రంథంలో ఎన్నో కొత్త విషయాలను తెలియజేసి తెలంగాణ పరిశోధన రంగానికి జిల్లా వారిగా రచనలు చేయడానికి దారులు వేసిన మార్గదర్శి మల్యాల దేవిప్రసాద్.

ఈయన రచనల్లో నారద గర్వ భంగము, శివహరి శతకం, విశ్వ రూపానంద శతకం, రంగ శతకం, కృష్ణార్జునోపదేశం (తత్వాలు), సనాతన ధర్మంలోని శుద్ధి, సంగమేశ శతకము, భారతోదయము (పద్యకృతి), యాదవ చంద్రిక (గొల్లల వంశోన్నతి గురించినది) మెదక్ మండల నగరములు (అముద్రితము?), అభినవ జేబి వైద్యము, ఖండకావ్యములు, చాటువులు మొదలైనవి వెలువరించాడు. ఈయన రచనలు ఆనాటి గోలకొండ, పల్లెటూరు పత్రికల్లో చోటుచేసుకున్నాయి.

అలాగే ఆయన సేకరించిన జానపద గేయ సాహిత్యం, విమర్శా రచనలు పరిశోధకులకు అందుబాటులో లేవు. అవి అందుబాటులోకి వచ్చినట్లయితే తెలంగాణ సాహిత్యంపై సమగ్రమైన, సాధికారమైన చర్చ జరగడానికి, న్యాయంగా దానికి దక్కాల్సిన స్థానం గురించి అంచనా వేయడానికి వీలవుతుంది.

దాదాపు 40 ఏళ్ళపాటు మెదక్ జిల్లాలో ఏ ప్రజాహిత కార్యం జరిగిన అందులో ముందుండిన వ్యక్తి దేవిప్రసాద్ అంటే అతిశయోక్తి కాదు. అవసాన కాలంలో నివాసాన్ని హైదరాబాద్‌లోని సీతారాంబాగ్‌కు మార్చాడు. అక్కడే 1982లో ఆ ప్రాంతంలో మరణించాడు. తాను పుట్టిన మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతి నెలా పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పల్లెటూరుతో పాటు వివిధ పత్రికల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేవాడు. మెదక్ జిల్లా మారుమూల ప్రాంతాల్లో కూడా సాహిత్య వాతావరణాన్ని విస్తరింప జేసి, వారిలోని ప్రతిభను వెలికి తీసి పత్రిక ద్వారా ప్రచురించిన దేవిప్రసాద్ యాదవ్ గురించి ఇప్పటి వరకూ సరైన సమాచారం ఎక్కడా రికార్డు కాలేదు. ఆయన కూతురు పుష్పలత కూడా కవిత్వం రాశారు. ఆవిడ తెలుగు అకాడమీ నుంచి ఉన్నత పదవిలో రిటైరయ్యారు. ఇంతటి వ్యక్తి గురించి 'మెదక్ సీమ విజ్ఞాన సర్వస్వం' వెలువరించిన శాస్త్రుల రఘురామశర్మ దేవిప్రసాద్ యాదవ్ గురించి రెండు పేరాల్లో రాసి అందులో

సీరియల్

ఆయన గురించి అన్ని తప్పుల్ని జొప్పించారు. దేవిప్రసాద్ ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన వాడని అందులో పేర్కొన్నాడు. సర్వస్వం లాంటి పుస్తకాల్లోనే ఆయన గురించి ఇన్ని తప్పులు ప్రచారం జరిగాయంటే దేవిప్రసాద్‌కు జరిగిన అన్యాయం తెలుస్తుంది.

తెలంగాణ సమాజానికి ఎనలేని సేవ చేసిన దేవిప్రసాద్ అటు పరిశోధనలోనూ, పత్రికారంగంలోనూ తన కంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. దేవిప్రసాద్ రాసిన 'మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర', 'యాదవ చంద్రిక' గురించి మాత్రమే అంతో ఇంతో కొద్ది మందికైనా తెలుస్తుంది. అయితే ఆయన రచనలన్నీ సేకరించి సమగ్రంగా పుస్తకాల రూపంలో తీసుకువచ్చినట్లయితే భవిష్యత్తరాలు కూడా తెలుసుకునే అవకాశముంది. లేనట్లయితే ఒక మాణిక్యం మట్టిలోనే కనుమరుగయ్యే ప్రమాదముంది. ఇటు మహబూబ్‌నగర్, అటు మెదక్, హైదరాబాద్ అంతటా ఆయన పర్యటనలు జరుపుతూ తెలంగాణలోని వివిధ జిల్లాల మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించాడు.

దేవిప్రసాద్ రాసిన బహుశా తొలి కవిత 'యాదవ ప్రబోధము' పేరిట గోలకొండ కవుల సంచికలో చోటు చేసుకుంది. అదిలా ఉన్నది.

"సీ. విశ్వమంతట మహా వినుత మౌ యాదవ
వంశంబు నిలఁబెట్టి వరలె నెవఁడు
కాఁపింటి బిడ్డఁడై దాపుఁజేఁరగవచ్చి
యల్లుఁడై దేవుఁడై యలరె నెవఁడు
ఖడ్గతిక్కన స్వాన ఘట్టాన పసుపుంచు
దుర్విధిఁగూర్చిన దొడ్డ యెవఁడు
ఆహ్లాదకరమన యక్షగానాదుల
రచయించి సత్కీర్తిఁ గ్రాలె నెవ్వఁడు
గీ. డట్టి కృష్ణుండు, మైలారు నధిపుడైన
కాటమ విభుండు యాదవ కవివరుండు
గలరు వేల్పులు శూరులు కవులు చాల
యాదవా! మేలుకొనుము నీ యాత్మఁదలచి"

అంటూ తన యాదవ కులం ప్రాశస్త్యాన్ని, వైభవాన్ని ఈ పద్యాలలో వివరించాడు. తెలుగు, సంస్కృతముతో పాటు హిందీ, ఉర్దూ భాషల్లో సైతం నిష్ణాతుడైన దేవిప్రసాద్ 'మెదక్ మండల సాహిత్య చరిత్ర' కోసం వివిధ భాషల్లోని గ్రంథాలను కూడా అధ్యయనం చేశాడు. అవలోకించారు.

పల్లెటూరు పత్రికను నడపడమే గాకుండా మెదక్ మండల రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు సంగారెడ్డి శాఖ వ్యవస్థాపకుడిగా, మెదక్ జిల్లా ఆయుర్వేద సంఘం అధ్యక్షుడిగా, తెలంగాణ రచయితల సంఘం సంగారెడ్డి శాఖాధ్యక్షుడిగా, సంగారెడ్డి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్‌గా ఇట్లా అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే పరిశోధనా రంగంలోనూ రాణించారు. ఈ సాహిత్య చరిత్ర గ్రంథంలో బౌద్ధం, జైనులు, వీరశైవంకు సంబంధించిన సాహిత్యాన్ని కూడా రికార్డు చేసిండు. గ్రంథాలే గాకుండా శాసనాల ఆధారంగా సాహిత్య చరిత్రను రాసిండు.

మెదక్ మండల సాహిత్య చరిత్రను సరళమైన భాషలో అందించాడు. నిజానికి తెలంగాణలో మెదక్ జిల్లాకు ఒక విశిష్టస్థానమున్నది. ఈ జిల్లాలో తెలుగుతో పాటు ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషా ప్రభావం బాగా ఉంటుంది. కర్నాటక, మహారాష్ట్రకు సరిహద్దు జిల్లా కావడంతో ఇక్కడి పాఠశాలల్లో కన్నడ, మరాఠీ ఇప్పటికీ బోధిస్తారు. ఈ భాషల ప్రభావం ఇక్కడి రాతల్లోనూ కనబడు తుంది. బ్రహ్మశివుడు అనే పొట్లచెరువు కవి కన్నడంలో రాసిన రచనతో ఈ పుస్తకంలో సాహిత్య చరిత్ర ప్రారంభమ వుతుంది. అమీన్‌ఖాన్ వంటి సాహితీ పోషకుడి గురించి ఈ సాహిత్య చరిత్రలో వివరంగా ఉన్నది. వివిధ ప్రక్రియల్లో సృజించిన సాహిత్యాన్ని ఇందులో చిత్రికగట్టిండు. ఇందులో ప్రధానంగా సాహిత్య చరిత్ర ఉన్నప్పటికీ భౌగోళిక, సామాజిక చరిత్ర కూడా విస్తారంగా ఉన్నది. కొండాపూర్‌లో ఖరోష్టి, బ్రహ్మీలిపులున్నాయని కూడా చెప్పిండు. ఒకప్పుడు ఇక్కడ సంస్కృత సాహిత్యం పరిఢవిల్లింది. త్రైలోక్య మల్లుని ఢాకూరు శాసనం, మల్లినాథుడు, ఆయన కుమారుడు కపర్దిల రచనలు అన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. వీటన్నింటిని దేవిప్రసాద్ ఈ గ్రంథంలో వివరంగా చర్చించిండు. నిజానికి సాహిత్య చరిత్ర సరిగ్గా అర్థం కావాలంటే భౌగోళిక చరిత్ర అర్థం కావాలంటూ మెదక్ పేరు క్రీస్తు పూర్వ 200 నుండి 1303 క్రీస్తు శకం వరకు చలామణిలో ఉందని రాసిండు. ఆ తర్వాత గుల్షనాబాద్‌గా మారిన తీరుని కూడా చెప్పిండు. గ్రామ నామాలను సైతం వివరంగా చర్చించిండు. మెదక్ ప్రాంతానికి ఒకప్పుడు 'కాసలనాడు' అని పేరుండేది. అట్లాగే ప్రదేశము కూడా ఇప్పటి నిజామాబాద్ జిల్లాలోని కొంత ప్రాంతము కూడా చేరి ఉండేది. అందుకే ఈ పుస్తకంలో కామారెడ్డి, బిక్కనవోలు, ఎల్లారెడ్డి లాంటి ప్రస్తుత నిజామాబాద్ జిల్లా ప్రాంతాల వారి సాహిత్యం కూడా ఇందులో చోటు చేసుకుంది. ఈ ప్రాంతాలు ఇప్పటికీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో భాగంగా ఉన్నాయి.

ప్రపంచ కథా వాఙ్మయంలో మొదటిది 'బృహత్కథ'. దీన్ని చెప్పింది గుణాఢ్యుడు. ఈయన మెదక్ జిల్లా వాసి. అట్లాగే పొన్నెగంటి తెలగనార్య రాసిన 'యయాతి చరిత్ర', కాళిదాసు సంస్కృత కావ్యాలకు వ్యాఖ్యానం వెలువరించి ఆయన ప్రతిభను ప్రపంచమంతా చాటినది కొలాచలము మల్లినాథసూరి. వీరందరూ మెదక్ జిల్లా వాసులే! వీరి చరిత్రను తవ్వి కాగడాలుగా వెలిగించిన ఖ్యాతి దేవిప్రసాద్‌కు దక్కుతుంది.

ఇప్పటికైనా దేవిప్రసాద్ యాదవ్ రచనలపై సమగ్ర పరిశోధన జరగాల్సిన అవసరమున్నది. ఆయన రచనలన్నీ ఒక్కదగ్గరికి వచ్చినట్లయితే పరిశోధనకు దారి ఏర్పడుతుంది. అందుకు పాలమూరు మిత్రులు పూనుకోవాలని ఆశిస్తూ...



# వచనకవితా పితామహుడు కుందుర్తి

"స్వార్థం కట్టిన గులకరాళ్ళ
వంతెనే ఆలంబనగా
సామాన్యుల బతుకు
బాటకొక లంబంగా
ప్రగాడ కాంక్షలతో
ప్రతినిమిషం బతుకు మీద
ఆంక్షలతో
పరిపాలన సాగింది" (తెలంగాణ)

అంటూ పాలకుల నయవంచనను ఎత్తిచూపిన కవి కుందుర్తి ఆంజనేయులు.

"దీనికి కురవడం రాదు
పేదల్ని కరవడం ఒకటే వచ్చు
నేల మీద ప్రభువుల వాగ్దానాల
పాటకు పల్లవిగా
ఇది ఆకాశం
తొడుక్కున్న
అబద్ధాల ముసుగేమో!
ఈ వీస్తున్న గాలికి ఇది
ఇంకా
ఎంతసేపుంటుందిలే
ఆవిరితో కట్టిన ఈ గూడు
ఏమంత గట్టిగా నిలుస్తుందిలే"
(మేఘాలు)

అంటూ మేఘాల లక్షణాలను, ప్రభువుల ఆగడాలను తెలుపుతూ పేదలపట్ల కరుణ చూపాలంటాడు.

"పూర్వం ఒకనాడు
ఒక రాజు యింకోరాజును
దండెత్తి ఓడించాడు
ఓడినరాజు వారసులు విజేత రాజును బలిగొని
అతని రాజ్యం ఆక్రమించాడు ."

అని పూర్వ రాజులకాలం నాటి స్థితులను కళ్ళకు గట్టాడు.

కుందుర్తి ఆంజనేయులు 16 డిసెంబర్ 1922న గుంటూరు జిల్లా నరసరావుపేటలోని కోటవారి పాలెంలో జన్మించారు. ఆయన 1977 సంవత్సరపు సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. ఆయనను "వచన కవితా పితామహుడు" (గద్య కవిత్వ పితామహుడు) అని కూడా పిలుస్తారు. అతని రచనలు సౌప్తికం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగారా, తెలంగాణ, దండి యాత్ర, ఆశా, నగరంలో వాన, నాలోని వాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేను కాస్త ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, బతుకు మాట మొదలైనవి. 1977లో తెలుగు రచయితలకు సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన కుందుర్తికి "ఫ్రీ వెర్స్ ఫ్రంట్" అనే గ్రూపును ఆయన స్థాపించి 1967 నుండి బహుమతులు అందజేస్తున్నారు. ఫ్రీ వెర్స్ ఫ్రంట్ ప్రైజ్ ట్రస్ట్ 31 జూలై 1979న హైదరాబాద్‌లో స్థాపించబడింది. "నా ఊహలో వచన కవిత్వం అంటే ప్రజల కవిత్వం, నా కవిత్వానికి వ్యాకరణాలు ప్రజలు, నాకు నిఘంటువులు ప్రజల కవిత్వం, నాకు అలంకారాలు ప్రజలు" అని తన కవిత్వం గురించి కుందుర్తి చెప్పుకున్నాడు. "పాతకాలం పద్యమయితే వర్తమానం వచన గేయం" అని ప్రకటించుకున్నాడు. మహా భారతం తరహాలో తెలంగాణా పోరాట కథను 18 పర్వాలుగా విభజించి తొలిసారిగా వచన కవిత్వంలో మహా కావ్యాన్ని రాసిన ఘనత కుందుర్తి కే దక్కుతుంది.

వచన కవితోద్యమ నాయకుడిగా వచన కవితా ప్రచారకుడిగా, తెలుగు వాల్ట్ విట్మన్‌గా అభ్యుదయ కవితకు, వచన కవితకు పర్యాయపదంగా నిలిచిన కవిగా పేరుపొందిన కుందుర్తి ఆంజనేయులును కూడా ఈ తెలంగాణ పోరాటం (1946-51) కదిలించింది. వచన కవితా ప్రక్రియలో తొలిసారిగా 'తెలంగాణ' పోరాట కథను మహాకావ్యంగా రాయడానికి ఆయన పూనుకున్నారు. తెలంగాణ పోరాట కథను అవగాహనతో చిత్రించిన తొలి వచన కవితా మహాకావ్యం కుందుర్తి 'తెలంగాణ' ఒక్కటే అని చెప్పవచ్చు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, సోవియట్ లాండ్ నెహ్రూ పురస్కారాలు లభించాయి. 25 అక్టోబర్ 1982న ఆయన మరణించారు.




"ప్రయోజనం తండ్రి
పరమ సౌందర్యం తల్లి
పలికే ప్రతి వాక్కు రసానంద కల్పవల్లి
నా దారి నాది"

అంటూ కుందుర్తి చెప్పిన కవిత్వ ప్రయోజనం అందరికీ ఆచరణీయం.

కవిత



# నేనింక చావను



సైదాచారి మండోజు, 6300 235 079

ఒక సుదీర్ఘ స్వప్నాన్ని చిత్రించిన వాడిని
ఒక జీవన స్వప్న మాధుర్యాన్ని
కాలానికి బహుకరించేవాడిని
ఒక చరమాంకపు మైలు తీరానికి బాటసారిని

గగనానికి ఎగిసే కడలి అల లాంటివాడిని
గడిచినా కాలస్మృతులను
ఒక చరిత్రగా లిఖించుకునేవాడిని
చుట్టూ చిమ్మ చీకటివున్న మిణుగురినై విహరించేవాడిని
విధి వంచనకు తలవంచని వాడిని

నేనింక చావను
అవాంఛిత బాధల్ని గుండెకు హత్తుకున్నవాడిని
కన్నీళ్లను దిగమింగినవాడిని
కాలానికి ఎదురీదినవాడిని
గాయాలకు లేపనాలను అద్దినవాడిని
చిరునవ్వుల్లో అగ్ని కణాలు పూయించేవాడిని
విషాద బాధాగ్నిలో పునీతుడైన అక్షర గేయ కావ్యాన్ని....

నేనింక చావను
క్షణికావేశ భగ్న విలాప ప్రేమకు
మృత్యువాతపట్టని వాడిని
అహం అసూయ ద్వేషాలకు
రగిలి నెత్తుటి జలపాతం కురిపించనివాడిని

నేను ఇంక చావను
జనన మరణాల మధ్య
జీవనం ఒక నగ్న సారళ్య సౌందర్య
వాస్తవ అపురూప దృశ్యం అని ఎరిగినవాడిని
ఒక అద్భుత జీవన సంగ్రహ సారాంశం
స్ఫూరిస్తున్నవాడని....!


అందుకే నేనింక చావను
మరణాన్ని అరువుచాచుతా
మరణం మరణించే వరకు
మరణాన్ని ఊపిరిగా శ్వాసిస్తా

ఈ కాస్త కాలాన్ని జీవన స్వప్న
పలకపై అక్షరమై దిద్దుకుంటా
లక్షణమై మహానంద కావ్య లిఖితమై
శ్రీకారం చుట్టుకుంటా
మరణించాక కూడ జీవిస్తా
అందుకే నేనింక చావను...!!

క
థ

# నీర

దావతు కంటే ప్రేమే గొప్పదని చెప్పిన కథ




దోరవేటి
89788 71961


ఎండ సు...(రుమంటున్నది బయటికెళ్తే భగభగ లోపల గూసుంటె ధగధగ ఏం సుదురాయిస్తలేదు. కరోన కష్టం ఈరోజుంటది, రేబ్పోతది. కాలం కష్టం... ఎప్పటికుంటది!

అయినా పోయేదాని గురించి ఇప్పుడాలోచించుకొని నెత్తి కరాబ్ జేసుకునుడెందుకు గాని, ఈ 'ఎండల్ మండేలా ' నుంచి బయట పడుడెట్ల?.

"అరె ! మామా! డోర్ దియ్ రా! ఎక్కడెక్కడనో సోంచాయిస్తున్న రెడ్డి, జగదీశ్ గాని పిలుపుతో ఉలిక్కిపడ్డడు.

జగదీశ్ గాడొగ అగడ్తత్తం మనిషి. వాని పరిస్థితెప్పుడు లాగు దడుస్తున్నదేమో అన్నట్లే ఉంటది. లోపలికొచ్చుకుంటనే 'బట్టలేసుకో, సీరాములు గాడు ఫోన్ చేసిండు పోదం !' అన్నడు.

వాని తొందరపాటు తెలిసిన రెడ్డి తాత్పర్యంగ..... 'అరె! ఆ ఉరుకులాట లేందిరా బై. ముందు నీ భాష సక్కగ జేసుకో.... సీరాముల్లు - ఏందిరా? వాళ్ల అయ్య - అమ్మ - ఎంత మంచి పేరు పెట్టుకున్నరు '(శ్రీరాములు' అని. అంత మంచి పేరును ఖూనీ జేస్తున్నవ్ గదరా......'

"ఇగో మామా! నేను నీలాగ పండితుణ్ణి గాను. పుట్టుకతో నొచ్చిన బాసను మార్చుకోలేను. పని చేస్తున్నది ఇంగ్లిష్ మిడియం స్కూల్ల. నా తెలుగుతోని ఎవ్వనికి ఫరక్ వడేది లేదు. సైన్ తీటా - కాస్ తీటా- లెక్క సక్కగ జెయ్యికపోతే తోల్ దీస్త' గంతే. ఓ ప్రైవేట్ స్కూల్లల్ల ఇంతకంటే ఎక్కువవుసరం లేదు. తుమ్మితే సగం జీతం కట్ దగ్గితె సాంతం కట్టు అన్నట్లున్నది... నీ యవ్వ... ఇంత కంటే కూలి చేసుకోని బతుకుడు నయ్యం గదమామా..'

రెడ్డికి ఇంకోసారి అర్థమయ్యింది... జగదీశ్ గాన్ని విమర్శించుడంటే బురదల రాయేసుడే. అందుకే లాభం లేదని టాపిక్ మార్చిండు-

'ఔ ! సీరాములెందుకు ఫోన్ చేసిండురా?' ఎండలవడొచ్చినవ్. ముందుగాల సల్లటి నీళ్ళు దాగు...' అనుకుంట నీళ్ళు ఇయ్యవొయ్యిండు.

'అరె! నీళ్ళెందుకు మామా ! గంట సేపైతే కమ్మటి నీర దాగుతమ్ గద !' అనుకుంటనే రెడ్డి ఇచ్చిన నీళ్ళనందు కున్నడు.

మధ్యాహ్నం పదకొండున్నర దాటి పన్నెండు దగ్గర దగ్గరయ్యింది. మార్చి నెలాఖరు. ఎండ మిర్చీకంటే ఎక్కువ ఘాటుగున్నది. అసలే హైద్రాబాదు. అందుల పాతబస్తీ.. ఏదొచ్చిన తట్టుకోలేం.. జగదీశ్ మాటలు రెడ్డి మనసుకు ఏ.సీ. గాలిగలాగ దగిలినయ్.

'ఏంది, శ్రీరాములు రమ్మన్నడా?' అన్నడు నమ్మ లేనట్లు..

'అసలు వాడు పొద్దుగాలనే కాల్ చేసి చెప్పిండట. ఈ మతిమరుపుల ఖాలెద్ గాడు ఇప్పుడు సడెన్గా ఫోన్ జేసి, ' నీవు, రెడ్డి జల్ది రండి. చాంద్రాయన్ గుట్టకాడ నేనూ ఇస్మాయిల్ ఎదురు జూస్తుంటం' అన్నడు. 'మళ్ళీ నీకు కాల్ జేసుడెందు కంటాని బండి దీస్కోని వొచ్చిన... జల్ది వోదం పా!'

'మరి తిండి పొద్దున గుడ్డుకూర జేసిన. కొంచెమంత అన్నం మిగిలింది. తిని పోదమా, కటుకోని పోదమా ?' అన్నడు అమాయకంగ

పకపక నవ్విండు జగదీశ్.

'అరె! మామా! అందుకే నీవంటే అందరికిష్టం. మనసుల ఏముంటే అది ఖుల్లా ఖుల్లా మాట్లాడ్తవ్. నీ గుడ్డు కూర... అదే కోడిగుడ్డు కూర అట్లనే దాచిపెట్టు. వచ్చినంక ఇంత గరంగరం అన్నం చేసుకొని మొత్తం దినొచ్చు. చంద్రమౌళి అక్కడ అన్ని ఏర్పాట్లు చేపిస్తున్నడంట.....'

'చంద్రమౌళా? అతనెవరు?'

'సీరాములుగాని బావ. ఆడనే... ఎక్కాయిపల్లిలుంటడంట.. అవన్ని నీకెందుకు మామ.. ఖాలెద్ గాడు జూసుకుంటడు. జల్ది వోదం పా...'

తొందర పెట్టిండు జగదీష్. ఐదు నిమిషాల్ల ఇద్దరు గలిసి బయల్దేరిన్రు..

రెడ్డి, జగదీశ్, ఖాలెద్ ప్రైవేట్ స్కూల్లో పనిజేస్తూ బతుకుపోరును అలుపెరుగ

కుండ జేస్తున్న మధ్యతరగతి ప్రతినిధులు. యాజమాన్యం ఇస్తున్న ఇచ్చీ ఇయ్యని జీతాలతో జీవితాలను బలవంతంగ దొబ్బుకుంట వోతున్నరు. రెడ్డి తెలుగు పండితుడు జగదీశ్ లెక్కలు చెప్తడు. ఖాలెద్ హిందీ పండితుడు. శ్రీరాములు ఆ స్కూల్లో కొత్తగ జేరిండు. వాళ్ళది కడ్తాల్ దగ్గర పల్లెటూరు. సబ్జెక్టు ఫిజిక్సు. వీళ్ళంతా మంచి మధ్యతరగతి టీచర్లు. ఏ దురలవాట్లూ లేవు. ఒకరు నల్గొండ నుంచి, ఇంకొకరు వికారాబాద్ నుంచి మరొకరు మేడ్చల్ నుండీ వచ్చి తెల్సిన వాళ్ళతో కలిసి కిరాయి ఇండ్లల్ల ఉంటూ డీయస్సీ కోసం ఎదురు జూస్తున్నరు. గవర్నమెంట్ జాబ్ వస్తే లైఫ్ సెటిల్ జేసుకోవచ్చనే ఆశ చావక, ప్రైవేట్ స్కూల్లో కాలం వెళ్ళదీస్తున్నరు. శివరాం పల్లిలో మంచి పేరున్న స్కూల్లనే పనిజేస్తున్నరు. కరోనా దెబ్బతో బతుకులతలా కుతలమైనయి. ఈ మధ్యనే మళ్ళీ దారిలకొస్తున్నయ్.

కొత్తగా చేరిన శ్రీరాములు వాళ్ళ బావ వాళ్ళ ఊళ్ళ మంచి నీర దొరుకుతది. 'ఒక్కసారి తాగొస్తే మస్తుగుంటది' 'అని ఆశలు రేకెత్తించిండు. మూడు వారాలుగా ఆ ప్రోగ్రాం పోస్ట్ పోన్ అయితా ఉన్నది. ఆఖరుకు ఈరోజు కలిసొచ్చింది.

బండి మీద పోతుంటే జగదీశ్ ప్రోగ్రాం గురించి డిటేల్ గ జెప్పిండు - బండ్లు దీస్క వొయ్యి ఖాలెద్ వాళ్ళ దోస్త్-ఇస్మాయిల్ వాళ్ళ ఇంటి దగ్గర పెట్టి, బస్సుల కర్కల్ పహడ్ దాంక వోతె, అక్కడి నుంచి ఐదారు కిలో మీటర్లు ఆటోల వోవాల్నంట. శ్రీరాములు ఆడ్నే ఉంటన్నడు. సీరాములు బావ చంద్రమౌళి చికెన్, జొన్న రొట్టెలు జేపిచ్చి పెట్టిండంట.

అందరూ కలిసి అనుకున్నట్లే కర్కల్ పహాడ్ బస్సు దిగి శ్రీరాములుకు కాల్ జేసిన్రు. జవాబు లేదు !

"అరె... ఇకడ్నే ఎక్కడ్నో ఉండి ఉంటడు. జెర్ర ముందరికి వోతె ఎక్కాయపల్లి రోడ్ ఉంటదంట. పోదం పాండి ' అన్నడు ఖాలెద్.



జగదీశ్ ప్రయత్నం చెయ్యంగ, చెయ్యంగ శ్రీరాములు రిప్లై ఇచ్చిండు. 'నేను సగం దూరం వచ్చినంక మా మామకు యాక్సిడెంటైందని తెలిసింది. ఆయనను కడ్తాల్ హాస్పిటల్కు దీస్కవోతున్నం. పెద్ద ప్రమాదమేంలేదు. ఆయన్ని ఇంటికి దోలిచ్చి వస్త. ఊళ్ల మా చంద్రమౌళి బావుంటడు.' అసలు సంగతి జెప్పిండు.

'రెడ్డి సాబ్! మనం ఎల్లిన టైం బాలేనట్లున్నది. ఇప్పటికి ఈ ప్రోగ్రాం కాన్సల్ జేసుకోని, వెనుకకు వోతేమంచిది.' ఖాలెద్ ఉచిత సలహా ఇచ్చిండు.

'అరె! జిందగీల మొదటిసారి 'నీర' దాగుదమని బయల్దేరిన్రు. ఎందుకు వాళ్ళను నారాజ్ జేస్తవ్ భాయ్. ఇటువంటివన్నీ మామూలే. ఇప్పుడేమ య్యింది? మనల్ని ముందు బొమ్మం టున్నడు. వస్తడు గద! ఇదేమన్న హైదరాబాదా? అడ్రసు దొరకక పోనీకె. ఊళ్ళ బోయి, ఎవర్నడిగిన జెపుతరు. ఆటో ఎక్కి అక్కడ్దాకా పోదం పాండి.' ఉత్సాహ పరిచిండు ఇస్మాయిల్. అందరూ ఎక్కాయపల్లి జేరుకున్నరు..

"చంద్రమౌళి ని గలువాలె!" ఒక పెద్దమనిషిని జూసి, ఆరా దీస్తున్నట్ల డిగిండు జగదీశ్.

ఆ పెద్దమనిషి బీడీ దమ్ము లాగి, 'చంద్రమొగిలి అంటే ఎవ్వరు?' అనడిగిండు.

అదే ప్రశ్న తమను తాము అడిగి జూసుకున్నరు. జవాబు లేదు.

తక్కున గుర్తుకొచ్చింది జగదీశ్ కు. అదే తాతా! సీరములు బావ....

'వాడెవ్వడు?' జగదీశ్ మాట పూర్తిగాకుం డానే ఆ పెద్దమనిషి మరో సవాల్ బుల్లెట్ లా దూసుకొచ్చింది.

"అరె! శ్రీరామ్ కు కాల్ జెయ్య రాదురా..." రెడ్డి గుర్తు జేసిండు.

'ఫోన్ స్విచాఫ్ అయిపోయింది. అందుల చంద్రమౌళి నంబరున్నది.' సావు కబురు సల్లగ జెప్పిండు.

రెడ్డి శ్రీరామ్‌కు కాల్ జేసిండు... 'నాట్ రీచబుల్' అని వాయిస్ రికార్డ్ వినిపిస్తున్నది. 'నేను జెప్తే ఇంటారప్పా! టైంబాగలేదు, ప్రోగ్రాం. పోస్ట్ పోన్ జేసుకుందమంట.....' ఖాలెద్ ఏదో అనవొయ్యిండు.

"అరె... ఇంతదూరమొచ్చినం. మళ్ళీగా పనికిమాలిన మాటలెందుకు ఖాలెద్? జెర్ర వోపిక పట్టండి. చిన్న ఊరు. ఇక్కడ అందరికి అందరూ దెలిసుంటరు... సముఝాయిస్తున్నట్లన్నడు రెడ్డి.

"మరొగ రెండు మూడు ప్రయత్నాలు

కథ

చేసిన్రు. అవిగూడ బెడిసి కొట్టినయ్. చంద్రమౌళి గురించి గాని, శ్రీరాములు గురించి గాని ఎవ్వరూ సమాచార మివ్వలేదు. వీళ్ళ అవుస్త జూసి ఖాలెద్ ముసిముసి నవ్వుకుంటున్నడు గాని, అతనికి గూడ గిట్ల నారాజ్ అయ్యి, ఎనుకకు వోవుడు ఇష్టం లేదు. 'పోనీ ఇంత దూరం వచ్చినం గదా, ఆ 'నీర' ఏదో కొనుక్కొని తాగిపోతే అయిపోతది గదా'' అనుకున్నడు కాని, అక్కడ కల్లు దప్ప నీర గూడ దొరుకదన్నారు, ఇద్దరు ముగ్గుర్ని అడిగితే. అందరి కాల్లు జేతులు సల్లవడ్డయ్.

మధ్యాహ్నం రెండు దాటింది. మీద మంట, కింద మంట, కడుపుల ఆకలి మంట, మనుసుల అసంతృప్తి మంట. చెయ్యనీకె ఇంకేం దోచలేదు. ఎనుకకు మల్లిపోకడ దప్ప, చేసేదేం లేదంటాని మొఖాల్యాలడేసుకోని మల్ల ఆటోలు నిలవడేకాడికి తోవ పట్టిన్రు. అప్పుడెదురయ్యిండు శ్రీరాములు.

ఉన్న బాధంతా అతని మీద ఎల్లగక్కిన్రు నలుగురూ. పాపం! అతని పరిస్థితి ఏందో గమనించే సోయిగూడ పొయ్యింది వాళ్ళకు.

'అరె! అట్లెట్లైతది సార్. ఎవ్వరు గట్ల మాట్లాడింది ' అని సీరియస్ అయ్యిండు శ్రీరాములు. తాము గలిసిన వాళ్ళలో ఒకతను అక్కడ్నే ఉంటే అడిగిన్రు -

"ఇతనెవ్వరో నీకు దెలుసా తాతా?''

'అరె! వాడు దెలువక పోకడేంది. మా చంద్రయ్య అల్లుని కొడుకు' అన్నడా పెద్దమనిషి.

"మరి శ్రీరాములెవరో నాకు దెలువదన్నవ్?'' ఆ పెద్దమనిషి తీరు నచ్చక గట్టిగనే అడిగిండు జగదీశ్..

'సీరాములా ? వీని పేరు రమేష గదా!'' అన్నడా పెద్దయిన నెత్తిగోక్కుంట.

'మరి చంద్రమౌళి.. వీళ్ళ బావ...' రెడ్డి అడగబొయ్యిండు.

విషయం అర్థమయినట్లున్నది ఆ పెద్దమనిషికి. "అరె, వీళ్ళ బావ పేరు చందు. చందు గాడంటె ఈ వూళ్లె తెలువనోడెవ్వడున్నడు? వీళ్ళు సిటీలల్ల వొయ్యి కొత్త కొత్త పేర్లు పెట్టుకుంటే ఎవ్వనికి తెలుస్తది?' అని గులుగుకుంట అక్కడి నుంచి మెల్లగ వొయ్యిండు.

మరికొంచెం సేపట్లో చందూ (చంద్రమౌళి) కూడా గూడ వచ్చిండు. అందరు గలిసి మాట్లాడుకుంట తాళ్ళల్లకు వొయ్యిన్రు. ఎర్రటి ఎండల పచ్చటి మర్రి చెట్టుకింద గూసుంటె మనసుకు చాల హాయిగున్నది. చుట్టూ పచ్చని చేలు మరింతగా గాలిని సల్లబరుస్తున్నయి.

ప్లాస్టిక్ బస్తలతో గుట్టిన చాప పరిచిన్రు. అందులో గూసున్నరు. దస్తర్ ఖాన్ల పెట్టుకున్నట్లు చికెన్, జొన్న రొట్టెలు, ఉడికించిన గుడ్లు, ఆమ్లెట్లు.. అందరికీ నోట్ల నీళ్ళూరినయ్. అసలే ఆకలి మీదున్నరు. జగదీశ్ గబుక్కున ఒక రొట్టె దీసుకున్నడు.

'అరె! ముందే దినేస్తే, మజా ఏముంటది? ఆ నీర రానీరాదుర...' అడ్డుకున్నడు రెడ్డి.

తినబోయినోడు ఆగిపొయ్యిండు జగదీశ్.

ఈలోపున రమేశ్‌ను వాళ్ళ బంధువుల గురించి అడిగిండు ఖాలెద్...

'చూడు సార్! నిజానికి మేం చుట్టాలం గాదు, బంధువులం కాదు. ఇంకా జెప్పాలంటే, మా కులాలు గూడ వేరేనె.. చందు వాళ్ళు సాకలోళ్ళు. ఇప్పుడు నీర దెచ్చిపోసే నర్సిమ గౌడ్ తాత వాళ్ళు గౌండ్లోళ్ళు. మేము ముత్రాసులం... ఇంతకు ముందు యాక్సిడెంటయ్యి దవఖానకు దీస్కపోయినాయన మా సొంత మామ గాదు. వాళ్ళు గొల్లోళ్ళు. కాని, ఊళ్ళ ఒగరంటే ఒగరికి అభిమానం ఎక్కువ.'

'చూడుండి బైసాబ్.... నీర అమృతం లాగ ఉంటదని జెప్పి, ఆ అమృతం వెతుక్కుంట ఇక్కడొచ్చినం. కాని ఆ నీరను మించిన ప్రేమ మీ ఊర్ల పారుతు న్నది. నీరది ఏమున్నది భాయ్, ఇంకో సారొచ్చి యత్మినాన్గ దాగుదం. మీ కడుపునిండ బాధ పెట్టుకొని, మా కోసం మీరు కింద మీదగావొద్దు. శ్రీరామ్ వాళ్ళ మామ దవఖానలో పోయినట్లు తెలిసింది.. మేము గూడ వొస్తం పాండి.' అన్నడు.

మాట్లాడుతుండంగనే నర్సింహ తాత నీర' దీసుకొచ్చిండు.

'మా ఊళ్ళ నీర దొరుకది. అంత కల్లే దాగుతరు. మీ కోసం జెప్పి, తాతతోని స్పెషల్ దీపిచ్చిన.' అని శ్రీరాములు జెప్తుండంగనే నర్సింహ గౌడు శ్రీరాములును పక్కకు పిలిచిండు. వాళ్ళు మాట్లాడుకునేది తెలుసుకోవాలని ఇస్మైల్ ఏదో పనున్నట్లు అటుపక్కకు పొయ్యిండు. 'అరే! శీనయ్య కాలం చేసిండంట బిడ్డా....' అన్నడు. కండ్లల్ల నీళ్ళు తిరుగుతుండంగ.

శ్రీరాములు మొఖం కళ దప్పింది. శీనయ్య అంటే ఇంతకు ముందు యాక్సిడెంటయ్యి హాస్పిటల్ల జేరినాయన.

'సార్! నేను జెర్రసేపట్లొస్త. మీరు గానియ్యండి.' అనుకుంట జవాబు కొరకు జూడకుండ అక్కడినుంచి గదిలిండు శ్రీరాములు.

విషయం గ్రహించిన చందూ 'బావా! నేను గూడొస్త. ఒక్క నిమిషమాగు!! తను గూడ పోనీకె సిద్ధమౌతూ అన్నడు.

'వద్దు.. వద్దు... ఆగండ్రి. మేంగూడొస్తున్నం' అన్నడు ఇస్మాయిల్.

రెడ్డి, జగదీశ్, ఖాలెద్ కు ఏమి అర్థం గాలేదు.


'చూడుండి బైసాబ్.... నీర అమృతం లాగ ఉంటదని జెప్పి, ఆ అమృతం వెతుక్కుంట ఇక్కడొచ్చినం. కాని ఆ నీరను మించిన ప్రేమ మీ ఊర్ల పారుతు న్నది. నీరది ఏమున్నది భాయ్, ఇంకో సారొచ్చి యత్మినాన్గ దాగుదం. మీ కడుపునిండ బాధ పెట్టుకొని, మా కోసం మీరు కింద మీదగావొద్దు. శ్రీరామ్ వాళ్ళ మామ దవఖానలో పోయినట్లు తెలిసింది.. మేము గూడ వొస్తం పాండి.' అన్నడు.

అందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్.

కవిత



# ప్రియమైన శత్రువు



ఏరువ శ్రీనాథ్ రెడ్డి, 76598 77744

శీతాకాలం కదా!
శిలలా మారిపోయాను.
శిధిలమైపోయాను.

సమయం సమయానికి
వచ్చినా...ఈ చీకటి పోదే!

ఈ చీకటి తనకి తోడుగా ఉంటుందని
చలినొక దానిని వెంట తెచ్చుకుంది.

చీకటేమో ఊరి మీద పడి రాత్రిని దోచుకుంటుంటే
ఈ చలి నిప్పులు చెరుగుతూ
మాతో దోబూచులాడుకుంటుంది.

దుప్పట్లేమో చలికి తట్టుకోలేక మమ్మల్ని చుట్టుకుంటే
ఈ చలేమో తనకీ దుప్పటి కప్పమని మాతో పోట్లాడుతుంది.
దుప్పట్లో దూరాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది.

చలి ఏమైనా నా చుట్టమా
లేక ప్రభుత్వ చట్టమా
తలుపులు బార్లా తీసి ఆహ్వానించడానికి. ఆతిథ్యం ఇవ్వడానికి.

పోనీలే పాపం అని రానిచ్చామే అనుకో
దాని దెబ్బకి ఎంతటి వారైనా వణికి పోవాల్సిందే కదా!

అందుకే తలుపు తీయలేదు.
నా తలపుల్లోకి రానీయలేదు.
దాని ముఖాన్నే తలుపేసేశాను.

తెల్లవార్లూ నా గడప దగ్గరే చలికాచుకుంటూ కూర్చుంది.
దానికి తోడుగా ఉందామని
ఏ అర్ధరాత్రో అపరాత్రో దారితప్పి వచ్చి
మంచు మంచం వేసుకొని పడుకుంది.

ఆ రెండూ తెల్లవార్లూ ఏమేం ఊసులు
చెప్పుకున్నాయో ఎవరికి తెలుసు.
ఆ రెంటిని ఓ కంట కనిపెట్టుకొని కూర్చున్న చీకటికి తప్ప!

నేను తీరికగా తెల్లారి నిద్రలేచి తలుపు తీసి
చూస్తే ఆ మూడూ ముచ్చట్లు పెట్టుకొని నా ఇంటి ముంగటే
కాపురం పెట్టేసాయి.

రానీ..రానీ...ఆ భాస్కరుడు వచ్చి భాస్వరాన్ని మండిస్తే కానీ,
మయూఖాలను సంధిస్తే కానీ
వీటికి తిక్క కుదరదు.

వీటి కాపురంలో నిప్పులు పోస్తే కానీ
నేను చలికాచుకోవడానికి వీలుపడదు.

ఇంతకీ ఆ భానుడు వచ్చేదాకా ఆగాలా? లేక
నేనే నాలుగు చితుకులు ఏరుకొచ్చి చలిమంట వేయాలా?

వ్యాసం

# ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహిళా సాహిత్యం

**సాహిత్యంలో మహిళా వికాసం...**



డా॥ భీంపల్లి శ్రీకాంత్
90328 44017

**(గత సంచిక తరువాయి...)**

**"శ్రీకృష్ణ పదసుధానిధి" జొన్నవాడ రాఘవమ్మ**

పాలమూరు జిల్లా గర్వించదగ్గ ప్రసిద్ధ రచయిత్రి జొన్నవాడ రాఘవమ్మ వందలాది గేయాలను రచించిన విదుషీమణి. ఈమె గేయాలు ఆకాశవాణి, దూరదర్శన్ లో ప్రసారమయ్యాయి. నవాబ్ పేట మండలం కేశవరావుపల్లిలో 1928లో జన్మించిన రాఘవమ్మ చిన్ననాటినుంచే దైవభక్తి పరాయణురాలు చదివింది తక్కువే అయినా నిరంతరం భాగవతం, రామాయణం, భారతం వంటి పురాణాలను పఠనం చేసే రాఘవమ్మ భక్తి గేయాల రచనలకు శ్రీకారం చుట్టింది. భక్తి గేయాలతో పాటు దేశభక్తి, జానపద గేయాలు, భజన కీర్తనలను రచించింది. రాఘవమ్మ రచించిన ప్రతి గేయం మధురామృతాన్ని పంచుతుంది. సహజమైన పదాల కూర్పు లలితమైన గేయాలు రచించడం రాఘవమ్మ సహజ పాండిత్యానికి నిదర్శనం. కృష్ణుడంటే అపరిమితమైన అభిమానం అందుకే కృష్ణుడిపై అనేక గీతాలను రచించింది. 30 ఏళ్ళ క్రిందట ఆకాశవాణిలో ఈమె గేయాలు పదేళ్ళపాటు వరుసగా వచ్చాయంటే ఆమె ప్రతిభ ఎంతటిదో ఇట్టే తెలుస్తుంది. 1977 లో 48 గేయాలతో రాధికా గీతాలను, 2010 లో 160 గేయాలను పుస్తకరూపంలో తీసుకొచ్చింది. 2014లో 'భావ తరంగాలు' అనే గేయసంపుటిని వెలువరించింది. నిరంతరం కృష్ణభక్తిలో తాదాత్మ్యం చెందిన రాఘవమ్మ దేశభక్తి, ప్రకృతి గీతాలను మనోజ్ఞంగా ఆలపించే గాయనీమణి. ఈమె సహజపాండిత్యానికి మెచ్చి శ్రీజ్ఞాన సరస్వతి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమి వారు 2009న ఈమెకు "శ్రీకృష్ణ పదసుధానిధి" అనే బిరుదును ఇవ్వడం జిల్లాకే గర్వకారణం. అలాగే " చిన్నికృష్ణుని లీలలు, ప్రేమ తుమ్మెద, నవదుర్గ, తులసీ మహాత్మ్యం " వంటి గేయనాటికలను రచించింది. అద్భుతమైన భావసంపద, అపారమైన ధారణశక్తి గల రాఘవమ్మ తను రాసిన పాటలన్నీ పాడగల విదుషీమణి. ఈమె రచించిన " రాధికా గీతాలు " గేయ సంపుటిలోని గేయాలన్నీ భక్తి తత్వానికి సంబంధించివి. అన్ని గేయాలు అలవోకగా సాగే రసరమ్య గీతాలు. ఇందులో ప్రతి గేయం హృదయతంత్రుల్ని మీటుతుంది.

"కృష్ణరారా గోపాల బాలరార గోపాలబాల రార గోపికా లోలరార" వంటి కృష్ణభక్తి గేయాలు పుస్తకానికి నిండుదనం చేకూర్చాయి.

**ఆచార్య కె.కమల**

ప్రసిద్ధ పండితులు, రచయిత కప్పగంతుల లక్ష్మణశాస్త్రి కూతురైన ఆచార్య కె. కమల సంస్కృత, తెలుగు, ప్రాకృత భాషల్లో అపారమైన పాండిత్యం గలది. జయవల్లభుడు సంకలనం చేసిన 'వజ్జాలగ్గం' సంస్కృత గ్రంథాన్ని రెండు భాగాలలో కె. కమల తెలుగులోకి అనువదించింది. ఇందులో లౌకిక జీవన విధానానికి సంబంధించిన ఎన్నో విషయాలు చెప్పబడ్డాయి. ఇందులో మొత్తం 795 మానవ జీవితానికి సంబంధించిన గాథలున్నాయి. 'భవభూతి వాగ్విభూతి, వ్యాససూక్తం' అనే విమర్శనా గ్రంథాలను కూడా రచించింది. 'భవభూతి వాగ్విభూతి' గ్రంథంలో భవభూతి రచించిన 'మహావీర చరితం, ఉత్తర రామ చరితం, మాలతీమాధవం' అనే నాటకాలను సవిమర్శనాత్మకంగా తనదైన పరిశోధనతో విపులంగా రచించింది. 'వ్యాస సూక్తం' లో వ్యాసుడు చెప్పిన శ్లోకాలకు విమర్శనాత్మక వ్యాఖ్యానం చెప్పింది.

**ఓరుగంటి పద్మావతమ్మ**

ఆమనగల్ మండలం ముద్విన్ కు చెందిన ఓరుగంటి పద్మావతమ్మ 'భాగీరథీ తరంగాలు' అనే గేయ సంపుటిని వెలువరించింది. ఇందులో మంగళహారతి పాటలు, జోలపాటలు, నలుగు పాటలు, జన్మదిన పాటలు వంటివి చక్కగా రచించింది.

**డా. పరవస్తు కమల**

కవయిత్రిగా, కథా, నవలా రచయిత్రిగా, వ్యాసకర్తగా, పరిశోధకు

వ్యాసం

రాలిగా, ఆధ్యాత్మిక ప్రవచన కర్తగా పేరుగాంచిన పరవస్తు కమల 'ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ప్రతీకలు' అనే అంశంపై సాధికారికమైన పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందింది. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలలోనూ, ఆచార వ్యవహారాలలోనూ గల ప్రతీకాత్మక విశేషాలతో ఈ పరిశోధన గ్రంథం రచించబడింది. తెలుగు సాహిత్య ప్రాదుర్భావానికి పూర్వం శృతి, స్మృతి, దర్శనం, ఉపనిషత్ తదితర సాహిత్యాల్లో గల ప్రతీకలను స్థూలంగా ప్రస్తావించడమే గాక, ప్రతీకలకు సంబంధించిన ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యవేత్తల అభిప్రాయాలను సమన్వయపరచి ప్రత్యేక సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై ప్రగాఢ విశ్వాసమున్న కమల ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆధ్యాత్మిక తత్త్వ పరంగా రచించింది. ఐదు ప్రకరణాల్లో రచించిన ఈ సిద్ధాంత గ్రంథంలో ప్రతీకలపై లోతుగా అధ్యయనం చేసి సంకేతాల గూఢార్థాలను, సంప్రదాయబద్ధంగా నిరూపించింది. ప్రతీకల స్వరూప స్వభావాలు, వాటిభేదాలు, వేదాలు, రామాయణ, భారత, భాగవతాలు, తెలుగు సాహిత్యం, జానపద సాహిత్యాలలో కనిపించే ప్రతీకలు ఇందులో ఎక్కుగా వివరించబడ్డాయి. సాహిత్యంలో ప్రతిబింబించిన ప్రతీకలన్నీ ఈ సిద్ధాంత గ్రంథంలో చోటు చేసుకున్నాయి. అలాగే పరవస్తు కమల "శ్రీనివాస శతకం" అనే భక్తిపూరితమైన శతకాన్ని రచించింది. ఇందులో భక్తి పారవశ్యమే కాక తత్త్వదృష్టితో కూడిన పద్యాలున్నాయి. "శ్రీగిరి నివాస! సిరువచ్చు శ్రీనివాస" అనే మకుటంతో ఈ శతకం రచించబడింది. అందులో శ్రీనివాస అనే మకుటంతో ఈ శతకం రచించబడింది. ఇందులో శ్రీనివాసునికి సంబంధించిన అనేక విషయాలు రచయిత్రి స్పృశించింది.

> నిన్ను మనసార నమ్మిన నన్నుజూచి
> సు నిండుగ చల్లని మమత తోడ
> పిలిచి రప్పించు కొంటివి తలచి నీవు
> *శ్రీగిరి నివాస! సిరులిచ్చు శ్రీనివాసు*

వంటి భక్తిపూరితమైన పద్యాలు కమల రచనా సామర్థ్యానికి నిలుస్తాయి. ఇందులోని పద్యాలన్నీ సరళమైన భాషలో రచించబడ్డాయి. అలాగే 'నివేదన' అనే భక్తి గీతమాలికను రచించింది. ఇందులో భక్తుడు భగవంతునికి నివేదించిన పారమార్థిక, బాధాతప్త, ఆర్తిపూరిత గీతాలు ఉన్నాయి. ఇందులోని 25 గేయాలు ఆ సర్వేశ్వరుని సంబోధించే 'భక్తి భావాల ఆత్మాశ్రయ గీతాలు, భక్తి భావనా పూరితమైన ఈ గేయాలు ఆ పరమాత్మను వేడుకునే, తలుచుకునే వేదనా గీతాలు. అలాగే. పరవస్తు కమల 30 కథల దాకా రాసింది. ఈమె కథలు జాగృతి, సాధన, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక మొదలైన పత్రికలలో ప్రచురించబడ్డాయి. 'రాధిక, జీవితాన్ని మధిస్తే, జీవన కెరటాల్లో మానవ పోరాటం' వంటి 6 నవలల్ని కూడా రచించింది. ఇంకా కమల 'యజ్ఞకర్మ ప్రతీకలు' అనే వ్యాస సంపుటిని వెలువరించింది. యజ్ఞకర్మ స్వరూప స్వభావాలు, యజ్ఞ పరికరాలు, యజ్ఞ కర్మాచరణ, బ్రహ్మయజ్ఞం వంటి వ్యాసాలు యజ్ఞకర్మ ప్రతీకలు సూచిస్తాయి. కమల 'నా జన్మభూమి భారతి' అనే కవితా సంపుటిని వెలువరించింది. నిత్యం ఆధ్యాత్మిక చింతనలో గడిపే కమల 'శ్రీ తిరుప్పావై ప్రతీకలు, తిరుప్పావై, శ్రీ మద్భగవద్గీత, వేదాంత దేశికుల గోదాస్తుతి - గోదాదేవి తిరుప్పావై భక్తిమాలిక' వంటి వ్యాఖ్యాన గ్రంథాలను రచించింది. శ్రీ తిరుప్పావై ప్రతీక' లో గోదాదేవి తిరుప్పావై తత్త్వాన్ని పౌరాణిక, చారిత్రక, సామాజిక విశ్లేషణతో వ్యాఖ్యానించింది. తిరుప్పావై, స్మృతి, ఉపనిషత్, పురాణం, ఆగమ, కావ్య, ద్రావిడ ప్రబంధాల స్వరూపమైన శ్రీమన్నారాయణుని గుణగణాలు విశేషాలేగాక, తాత్త్వికార్థాలను, జ్ఞానభక్తి పరిమళాలను వెదజల్లే గేయామృత మంత్రస్వరూప గ్రంథం. శ్రీమద్భగవద్గీతలో అష్టాదశ శ్లోకాంతరార్థాలను సులభమైన రీతిలో వ్యాఖ్యానించిన గ్రంథం. గీతాసారాన్ని18 శ్లోకాల ద్వారా వ్యాఖ్యానించిన గ్రంథమిది. వేదాంత దేశికుల గోదాస్తుతి-గోదాదేవి వ్రతమహాత్యం' తెలిపే భక్తి స్తుతిమాలిక, మధుర భక్తి సుమమాల, ఒక్కొక్క పదానికి విశేషమైన వ్యాఖ్యానాన్ని రచయిత్రి ఇందులో వివరించింది.

## పోల్కంపల్లి శాంతాదేవి

తెలంగాణా రచయిత్రులలో ప్రముఖంగా పేర్కొనదగిన ప్రసిద్ధ కథా, నవలా రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవి. ఈమె 70కి పైగా నవలలు, వందకు పైగా కథలు రాసి రచయిత్రిగా ప్రఖ్యాతి గాంచింది. శాంతాదేవి నవలలు కొన్ని ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, స్వాతి, జ్యోతి, ప్రజామాత, ప్రగతి, వనితాజ్యోతి వంటి పత్రికలలో సీరియళ్ళుగా మరికొన్ని డైరెక్టుగా వెలువడ్డాయి. ఈమె 'ప్రేమ బంధం' నవలకు ఆంధ్రజ్యోతి వారపత్రిక, అడవిమంటలు నవలకు ఆంధ్రభూమి వారపత్రిక నుండి బహుమతులను పొందింది. ఆంధ్రభూమి వారపత్రికలో సీరియల్ గా వచ్చిన ఈమె 'చండీప్రియ' నవల అంజలీ పిక్చర్స్ ద్వారా అదే పేరుతో చలచిత్రంగా వచ్చింది. ఈమె కొన్ని నవలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. 1991లో అభినందన సంస్థవారిచే మాదిరెడ్డి సులోచన స్మారక అవార్డ్, 1995 తెలుగు విశ్వవిద్యాలయం నుండి మల్లాది సుబ్బమ్మ ధర్మనిధి అవార్డులను అందుకుంది. శాంతాదేవి రాసిన నవలల పై చంద్రలేఖ అనే పరిశోధకురాలు పరిశోధన చేసి డాక్టరేట్ పొందింది. ఈమె నవలల్లో మానవ సంబంధాలు, సమాజంలోని లోకరీతులు ప్రధానంగా కన్పిస్తాయి. ఆకట్టుకునే శైలి, చదివించే నేర్పు, పదాలపై పట్టు శాంతాదేవి ప్రతిభకు నిదర్శనం. ఆమె నవలలన్నీ అశేష పాఠకాదరణను పొందాయి. ఇవన్నీ యువ, జ్యోతి, నెలవంక, కల్పన, ఆంధ్రభూమి, స్వాతి, తరుణ, వనితాజ్యోతి, జయశ్రీ, మహిళ, శ్రీమతి, ఉదయం, జాగృతి, వనిత వంటి వార, మాస పత్రికలలో వచ్చాయి. శాంతాదేవి కథా సంపుటాలు "ప్రతీక్ష, సమర్పణ, కుంకుమరేఖ, మరణం అంచున

మందహాసం, గుర్తుకొస్తున్నాయి, ఇంతకు ఇంతే"

వంటి పేర్లతో వెలువడ్డాయి. అలాగే ఈమె కథలు 'నూరేళ్ళపంట, ముళ్ళగులాబి, సమర్పణ' వంటి కథా సంకలనాలలో ప్రచురించబడ్డాయి. పలు కథలకు బహుమతులు అందుకుంది. ఈమె రాసిన కథల్లో కుటుంబ కథలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈమె కథల మీద ఉమ్మెత్తల నరసింహ్మామూర్తి ఎం.ఫిల్ చేశాడు.

### పోల్కంపల్లి రాజ్యలక్ష్మి

నవలా రచయిత్రిగా ప్రసిద్ధిగాంచిన పోల్కంపల్లి రాజ్యలక్ష్మి దాదాపు ఇరవై నవలలు రచించింది. ఈమె సొంతూరు గోపాల్ పేట మండలంలోని ఏదుట్ల. ఈమె 'ఆనంద కిరణాలు, జీవనచక్రం, ఓ పువ్వు రాలింది, మౌనగీతం, ప్రేమపుష్పం, ఆశల దీపాలు, డాక్టర్ మహిపాల్, ప్రేమసంగీతం, కళ్యాణరేఖ, చెదిరిన మేఘాలు, పూలరథం, హృదయ సుగంధం, అఖండదీపికలు' వంటి నవలల్ని రాసింది. ఇవన్నీ ప్రజామాత, ప్రగతి, ఆంధ్రభూమి వంటి వార, మాస పత్రికలలో సీరియళ్ళుగా వచ్చాయి. ఈమె ప్రతి నవలలోనూ సంఘటనలు, సన్నివేశాలు కళ్ళకు కట్టినట్లుగా చిత్రించడం రచయిత్రి ప్రతిభను వెల్లడిస్తుంది. రాజ్యలక్ష్మి మొత్తం 50 దాకా కథలు రాసింది. ఈమె మొట్టమొదటి కథ మధుశ్రీ. ఇది ప్రజామాత వారపత్రికలో ప్రచురించబడింది. ఈమె కథలు బాలమిత్ర, ప్రజామాత, ఆంధ్రజ్యోతి, కల్పన, ప్రగతి, జ్యోతి, శ్రీమతి, జయశ్రీ, తెలుగు వెలుగు వంటి పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఆకాశవాణిలో కూడా ఈమె కథలు ప్రసారమయ్యాయి. 'బ్రహ్మలిఖితం, పూలదోసిళ్ళు' అనే కథా సంపుటాలను వెలువరించింది.

### డా. సురవరం పుష్పలత

ప్రముఖ రచయిత్రి, అధ్యాపకురాలు, పరిశోధకురాలు అయిన సురవరం పుష్పలత ప్రసిద్ధ తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముని కూతురు. సి.పి.ఐ జాతీయ నాయకుడు సురవరం సుధాకరరెడ్డి స్వంత చెల్లెలు. ఈమె ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'మధుర భక్తి ముగ్ధ భక్తి' అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేసింది. ఆంధ్ర మహాభాగవతం, బసవ పురాణం భక్తిని ఆధారంగా చేసుకుని ఈ పరిశోధన చేసింది. ఈ రెండు గ్రంథాలలో భక్తి స్వరూప స్వభావాలను భక్తిని, ముగ్ధ భక్తిని సమన్వయం చేస్తూ ఈ పరిశోధన గ్రంథాన్ని రచించింది. ఈ పరిశోధనా గ్రంథంలో భక్తి స్వరూప స్వభావాలు, భక్తిరసం, మధుర - ముగ్ధ భక్తుల అనుశీలన విధానం, మధురభక్తి భాగవతం, ముగ్ధ భక్తి బసవపురాణం వంటి ప్రకరణాలు ఉన్నాయి. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ కు ప్రస్తుతం పుష్పలత కార్యదర్శిగా వ్యవహరిస్తున్నది. అలాగే "అష్టోత్తర శత సాహితీ కళామూర్తుల సత్కార మహోత్సవ జ్ఞాపిక " అనే పుస్తకాన్ని సంకలనం చేసింది. ఇందులో తెలుగు సాహిత్యం, కళారంగాలలో విశేషకృషి చేసిన తెలుగు మహిళామూర్తుల గురించి సంక్షిప్త పరిచయం చేసింది. అలాగే 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు, కవితలు' పేరుతో ఒక సంకలనాన్ని తీసుకొచ్చింది.

### సీతమ్మ

మక్తల్ కు చెందిన సీతమ్మ గేయ కవయిత్రి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ పండితురాలి పనిచేసింది. "పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబా భక్తి గీతాలు, శ్రీ వేంకటేశ్వర గీతావళి, ముక్తల్ శ్రీ నల్లజానమ్మ భక్తి గీతాలు" వంటి భక్తిగీతాల సంపుటాలను వెలువరించింది. మక్తల్ కు చెందిన సీతమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ ఉపన్యాసకురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందింది. అనేక భక్తి గేయాలు, కీర్తనలు రాసింది. " మధుమాలతి " అనే నవలను సీతమ్మ రచించింది. ఈ నవల కల్పన, వాస్తవికతలతో కూడిన రచన. ఇందులో కులాంతరమైన ప్రేమ వివాహం, దానిని నిలుపు కోవటానికి చేసిన ప్రయత్నం, బానిస బ్రతుకు, భర్త తాగుడుతో భార్య అగచాట్లు, తొందరపాటు ప్రేమ చేసే అనేక పాట్లను రచయిత్రి తనదైన శైలిలో ఈ నవలలో రాసింది.

### సల్లుటి స్వర్ణసుధాకర్ రెడ్డి

కవయిత్రిగా, రచయిత్రిగా కవితలు, కథలు, నవలలు రాసిన స్వర్ణసుధాకర్ రెడ్డి అమరచింత శాసనసభ్యురాలిగా కూడా పనిచేసింది. ఈమె రాసిన కథలు 'గుండె కొంచెం గట్టిదైతే' అనే పేరుతో సంపుటిగా వెలువడ్డాయి. ఇందులో మొత్తం పదమూడు కథలున్నాయి. ఇందులోని కథలన్నీ సమాజంలోని ఇతివృత్తాలే. ఈమె కథన శైలి సరళంగా ఉంటుంది. ఇందులో ప్రతి కథ మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఇందులోని కథలు 'నిర్ణయం, గుండె కొంచెం గట్టిదైతే, వలపు మలుపు తిరిగితే, లవ్ గేమ్, విలువలు, కనువిప్పు, అత్తాగుణవతీ శత్రు జీవనహేల, ఈ పాపం ఫలితం?, గోదావరి నవ్వింది' వంటి దేనికవే సాటి అని చెప్పనక్కరలేదు. ప్రతి కథలో సమస్యలను సులువుగా పరిష్కరించు కోవచ్చు అనే సందేశం ఇమిడి ఉంది. అలాగే స్వర్ణసుధాకర్ రెడ్డి "కోడలు పిల్ల" అనే నవలను రాసింది. ఇది ఆంధ్రభూమి వారపత్రికలో సీరియల్ గా వెలువడి పాఠకుల మన్నన పొందింది.

### ఎ.ఎల్. సత్యవతి

పాలమూరు పట్టణానికి చెందిన కె.ఎ.ఎల్.సత్యవతి కవయిత్రి, కథా రచయిత్రి. అనేక కథలను రచించింది. పలు కథలకు బహుమతులను అందుకుంది. స్వాతి వార పత్రికలో వచ్చే బాపు బొమ్మకు 34 కథలు రాసింది. అనంతరం 'బాపు బొమ్మలు చెప్పిన కథలు" సంపుటిగా వెలువరించింది. 'మానవత్వమా' అనే కథకు గురజాడ సాహితీ ప్రథమ పురస్కారాన్ని 1994లో అందుకుంది. అలాగే మమత- మనుగడ, కావు, ఉద్యోగం దొరికింది వంటి అనేక కథలను రచించింది, సత్యవతి కథలు స్వాతి, ఆంధ్రపత్రిక, వనిత, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, పుస్తక ప్రపంచం, జయశ్రీ, సామ్య వంటి పత్రికలలో వచ్చాయి.

కవిత

# మాయమ్మ గుడ్డ



గిడ్డకింద మాణిక్యం, 94921 64107

గుడ్డలన్నీ నూలు పోగులైతే
మాయమ్మ గుడ్డ మాత్రం గొౖడాలి గోడులు

నాకు భూమిని చూపించడం కోసం
వొగ గుడ్డ
చెట్టు కొమ్మకు పచ్చులు
గూడు కట్టినట్లు
గుండె చెట్టుకు తన గుడ్డతో
గూడు కడతాంది

వొక గుడ్డ
అయినోల్లు కానోళ్ళు దగ్గిర
మడి బిచ్చమెత్తుకుంటూ

అక్కనోల్లు పక్కనోల్లు
గొడ్డుబోతంటే గుమికిదూకిన
కోన కన్నీటికి కొంగుతో
గోడలు కడతాంది.

వొక గుడ్డ
ఎముకలు కొరికే చలిలో
మండల దినాలు పాటు
గుడ్డను తడుపుకొని
గుడులు గోపురాలు చుట్టుకుంటాంది

ఎలాగొలా మాయమ్మ ఆశలు పలించి
నేను భూమి మీద పడినప్పుడు
వొగ గుడ్డ
నాకు పూల తొట్టైంది
వొగ గుడ్డ
దొడ్డిని మోసే చేతులైంది
వొగ గుడ్డ
నా వొంటిని
మెత్తగా తుడిచే
నెమలి కన్నులైంది.

ఏడ్చినప్పుడల్లా వుయ్యాలపాటై
జోకొట్టిన గుడ్డొక్కటైతే
దొడ్డికి బోతే దెయ్యాలు పట్టుకుంటాయని
చెప్పు ముక్కలను
ఇనుప ముక్కలను
బొగ్గు ముక్కలను
కొంగులో మోసిన బొడ్డు పేగు గుడ్డొకటి.
చెప్పలేని బాధలను మనసులో
మోసినట్టు.

నేను పెద్దగావుతున్నప్పుడు
వొగ గుడ్డ
చినుకులు పడితే
తలకు గొడుగైతాంది.

ముసారుకు సపారు చిల్లులు పడితే
తాటాకు మట్టలైకప్పుతాంది
చలిపడితే వెచ్చని తడికైతాంది

వొగ గుడ్డ
జొరమొస్తే నెత్తికి తడిగుడ్డైతాంది
గుండె గాయాలకు లేపనమైతాంది
కర్ణుడికి కవచ కుండలాలైనట్టు.

నేను భూమినొదిలి పోయేటబ్బుడు
వొగ గుడ్డ
ఆకాశం కన్నా యిసాలంగా కన్పిస్తాంది
అచ్చం మాయమ్మ మనసులాగ.
నా గుండెకాయకు అలసటొచ్చి
గుండెచప్పుడు ఆగిపోతాంది
ఇంధనం లేక యంత్రం ఆగిపోయినట్టు

నన్నిప్పుడు
తెల్లగుడ్డతో సుట్టకండి
మాయమ్మ గుడ్డతో సుట్టండి
మాయమ్మ పాదాలు తగిలిన మట్టితో కప్పండి
మరలా మాయమ్మ కడుపులోంచే పచ్చగా
మొలకెత్తుతాను.

ప్రతాప యుగంధర కథలు... 5

# గుణపాఠం

యుగంధర యుక్తి..



అమ్మంగి వేణుగోపాల్
94410 54637

కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తికి చాలామంది సామంతరాజులుండేవారు. వారిలో ఒకడు సామంతుడే అయినా స్వతంత్ర రాజులాగా ప్రవర్తించేవాడు. ప్రతాపునిపట్ల చాలా అసహనంగా ఉండేది. లేనిపోని అపవాదులు సృష్టించి తృప్తిపడే వాడు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ఎందుకని ప్రతాపుడు సహనంతో ఉండేవాడు. యుగంధరునికి మాత్రం అవకాశం లభిస్తే వాడికి తగిన గుణపాఠం నేర్పాలని ఉండేది. భుజ బలంతో కాక కుట్రలతోనే ప్రతాపరుద్రుణ్ణి గెలవాలని సామంతుడు తహతహలాడుతుండేవాడు. దీన్ని గమనించిన మంత్రి మార్కండేయుడు సామంతరాజుకు ఊరట కలిగించటానికి ఏదో యుక్తిని పన్నక తప్పదని భావించాడు. బాగా ఆలోచించి ఒక ఎత్తు వేశాడు. సామంతుని ఆమోదంతో ఆ ఎత్తును లేఖలో నిక్షిప్త పరచి ఒక దూత ద్వారా ప్రతాపరుద్రుని ఆస్థానానికి పంపించాడు. దూత ప్రతాపరుద్రునికి అభివాదం చేసి-

"మహారాజా! నేను మా రాజాధిరాజులవారి తరఫున రాయబారిగా వచ్చాను. నా పేరు శతనేత్రుడు. వారి ఆజ్ఞతో మీకో సందేశం ఇవ్వటానికి వచ్చాను" అన్నాడు.

"చాలా సంతోషం. మీ రాజుగారికి కుశలమే కదా!" మర్యాదపూర్వకంగా అడిగాడు ప్రతాపుడు.

"చిత్తం భగవంతుని కృపాకటాక్షాల వల్ల మా రాజాధిరాజులకు కుశలమే ప్రభూ!" అన్నాడు దూత.

కాకతీయ సామ్రాజ్యపు గూఢచారుల అధిపతి త్రినేత్రుడు ఆ లేఖను తీసుకొని చక్రవర్తి ఆదేశంతో విప్పి చదివాడు.

"కాకతీయ ప్రతాపరుద్ర మహారాజుల వారికి అభివాదాలు. అయ్యా! మీ రాజ్యములో తెలివితేటలకు కొదువలేదని తెలియుచున్నది. దయచేసి మా దూత ద్వారా కొంత తెలివిని మాకు పంపగలరు. మేము కోరునది తెలివినే కాని తెలివైనవారిని కాదు. మరొక విషయం- తెలివి అంటే మెదడు కూడా కాదు. మేము కోరిన తెలివిని మీరు పంపలేని పక్షంలో దానిని మీరు మా చేతిలో యుద్ధంలో ఓడిపోయిన దానితో సమానంతో భావించి మేము విజయోత్సవములను జరుపుకొందుము".

సామంతుని లేఖ ఇంత సవాలుతో కూడి వుంటుందని ఎవరూ ఊహించలేదు. అయితే అందరికంటే ముందు తేరుకున్నది ప్రతాపరుద్రుడే. అతడు కూడా అప్పటికి ఏదో ఒకటి చెప్పక తప్పదు కనుక,

"రాయబారీ! మేము మీ రాజు కోరినట్లుగా తెలివిని మీకు ఇస్తాం. మరి దాన్ని మీరు ఎందులో తీసుకుపోతారు. అట్లాంటి ఏర్పాటు ఏమైనా చేసుకున్నారా?" అని అడిగాడు.

రాయబారి ఆలోచనలో పడ్డాడు. తమ మంత్రి మార్కండేయుడు చెప్పినదాన్ని బట్టి- ఆ లేఖ చదవగానే కాకతీయుల మెదళ్ళన్నీ మొద్దుబారిపోతాయని, వాళ్ళదగ్గర అసలు జవాబే ఉండదని అనుకుంటుండగా అనూహ్యంగా చక్రవర్తి నుండి ఇట్లాంటి ప్రస్తావన రావటంతో దూత మెదడు మొద్దుబారిపోయింది. తాను స్వతంత్రించి ఏ జవాబు చెప్పితే ఏం కొంప మునుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దాంతో అప్పటికి గండం గడిచేటట్లుగా, "చిత్తం, చిత్తం మహారాజా! మా రాజ్యానికి వెళ్ళి తీసుకువస్తాను" అన్నాడు.

అప్పుడు యుగంధరుడు రంగంలోకి దిగి-

"రాయబారీ! మీరు మీ రాజ్యానికి వెళ్ళి సరిగ్గా నెలరోజులకు మా రాజ్యానికి తిరిగి రండి. అప్పటికి మేమే సరైన పాత్రలో తెలివిని నిక్షిప్తపరిచి మీకు అందజేస్తాం" అన్నాడు.

దీంతో 'బతుకుజీవుడా' అంటూ రాయబారి వెళ్ళిపోయాడు.

రహస్యమందిరంలో చర్చ జరిగింది. సామంతుని ఎత్తుకు పై ఎత్తును యుగంధరుడు చక్రవర్తికి వివరించి చెప్పాడు. చక్రవర్తి దాన్ని ఆమోదించాడు.

ఇంటికి తిరిగివెళ్ళే తోవలో యుగంధరుడు ఒక చిన్న కుండను కొనుక్కొని వెళ్ళాడు. తన ఇంటి పెరటితోటలోకి వెళ్ళి చిన్న గుమ్మడికాయను తెంపకుండా తీగకు అట్లాగే ఉంచి ఆ చిన్నకుండలోకి దూర్చి దాన్ని సురక్షితంగా కొమ్మల మధ్య ఎవరికీ కనిపించకుండా కట్టివుంచాడు. గుమ్మడికాయ రోజురోజుకు ఆ కుండలో పెరగసాగింది. నెలరోజులకల్లా ఆ కాయ కుండ నిండుగా పెరిగింది. యుగంధరుడు ఛురకత్తితో జాగ్రత్తగా తీగ నుండి కుండలో వున్న కాయను వేరుచేసి, మూతను ప్రత్యేక పదార్థంతో మెత్తాడు. దళసరి బట్టలో కుట్టి చక్రవర్తి ఆదేశంతో ఆస్థానానికి వచ్చిన దూత చేతిలో పెట్టాడు.

"దూతగారూ! ఈ మట్టికుండలో 'తెలివి' వుంది. దీన్ని చాలా జాగ్రత్తగా తీసుకువెళ్ళి మీ రాజుగారి చేతిలో వుంచండి. ఇదిగో మా సార్వభౌములవారి లేఖను కూడా అందజేయండి'' అన్నాడు యుగంధరుడు.

దూత తన రాజ్యం చేరుకొని సామంతునికి ఆ చిన్నకుండను అందజేశాడు. మంత్రి మార్కండేయుడు రాజు ఆ దేశంతో ప్రతాపుని లేఖను చదివాడు.

"శ్రీయుత సామంతరాజులవారికి, ఉభయకుశలోపరి. మీరు కోరినట్లుగా మా తెలివిని ఒక మట్టిపాత్రలో నిక్షిప్తపరిచి మీ దూత ద్వారా పంపుతున్నాం. పాత్రకు రంధ్రం చేయుకుండా, పగలగొట్టకుండా అట్టి తెలివిని బయటకు తీసి ఉపయోగించవలసిందిగా కోరనైనది. ఈ పనిని చేయలేని పక్షంలో మీరు మా చేతిలో యుద్ధంలో ఓడిపోయిన దానితో సమానంగా భావించి మేము విజయోత్సవాలను జరుపుకుందుము''.

సామంతుడు మట్టిపాత్రను నిశితంగా పరిశీలించాడు. ఆ పాత్రను పగలగొట్టకుండా లోని పదార్థాన్ని తీసుకోవటం అసాధ్యమని తేలిపోయింది. తమ ఎత్తు పారలేదని, పైగా కాకతీయుల చేతుల్లో పరాజయం ప్రాప్తించిందని గ్రహించిన సామంతుడు తెలివితక్కువ యుక్తితో తనను అవమానపరిచిన మంత్రి మార్కండేయుని వైపు కోపంగా మట్టికుండను విసిరేశాడు. మంత్రి కిందపడకుండా పట్టుకున్నా ఆ గందరగోళంలో రాజువైపు విసిరేశాడు. అది రాజుకు సమీపంలో శబ్దం చేస్తూ పగిలిపోయింది. అప్రమత్తులైన మంత్రి, దూత రాజవైద్యుడు దూరం జరిగారు. రాజు ఊపిరితిత్తులలోకి రసాయనం పొగచేరి ఎడతెరపిలేని దగ్గు వచ్చింది. రసాయనపదార్థం కొద్దిగా అతని ముఖం మీద చిమ్మింది. రాజవైద్యులు ప్రాథమిక చికిత్స చేసి కొంత ఉపశమనం కలిగించినా, ముఖం నల్లగా కమిలిపోయినట్లు కనిపించసాగింది. తనకు తెలిసిన ద్రవపదార్థాలు పూసినా, నీళ్ళతో కడిగినా దురద పెరిగిపోయింది.

రెండురోజుల్లో కాకతీయ సామ్రాజ్యం అంతటా ఈ వార్త ప్రాకింది. ప్రజలు ఉత్సాహంతో విజయోత్సవాలను జరుపుకున్నారు. ప్రతాపుడు నిండు కొలువులో యుగంధరుణ్ణి పొగుడుతుండగా-

'శరణు శరణు సార్వభౌమా!' అన్న మాటలు వినిపించాయి. అందరూ ఆసక్తిగా అటువైపు చూశారు. అతడెవరో కాదు సామంతుని రాజవైద్యుడు. తనను పరిచయం చేసుకుని చక్రవర్తి ఆజ్ఞతో-

'సార్వభౌమా! మీరు 'తెలివి'ని నిక్షిప్తం చేసిన చిన్నకుండ పొరపాటున పగిలిపోయింది. అందులోని పదార్థమేదో మా రాజుగారి ముఖం మీద చిట్లటంతో వారి ముఖం నల్లగా మారిపోయింది. విపరీతమైన దురద కూడా మొదలైంది. నాకు తెలిసిన వైద్యం చేశాను. కాని ఆ వైద్యం మూలంగా రాజుగారి బాధ పెరిగింది కాని తగ్గలేదు. రాజుగారు ఆ బాధ భరించలేక ఆర్తనాదాలు చేస్తున్నారు. మీరే మార్గాంతరం సూచించి పుణ్యం కట్టుకోండి. లేకపోతే నా ఉద్యోగం ఊడుతుంది.

"మహామంత్రీ! మన సామంతుల బాధ మన బాధే కదా. రాజవైద్యులను రప్పించి మంచి ఔషధం ఇప్పించండి'' అన్నాడు ప్రతాపుడు.

"మన్నించండి మహారాజా! మన రాజవైద్యులు కాశీయాత్రకు వెళ్ళారు'' అన్నాడు యుగంధరుడు.

"మరి మార్గాంతరం?'' ప్రశ్నించాడు ప్రతాపుడు.

"మా తాతగారు 'అనుభవ వైద్యచింతామణి' అనే పేరుతో ఒక తాటాకు గ్రంథం రాసిపెట్టారు. మా కుటుంబంలో ఎవరికి ఏ అనారోగ్యం కలిగినా మేం ఆ గ్రంథంలో సూచించబడ్డ మందే సేవిస్తాం. మీ ఆజ్ఞ అయితే, నేనూ సామంత వైద్యులు ఆ గ్రంథాన్ని అధ్యయనం చేస్తాం. ఏదైనా పరిష్కారం దొరకవచ్చు'' అన్నాడు యుగంధరుడు. 'సరే'నని సభ చాలించాడు చక్రవర్తి.

యుగంధరుడు, సామంతవైద్యుడు 'అనుభవ వైద్య చింతామణి'ని తిరగేస్తుండగా ఒకచోట- 'రసాయనిక చర్య మూలంగా ముఖం నల్లగా మారి విపరీతంగా దురదపుట్టినప్పుడు నిర్లక్ష్యం చేస్తే కంటిచూపుకు ప్రమాదం ఏర్పడవచ్చు. అట్లాంటి విపత్కర పరిస్థితిలో పనిచేసే ఒకే ఒక ఔషధం 'గామూశతాంకుశము' మాత్రమే. దీన్ని రోజూ ఉదయ సాయంత్రాల్లో చెంబెడు చొప్పున తాగి దానితోనే మూడుపూటలా మూడుసార్లు ముఖప్రక్షాళన చేయవలెను. వారం పదిరోజులలో సమస్య పరిష్కారం కాగలదు'' అని ఉన్నది.

"మరి మహామంత్రిగారూ! 'గామూ' అనే పొడి అక్షరాల అర్థం?'' అడిగాడు రాజవైద్యుడు.

"ఏం వైద్యుడవయ్యా, ఆమాత్రం తెలియదా? 'గా'- అంటే గార్దభం, 'మూ' అంటే మూత్రం'' అని చెప్పాడు యుగంధరుడు.

"రామరామ- ఇంత బతుకు బతికి గార్దభ మూత్ర సేవనమా?'' అన్నాడు వైద్యుడు. ఆయన కంఠం వణికింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మిగిలిన బతుకు బతుకటానికి మీ రాజుకు మరోమార్గం లేదు. మీ



**పూర్వం మాదిరిగా కాకతీయ చక్రవర్తి పట్ల అమర్యాదగా ప్రవర్తించే పక్షంలో తాను గా.మూ. శతాంకుశం సేవించిన నిజాన్ని ప్రచారాస్త్రంగా మలిచి చక్రవర్తి తనమీద ఎక్కడ ప్రయోగిస్తాడోనన్న భయంతో సామంతుడు సాధుతత్వాన్ని అలవరచుకున్నాడు. అంతేకాదు. తాను కట్టవలసిన కప్పం బాకీని కూడా చెల్లించి చక్రవర్తికి తన విధేయతను ప్రకటించాడు.**

రాజుగారికి ఈ తాటాకు పుటలో ఉన్న విషయం తెలియజేయండి. దీని నకలు మీకు వేరే కమ్మ మీద రాసి ఇస్తాను. ఆయన ఇష్టపడితే ఇవ్వండి. వద్దంటే మాత్రం ఎవరేం చేస్తారు. ఆయనే కర్మకు వదిలేయండి'' అన్నాడు మహామంత్రి.

"సరే! మా కర్మ. ఆ కమ్మ ఇలా ఇవ్వండి'' అర్థించాడు వైద్యుడు.

రాజ్యం చేరుకొని ముందు మంత్రి మార్కండేయులవారికి విషయం తేటతెల్లం చేశాడు. ఆయన తటపటాయించి, "రాజుకు ఆరోగ్యం చేకూరటానికి మరోమార్గం లేనప్పుడు ఎవరేం చేస్తారు'' అంటూ వెళ్ళి సామంతునికి వివరించి చెప్పాడు. రాజు ముఖం దురద మరింత పెరిగింది. ఆయాసంతో పడకమీద పడిపోయి మౌనంగా విలపించాడు.

"మహారాజా! రెండు మూడు రోజులు వాడి చూద్దాం. కొద్దిగా నయం ఉంటేనే ముందుకు పోదాం'' అని రాజవైద్యుడు నెమ్మదిగా చెప్పాడు. రాజు మౌనాన్ని అర్ధాంగీకారంగా భావించి తాజా గా.మూ. శతాంకుశంతో శుభ్రంగా ముఖం కడిగించాడు. రాజు ఆముదం తాగిన ముఖం పెట్టి- "దీన్ని అతిరహస్యంగా ఉంచండి'' అని ఆజ్ఞాపించాడు. మూడురోజుల సేవన ప్రక్షాళనల తర్వాత కొంత దురద తగ్గింది. ఐదవరోజు ముఖం కొద్దిగా తెల్లబడింది. మరో మూడురోజుల తర్వాత సామంతరాజు మునపటిలాగా తెల్లని రంగు గల చర్మం పొందగలిగాడు. దురద పూర్తిగా తగ్గింది.

పూర్వం మాదిరిగా కాకతీయ చక్రవర్తి పట్ల అమర్యాదగా ప్రవర్తించే పక్షంలో తాను గా.మూ. శతాంకుశం సేవించిన నిజాన్ని ప్రచారాస్త్రంగా మలిచి చక్రవర్తి తనమీద ఎక్కడ ప్రయోగిస్తాడోనన్న భయంతో సామంతుడు సాధుతత్వాన్ని అలవరచుకున్నాడు. అంతేకాదు. తాను కట్టవలసిన కప్పం బాకీని కూడా చెల్లించి చక్రవర్తికి తన విధేయతను ప్రకటించాడు.

ఈ ఉదంతం పూర్వాపరాలు సమీక్షించుకున్న సందర్భంలో-

"సామంతుడు తిరిగి స్వస్థత పొందటానికి శతాంకుశం బాగానే పనిచేసింది'' అన్నాడు చక్రవర్తి.

"అదేం కాదు ప్రభూ! ఏ మందు వాడినా వాడకపోయినా వారం పదిరోజుల్లో తనంతట తానే తగ్గిపోయే వీలున్న వికృతి కారక రసాయనాన్నే మా తాతగారు 'చింతామణి' గ్రంథంలో సూచించారు. కాకపోతే ఆ కమ్మ రాజవైద్యుని కంటపడకుండా చూశాను. నేను రాసిచ్చిన తాటాకు కమ్మ మాత్రం నేను సృష్టించిందే'' అన్నాడు యుగంధరుడు.

"యుద్ధమూ, రక్తపాతమూ లేకుండా ఒక్క తాటాకుతో ఆ దుర్మార్గుణ్ణి సన్మార్గంలో పెట్టటమే కాకుండా, వారి కప్పంతో మన ధనాగారాన్ని నింపావు. అందుకు సంతోషంగా ఇదిగో ఈ బంగారు మాడ బహూకరిస్తున్నా, స్వీకరించు'' అన్నాడు ప్రతాపుడు.

"మీరు ఒకటి మరిచిపోయారు ప్రభూ! 'తెలివి'ని నిక్షిప్తపరచటానికి ఒక కుండను కూడా కొన్నాను. దాని బాబతు రాగి మాడ ఇప్పిస్తే ఈ బీదవాడు బతికిపోతాడు ప్రభూ!'' అనగానే చక్రవర్తి తన దుస్తులను వెతికాడు. అన్నీ బంగారు మాడలు రత్నాలు, ముత్యాలే తప్ప రాగి మాడ కనిపించలేదు. "నేను నీకంటే నిరుపేదను యుగంధరా!'' అని చక్రవర్తి అనగానే ఆ రహస్యమందిరంలో ఉన్న వారు మనసారా నవ్వి యుగంధరుణ్ణి అభినందించారు.

**(కల్పితం)**

కవిత



# కీర్తి కొండ

డా॥ మండల స్వామి, 9177607603



డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య గారు

వెల్లంకి సాయి సాహితీ కుటీరం
ఆధునిక రవీంద్రుడి శాంతినికేతనం
పండిత పామరుల విజ్ఞాన చర్చలతో
దూర తీరాలు ఆకర్షించే అక్షర నేత్రం

పద్యం గద్యం వచనం గేయం
ప్రక్రియలెన్నో పండించే కలం కేదారం
పట్నం బొంగరమైన ఆలోచనామృతాన్ని
పల్లె పల్లెకూ పారించిన సాహిత్య రస భగీరథుడి నిలయం

బాల్యం చీకట్లు ఛేదించి
పేదరికం ముళ్ళ కంచెలు దాటి
ఆశయాల ఆరావళులు అధిరోహించిన అవిశ్రాంతుడి ఆవాసం

విద్యా పాలవెల్లిని ఈదిన ఏకలవ్యుడు
కవితాశ్రీ గంధాలు వెదజల్లిన పద్మశ్రీనాథుడు

అభినవ పోతనై అక్షర సేద్యం చేసినా
పల్లెల సేవకే అంకితమైన
గ్రంథ పాలకుడు

స్పందనల అలారం ఆగనివ్వని
నల్లగొండ కాళోజీ
పుట్ట చెదలు తూర్పార పట్టే
వెల్లంకి వేమన

సోమనాథ కళాపీఠ వైభవ
సాహిత్యప్రపూర్ణుడు
విద్యార్థుల నుదిటి రేఖలపై
సుధీతిలకం దిద్దిన ప్రాజ్ఞ శేఖరుడు

పగిలిన గుండెలను అతికించి
ప్రతిభలై నిల్చిన దిక్సూచి
భూదానమిచ్చిన వైతాళిక హృదయం
ప్రగతి కేతనమై నిల్చిన పఠనాలయం

జీవన సాఫల్య పురస్కారాల వరుసలెన్నో
సాష్టాంగమై ప్రణమిల్లిన ఆత్మీయతా సంపన్నులు
వైవిధ్యమై వికసించిన శిల్పాచార్యులు

మంచు కొండల ఎత్తులో
కీర్తి కొండను నిల్పి
చైతన్యమై విస్తరించిన
జాతి గుండెల చప్పుడతడు

*(డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య గారిని పద్మశ్రీ పురస్కారం వరించిన సందర్భంగా)*

వ్యాసం

# మల్లన్న క్షేత్రాలలో ఒగ్గు కథాగానాలు - అనుశీలన

0000




సతీష్ కుమార్ కావటి
94932 64901


భారతదేశంలో పుణ్య క్షేత్రాల ప్రాముఖ్యత ఎక్కువ ఉన్నదని చెప్పవచ్చు. ముఖ్యంగా అనాది కాలం నుండి నేటి వరకు దైవభక్తి భారతీయులలో కొనసాగుతూ ఉంది. తెలంగాణలోని మల్లన్న క్షేత్రాలను, మల్లన్న పట్నాల పద్ధతులను పరిశీలించినట్లయితే ఆచార, సంప్రదాయాలతో ఆరాదించబడుతున్నాయి. మల్లన్న క్షేత్రాలలో ఒగ్గుపూజారులు భారతదేశ జాతరలోనే పట్నం కథలను చెప్పడం ప్రత్యేకంగా చెప్పవచ్చును. పట్నం వేసే సందర్భంలో ఒగ్గు పూజారుల కథాగానాలలో ఈ విధంగా ఉంటాయి.

తెలంగాణలోని మల్లన్న క్షేత్రాలన్నింటిలో ప్రతిరోజు తెల్లవారుజామున ఒగ్గు పూజారులు మేలుకొలుపు మరియు ఒగ్గు ప్రార్థనలతో మల్లన్న దేవుడిని మేల్కొల్పుతారు. ఉదయం 4.30 గం॥లకు మేలుకొలుపు మరియు ఒగ్గు ప్రార్థన ఈ విధంగా చేస్తారు.

## మల్లన్న మేలు కొలుపు ప్రార్థన

*ఓం ఓం నీలకంఠా ఓం నీలకంఠా*
*శివ శివ నీలకంఠా శివనీలకంఠా*
*ఏలాకోటి ఏలాకోటి రామా... ఆ... ఆ...*
*పోసేది నీకాళ చేసేది నీసేవ*
*ఏగిలేస్తే నీ సేవ ఏమారగ చేసేయు మల్లన్నా... ఆ...*
*చుట్టు మెట్టు పాతాళగంగా నట్టనడుమ పంచపర్వతం*
*పర్వతం కొండల్ల ప్రత్యక్ష దేవుడవు మల్లన్నా... ఆ...*
*నిన్ను తలచే యేలాయే నిద్రందు మేలుకో*
*పూజలకు యేలాయే పువ్వోలె మేలుకో మల్లన్నా... ఆ...*
*కూతకోళ్ళు కూచే భూములు తెల్లారే*
*రాతకోళ్ళు కూచే కడలు తెల్లారే మల్లన్నా... ఆ...*
*ఒద్దుల్ల వున్నవో మద్దుల్ల వున్నవో*
*స్నానానికి మేలుకో రావయ్య మల్లయ్యా... ఆ...*
*ఆదివారం నాడు నీకు గోగు లగ్నం మల్లన్నా... ఆ...*
*పెయ్యంత పసుపు పెట్టి పెండ్లికొడుకును చేసి*
*హస్తాన కంకణం కట్టి నొసట బాసికం కట్టి మల్లన్నా... ఆ...*
*చాటతో చంద్రమూ గంపతో బండారు*
*తెలుపు నలుపుల పంచముగ్గులు పెట్టి*
*నివాళ్ళు ముట్టించి నిన్నెదురుకొనే యాల్ల మల్లన్నా... ఆ...*
*ఒగ్గులు, జెగ్గులు, ఒయ్యారి కాళ్ళు*
*నిత్య ప్రార్థన చేసి నిన్ను వేడుకుంటుండ్రు మల్లయ్యా... ఆ...*
*నీలమ్మ కొమారా నిజపుణ్యశాలీ*
*ఆదిరెడ్డి కొమారా అంశమంతుడవయ్యా*
*సంగన్న, మల్లన్న సరిదంట కాళ్ళు*
*కాపుల్ల పుట్టి కచ్చీరేలినావు మల్లన్నా... ఆ...*
*పద్మావతిని పెండ్లాడి నీవు*
*ప్రపంచ మేలినావు మల్లన్నా... ఆ...*
*కాపింటి కొడుకువై కురుమలకు తండ్రివై*
*గొల్ల యింటికి ఇల్లటపు అల్లుడవై*
*గొల్లలకు ఇలావెల్పువైనావు మల్లన్నా... ఆ...*
*కులమత భేదమ్ము లేని నమ్మినవారికి*
*ఇమ్మయిన దేవుడవు మల్లన్నా... ఆ...*
*తలచిన వారికి తలమీది గొడుగువై*
*కొలిచిన వారికి కొంగుబంగారమై ఉన్నావు మల్లన్నా... ఆ...*

*(ఓదయ్య సింగారపు. ఒగ్గుపూజారి, వయస్సు: 60 సం॥లు; కొమురవెల్లి మల్లన్న దేవస్థానం).*

ఈ విధంగా మల్లన్న మేలుకొలుపును తెలంగాణలోని వివిధ మల్లన్న క్షేత్రాలలో ఒగ్గు పూజారులు వేకువజామున డమరుకం మ్రోగిస్తూ కథాగానం చేస్తారు. ఈ మేలుకొలుపు కథాగానంలో ప్రధాన ఒగ్గుపూజారి "ఓం ఓం నీలకంఠ ఓం నీలకంఠ శివశివ నీలకంఠ శివ నీలకంఠ, ఎలా కోటి ఎలా కోటి రామా" అని మల్లన్న మేలుకొలుపును ప్రారంభిస్తే మిగిలిన పూజారులు శృతి పడుతారు. ఈ మేలుకొలుపు ప్రార్థన అనేది చాలా వినసొంపుగా ఉంటుంది.

వ్యాసం

'పోసేది నీ కాళ, చేసేది మీ సేవ, ఎగిలేత్తే నీ సేవ ఏమారుక చేసేము మల్లన్నా' అనే స్తుతిలో ఒగ్గుపూజారులు మల్లన్నకు సేవచేయుటకు ఎల్లవేళల సిద్ధంగా ఉంటామని ప్రార్థిస్తారు. సూర్యోదయ కాలపు పరవశాన్ని తెలియజేస్తూ ఆ మల్లికార్జున స్వామిని నిద్రయందు మేల్కొని తమ ఒగ్గు, డోలు వాయిద్యాల నాదంతోని చేసే పూజలం దుకొని వరాలియ్యమని వేడుకొంటారు. గుండంలో స్నానం చేసి భక్తులు సమర్పించే మొక్కులు, మల్లన్న దేవుని అలంకరించి పసుపు బండారితోని నాలుగు వర్ణాల స్త్రీలను పెళ్ళి చేసుకొని దైవంగా వెలిసిన విధానం, మల్లన్న స్వామికి భక్తులు సమర్పించే బోనం నివేదనను, మల్లన్న క్షేత్రాలలో పూజా విధానాన్ని అచ్చ తెలుగు పదాలతో, వ్యవహారిక భాషలో ఒగ్గు పూజారులు మేలుకొలుపు గానం చేస్తారు.

## మల్లికార్జునస్వామి మైలపోలు పాట

*"కర్ర గొంగడి లేదా పట్టుగొంగడి పరచి దానిపైన బియ్యంగింజలు మైలపోలు పోస్తారు.*

*మానేడు ముత్యాల మలసిందే పోలు - ఓ నా మల్లయ్య*

*అడ్డేడు ముత్యాల అళ్ళిందే పోలు - ఓ నా మల్లయ్య*

*కుంచేడు ముత్యాల కుదిరింది ఆపోలు - ఓ నా మల్లయ్య*

*బాలుడు మల్లన్న ఆ బాలకేతమ్మ - ఓ నా మల్లయ్య*

*ఆ బాల పద్మాల ఆ బాలుడు మల్లారెడ్డి - ఓ నా మల్లయ్య*

*ఆ బాల భ్రమరాంబ ఆ బాలుడు మల్లన్న - ఓ నా మల్లయ్య"*

*(మల్లేశం మక్క పెల్లి. ఒగ్గుపూజారి, వయస్సు: 60 సం॥లు; కొమురవెల్లి దేవస్థానం).*

ఒగ్గు పూజారులు మైలపోలు పాటను మల్లికార్జున స్వామి వివాహ సందర్భంలో నాగవెల్లి పట్నం వేయడానికి ముందు బియ్యంతో ముత్యాల పోలు పోస్తారు. ఒగ్గుకథల్లో కనిపించే ఈ మైలపోలు వర్ణన తెలుగువారి ప్రాచీన వివాహ సంప్రదాయ వైభవాన్ని తెలియజేస్తుంది. పెళ్ళిలో విశిష్ట స్థానం గల పోలు పోయడం అనే ప్రక్రియను అత్యంత సుందరంగా వినసొంపైన దరువులో ఒగ్గువారు వర్ణించారు. మానెడు ముత్యాలతోని పోలు మలచినట్టు, అడ్డెడు ముత్యాలతో పోలు అల్లినట్లు, కుంచెడు ముత్యాలతోని కుదురించి పోలుపోసినట్టు వర్ణించే ఈ కథాగానంలో పోసే బియ్యాన్ని ముత్యాలుగా వర్ణించారు. పూర్వం బియ్యాన్ని సోలెడు, మానెడు, అడ్డెడు, కుంచెడుగా కర్షకులు ధాన్యాన్ని కొలిచేవారు.

సోల = ధాన్యం కొలిచే కొలమానం. మూడు సేర్లు ఒక సోల.

మానెడు = ఐదు సోలలు

అడ్డెడ = ఎనిమిది సోలలు

కుంచెడు = పదహారు సోలలు లేదా ముప్పై సేర్లు

అని కర్షకులు ధాన్యాన్ని కొలిచేవారు. ప్రస్తుతం అధునాతనమైన ఎలక్ట్రానిక్ తూకం అందుబాటులోకి వచ్చాయి. మంగలోళ్ళను పిలిచి మైలపోలు దీసి సాకలోళ్ల పిలిచి చక్కని పోలు పోస్తున్నట్టు వర్ణించి ఆ ముత్యాలపోలు మీద కుడుక. గౌరమ్మను పెట్టి దాని ప్రక్కన మల్లికార్జునుడు, గొల్లకేతమ్మ, పద్మావతి, భ్రమరాంబతో కూర్చొని లగ్నమాడినట్టు ఒగ్గు పూజారులు మైలపోలు పాటలో వర్ణిస్తారు.



## అక్షింతల పాట

*"అక్షింతలు ఎయ్యవట్టిరి - మల్లన్న నీకు తలువాలు పొయ్యవట్టిరి*

*ఆరుకోట్ల అయ్యలు, మూడుకోట్ల మునులంత, డెబ్బైకోట్ల దేవతలంతా*

*విష్ణుభార్య లక్ష్మీదేవి - బ్రహ్మ భార్య శారాదాంబ, శివుని భార్య పార్వతమ్మ*

*చేడలు కాంతాలంతా - అక్షింతలెయ్యవట్టిరి*

*మా మల్లన్న, మేడలమ్మ, కేతమ్మ, పద్మావతి, భ్రమరాంబ, రత్నాంగికి తలువాలు*

*పొయ్యవట్టిరి" (ఒదయ్య సింగారపు, ఒగ్గుపూజారి, వయస్సు: 60 సం॥లు, కొమురవెల్లి మల్లన్న దేవస్థానం).*

ఒగ్గు పూజారులు చేసే మల్లన్న నాగవెళ్ళి పట్నంలో మల్లికార్జున స్వామికి, గొల్ల కేతమ్మకు, పద్మాలదేవితో కళ్యాణం జరిపిస్తారు. మల్లన్న చరిత్రను కథాగానం చేసిన తరువాత మల్లన్న కళ్యాణం ఒగ్గుకథ ఘట్టం కథాగానం చేసి ఆ సందర్భంగా మల్లన్న వివాహానికి దేవాను దేవతలు హాజరయ్యారని ఒగ్గువారు కథాగానం చేస్తారు. అనగా ఆరుకోట్ల దేవతలు, మునులు, బ్రహ్మ, విష్ణువు, శివుడు వారి వారి భార్యలు అందరూ కలిసి మల్లన్న, మేడలమ్మ, పద్మావతి భ్రమరాంబ రత్నాంగికి తలంబ్రాలు పోసి ఆశీర్వదించారని భావము. భక్తులు పట్నం మీద ఉన్న కుడుక, గౌరమ్మ మీద తలంబ్రాలు వేస్తారు. ఈ ఒగ్గు పూజారులు జరిపించే మల్లన్న కళ్యాణంలో చేసే ఒగ్గు ప్రార్థనలు, బ్రాహ్మణ పూజారులు చేసే కళ్యాణ ప్రార్థనలకు తాత్పర్యంలో తేడాలేమీ కనిపించవు. ఈ

విధంగా జానపదుల దేవతలకు భక్తులకు మధ్య ఒగ్గు పూజారి అనుసంధాన కర్తగా ఉంటాడు.

### తలబండారు దీవెన పాట

*"శివ శివ ఆడబిడ్డను కోరు - మంగాళగిరి మాతువ నందనా*
*కనక వస్తువాహన - వెండి, రత్నములు కలిగి*
*కొడుకుల బిడ్డల - కోటి సంపది కలిగి*
*అల్లుళ్ళు బిడ్డలు - అధిక సంతతి కలిగి*
*ఒగ్గులు దీవెన - వర్ధిల్లుండాలే*
*భక్తుల దీవెన - భాగ్యాలు కలిగి"*

*(మల్లేశం మక్కపెల్లి. ఒగ్గుపూజారి, వయస్సు: 60 సం॥లు; కొమురవెల్లి దేవస్థానం).*

మల్లన్న ఆలయాలలో ఒగ్గు పూజారులు వేసిన పట్నంపై శివసత్తులు చిందులు వేసి తొక్కిన పట్నంపై ఉన్న పంచ ముగ్గులను వస్త్రంతో కుప్పగా ఊడ్చుతారు. దీనినే "పసుపు బండారి" అంటారు. ఒగ్గు పూజారులు పసుపు బండారితో కుటుంబ సభ్యుల నుదుట బొట్టుపెట్టి చెక్కపలకలపై బండారి అద్ది పురుషులకు కుడిభుజంపై కొట్టి, స్త్రీలకు కొంగులో పసుపు వేసి ఆశీర్వాదాలు ఇస్తారు. ఈ సందర్భంగా ఒగ్గువారు భక్తులకు శుభం గల్గి సల్లగా వర్థిల్లాలని, భక్తులకు పట్టింది బంగారం కావాలని, ముట్టింది ముత్యం కావాలని, కొడుకులు, బిడ్డలు కోటి సంతతితో ఉండాలని, ఆడపిల్ల దీవెన, ఆర్తివాని (ఒగ్గువారు) దీవెన, మల్లయ్య దీవెన, బీరయ్య దీవెన, అక్కా మహంకాళి దీవెన భక్తులమీద ఉండి భక్తులు సుఖ సంతోషాలతో ఉండాలని ఒగ్గు పూజారులు దీవిస్తారు. ఈ విధంగా తలబండారు దీవెన అనేది మల్లన్న పట్నాల పండుగలో అతి ముఖ్యమైన ఆచారం.

### శివుడు ప్రత్యక్షమైన పాట

*"ఓం నమఃశివాయా శూలం, చక్రం - చురకత్తి, బాణం పట్టి*
*బాణం - జంజాలి, మరిగన్న గొడ్డండ్ల - నీ పేరు చేబుతుంటే*
*బ్రహ్మాండమము అదిలి - ఊగని గంటలు ఊగి*
*మోగని గంటలు మోగి - మోత మోగాలే"* *(బొద్దుల కిష్టయ్య. ఒగ్గుపూజారి, వయస్సు: 70 సం॥లు; కొమురవెల్లి దేవస్థానం).*



మల్లన్న ఆలయాలలో ఒగ్గు పూజారులు వేసే పట్నాలను శివసత్తులు తొక్కితే సాక్షాత్తు దేవతలు తమ పట్నాన్ని తొక్కినట్లుగా భక్తులు భావిస్తారు. శివసత్తుల వేషధారణ వివిధ రకాలుగా ఉంటుంది. కొమురవెల్లి, ఐనవోలు, ఓదెల, వేలాలలో గజ్జెల లాగు, ఒక టోపి, జనుముతో తయారు చేసిన వీరగోళలు చేతబూని, గవ్వల దండలు, నడుముకు గవ్వల ఒడ్డాణము కట్టుకొని కాళ్ళకు గజ్జెలు ధరించి పట్నం మీదికి శివసత్తులు పాదాలు మోపి సిద్ధంగా ఉంటారు. ఆ సమయంలో ఒగ్గు పూజారులు వారికి శివం తెప్పించడానికి ఉగ్రరూపం దాల్చే విధంగా శివసత్తులను శివుని ప్రతి రూపంగా భావించి శివుడు చేతిలోని శూలం, చక్రం, జంజాలి ధరించామని 'నీ పేరు చెబుతుంటే నీళ్ళల్ల పుట్ట పుట్టి-నిప్పుకు చెదలెక్కిందని' చెప్పడం చూస్తే నీళ్ళలో పుట్ట పుట్టదు, అదే విధంగా నిప్పుకు చెదలెక్కడం సాధ్యం కాదు, అంటే శివునికి చాలా మహిమలు ఉన్నట్లు భావిస్తారు. ఇటువంటి మహిమలు కేవలం శంకరుడితోనే సాధ్యమని ఒగ్గువారు ప్రార్థిస్తారు. 'ఈరగొళబట్టి ఇసిరి కొడితే పసురంటి భూతాలు పారిపోతాయని', ఒగ్గువారి వర్ణన ప్రకారం జానపదుల మూఢనమ్మకాలైన దయ్యాలు, బూతాలను తరిమికొట్టడానికి ఈరగోళ ప్రధానమైన ఆయుధమని భక్తులు ఇప్పటికి విశ్వసిస్తున్నారు. శివుని పేరు చెబితే పట్టపగలు చుక్కలు పొడుస్తాయని ఒగ్గువారు పాటలు పాడటంతో శివతాండవం చేసిన శివుడు ప్రత్యక్షమయినట్టు భావించి శివసత్తులు ఉగ్రరూపం దాల్చి శివైక్యం చెంది తూలుతారు.

**మల్లన్న ఆలయాలలో ఒగ్గు పూజారులు వేసిన పట్నంపై శివసత్తులు చిందులు వేసి తొక్కిన పట్నంపై ఉన్న పంచ ముగ్గులను వస్త్రంతో కుప్పగా ఊడ్చుతారు. దీనినే "పసుపు బండారి" అంటారు. ఒగ్గు పూజారులు పసుపు బండారితో కుటుంబ సభ్యుల నుదుట బొట్టుపెట్టి చెక్కపలకలపై బండారి అద్ది పురుషులకు కుడిభుజంపై కొట్టి, స్త్రీలకు కొంగులో పసుపు వేసి ఆశీర్వాదాలు ఇస్తారు.**

పైన వివరించిన ఒగ్గు కథాగానాలను నా క్షేత్ర పర్యటనలో భాగంగా కొమురవెల్లి దేవాలయానికి వెళ్ళి అక్కడి ఒగ్గు పూజారులైన మక్కపెల్లి మల్లేశం, సింగారవు, ఓదెలు, బొద్దుల కిష్టయ్య, ఒగ్గు శ్రీనివాస్ గార్ల నుండి సేకరించి కొమురవెల్లితో పాటు ఇతర మల్లన్న క్షేత్రాలలో ఒగ్గు పూజారుల ఆరాధన కథాగానాలను విశ్లేషించి తెలియ జేయుచున్నాను.

### మల్లికార్జున క్షేత్రాలలో ఆరాధన కథాగానం

వ్యాసం

తెలంగాణ రాష్ట్రంలోని మల్లన్న క్షేత్రాలలో ఒగ్గు పూజారులు పట్నం వేసే సమయంలో మల్లన్న దేవున్ని, భక్తులను ప్రసన్నం చేయడానికి ఈ కింది విధంగా కథాగానం చేస్తారు.

*శరణూ మల్లేశా బాల మల్లేశా - బాల*
*కొంరెల్లి చేరియాల మల్లేశా*

*ఓరుగంటి ఓయు మూల ఒప్పితమైన*
*గుళ్ళు కట్టి -ఐలవోని మల్లేశా ॥శరణూ॥*

*గంగ ఒడ్డున మంచి గౌతమొక్క*
*చెలిమె ముందు-వేలాల మల్లేశా గట్టు*
*మల్లేశా ॥శరణూ॥*

*పెద్దపల్లి తాలుకా పేరుగళ్ళా- ఓదెల*
*మల్లేశా గురుడా మల్లేశా ॥శరణూ॥*

*మొక్కేటి భక్తులకు మోక్షంబు*
*ఇచ్చేటి-ఆదుకోవయ్య జూలపల్లి పర్వతాల*
*మల్లేశా ॥శరణూ॥*

*చందమామ కన్నా అందగాడివి*
*స్వామి-విలోచవరములో వెలసిన పర్వతాల*
*మల్లేశా*

*చెమటలోన పుట్టైనావయ్యా*
*స్వామి-మంథనిలోన వెలసిన*
*చెన్నపర్వతాల మల్లేశా*

*పుట్టలోన వెలిసినావు స్వామి-సిరిపురం*
*మల్లేశా సిరిగల్లా దేవుడావు ॥శరణూ॥*

*(ఓదయ్య సింగారపు. ఒగ్గు పూజారి, వయస్సు: 60 సం॥లు; కొమురవెల్లి దేవస్థానం).*

ఒగ్గు పూజారులు నిర్వహించే ఆరాధన ఒగ్గు కథాగానాలలో మల్లన్న మేలుకొలుపు గానం చేసిన తరువాత మల్లన్న ఆలయాలలో మల్లన్న దేవుని లీలలను కథాగానం చేస్తుంటారు. మొదట వచనంలో చెప్పిన విషయం అంతా గేయ రూపంలో చెప్పబడుతుంది. 'శరణు మల్లేశా... శరణు మల్లేశా... శరణయ్య మీ సేవా చేతు మల్లేశా' అనే పల్లవిలో సాగే ఈ మేలుకొలుపు గేయంలో ఒగ్గు పూజారులు మల్లన్న స్వామిని ఆరాధిస్తూ నీ సేవలు, పూజలు చేస్తామని, మమ్మల్ని దీవించమని ఒగ్గు పూజారులు ప్రార్థన చేస్తారు. ఈ ఆరాధన గేయంలో తెలంగాణలో వెలిసిన మల్లికార్జున క్షేత్రాల ప్రాధాన్యత కనిపిస్తుంది. కొమురవెల్లి, ఐనవోలు, ఓదెల, జూలపల్లి, వేలాల, విలోచవరం, మంథని, సిరిపురం మల్లన్న క్షేత్రాలలోని మల్లన్న వెలిసిన విధానం, ఆ క్షేత్రాలలోని మల్లన్న రూపురేఖలు, అందచందాలను ఒగ్గు పూజారులు గ్రామీణ పలుకుబడులతో కూడిన చక్కని భాషా ప్రయోగాలతో వర్ణిస్తారు. 'పాతాళ గంగలోనే శివతానమాడంగా పాపపుణ్యములు ఎడబాపు మల్లేశా' వంటి ప్రయోగాలను బట్టి మల్లన్న స్వామిని దర్శించుకునే భక్తులు ఇప్పటికి శ్రీశైలంలో పాతాళగంగా మరియు ఇతర మల్లన్న క్షేత్రాలలో కోనేటి స్నానం ఆచరించి దైవదర్శనం చేసుకొనే సంప్రదాయం గమనించవచ్చు. ఈ ఆరాధన గేయంలో ఒగ్గువారు ఎంతో భక్తి శ్రద్ధలతో పంచముగ్గులతో పట్నాలు వేసి, ఒగ్గు, జెగ్గుల నాదాల మధ్య ఆ పట్నం మీద ఆశీనులై ఒగ్గువారి పూజలకు వరమియ్యి దేవుడా అని మల్లన్నను ఆరాధిస్తారు.

ఈ విధంగా తెలంగాణలోని ప్రసిద్ధిగాంచిన మల్లన్న క్షేత్రాలైన కొమురవెల్లి, ఐలోని, వేలాల, జూలపల్లి, విలోచవరం, మంథని, పెద్దాపురం, రేగులకుంట మల్లన్న జాతర సందర్భాలలో భక్తులు మొక్కుబడులు చెల్లించి, పట్నాలు వేసినప్పుడు ఒగ్గు పూజారులు దేవునికి ప్రార్థన చేసేటప్పుడు ఈ విధంగా కథాగానం చేస్తారు. దేవుని వేషధారణ, ఘనకార్యములు మరియు పూజలు, భక్తులు చెల్లించే మొక్కుల గురించి భక్తులపై మల్లన్న దేవుని కరుణను ప్రధానంగా పాటలో వివరిస్తూ ఒగ్గు పూజారులు కథాగానం చేస్తారు.

## కార్మిక దినోత్సవ ప్రత్యేక సంచిక కోసం రచనలకు ఆహ్వానం



**మే 1 ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రాబోతున్న కార్మిక దినోత్సవ ప్రత్యేక సంచికకు రచనలను ఆహ్వానిస్తున్నాం.**

**మీ కవితలు, వ్యాసాలు, కథలు ఏప్రిల్ 15, 2024 లోగా మాకు చేరేలాగా పంపగలరని కోరుతున్నాం.**

**- ఎడిటర్**

# గురుభావం

**ఇష్టమైన వారిని కష్టాల్లో
ఆదుకున్న వైనం తెలిపిన కథ...**



మద్దూరి నరసింహమూర్తి
91645 43253

రావుగారు నా సహోద్యోగి మాత్రమే కాదు గురుతుల్యులు కూడా. నాకు ఎంతగానో చేరికైన రావుగారు నాకంటే వయసులో పెద్దవారే కాక ఉద్యోగ హోదాలో కూడా పెద్దవారు. అవతల వ్యక్తి ఎంత చిన్నవారైనా అతని దగ్గర తెలుసుకోవలసినది లేశమాత్రమైనా ఉంటే తప్పకుండా నేర్చుకోవలసినదే అని ఆలోచించి ఆచరించే నిగర్వి. పైగా రావుగారు మంచి సాహిత్యాభిలాషి కూడా.

మేము ఎప్పుడు ఎలా చేరువయేమో కానీ, ఆ క్షణం నుంచి నేను ఆయనని 'గురువుగారూ' అని పిలవడం, ఆయన నన్ను 'మూర్తిగారు' అని ఆప్యాయంగా పిలవడం అలవాటైపోయింది. నన్ను ఏకవచనంతో 'మూర్తి' అనండి చాలు అని ఎన్నిసార్లు చెప్పినా చిరుమందహాసంతో తోసిపుచ్చేవారు.

గురువుగారికి ముత్యాల్లాంటి ముగ్గురు ఆడపిల్లలు. మూడుసార్లు కన్యాదానం చేసే భాగ్యం నాది అని ఆయన మురిసిపోతూండేవారు.

మేము పనిచేసే బ్యాంకు ఒకటే అయినా మేము పనిచేసే శాఖలు వేరు వేరుగా ఉండడంతో మేము కలుసుకొనేది ఆదివారాలు సాయంత్రం మాత్రమే. అప్పుడు మా మధ్యన సాహిత్య చర్చలు, పాత తెలుగు సినిమాల్లోని విలువలు గురించే ఎక్కువగా సంభాషణలు ఉండేవి.

గురువుగారికి ఈ ఊరినుంచి బదిలీ అయి రెండేళ్లు అయిపోయింది. అప్పటినుంచి ఆయనను మరి కలవడం కుదరలేదు.

ఈరోజు ఆదివారం అవడంతో గురువుగారు అదే పనిగా జ్ఞప్తికి రాసాగేరు. ఆయన జ్ఞాపకాలతో సోమవారం బ్యాంకుకి వెళ్లిన నాకు రావుగారు పనిచేస్తున్న శాఖకి పనిమీద వెళ్ళమని ఉత్తర్వులు రావడంతో నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

మరునాడు ఉదయం రావుగారు పనిచేస్తున్న శాఖకి చేరుకొని ఆయనని కలిసి ఆశ్చర్యంలో ముంచేద్దాం అనుకొని చేరుకున్న నేను, గురువుగారు ఆరోజు సెలవలో ఉన్నారని తెలుసుకొని హతాశుడనైపోయాను. ఆఫీస్‌లో గురువుగారి ఇంటి చిరునామా తీసుకొని, నేను వచ్చిన పని త్వరగా ముగించుకొని, సాయంత్రం 5 గంటలకు ఆయన దగ్గరకు బయలుదేరేను. నేను కొట్టిన కాలింగ్ బెల్ కి సమాధానంగా వారి రెండో అమ్మాయి తలుపు తీసి నన్ను చూసి ఆశ్చర్యపడి "రండి అంకుల్" అని లోపలికి ఆహ్వానించింది.

-2-

"నాన్నగారేరమ్మా, ఈరోజు సెలవెందుకు పెట్టేరు, కులాసాగానే ఉన్నారా" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న నా మాటలకు అడ్డు తగిలినట్టుగా-

"ఎవరదీ, మూర్తిగారేనా" అంటూ కళ్ళ మీదగా కట్టు కట్టుకొని, వారి శ్రీమతి సహాయంతో తాపీగా నడుచుకొని వస్తున్న గురువుగారు కనిపిస్తే నాకొక్కసారిగా ఆశ్చర్యం వేసింది.


"నేనే గురువుగారూ. ఏమిటయ్యింది మీకు. కళ్ళ మీదగా ఆ కట్టేమిటి" అని ఆతృతగా ప్రశ్నిస్తున్న నా వేపు చిరునవ్వుతో-

"మీరు మీ కుటుంబం కులాసాగానే ఉన్నారా, అసలు మీరెప్పుడు వచ్చేరు ఈ ఊరు" అని తన కష్టంలో కూడా నా కుశలం అడుగుతున్న అతని సహృదయానికి ద్రవించిన నేను --

"మేమంతా కుశలమే గురువుగారు, మీ శాఖకే నన్ను పనిమీద బ్యాంకు వారు పంపితే ఉదయం వచ్చేను. ముందు మీకేమిటయ్యిందో నాకు వివరంగా చెప్పండి" అని అతని చేయి పట్టుకొని అడుగుతున్న నా చేయి ఆతని చేతిలోకి తీసుకొని - "ఏం జరిగిందంటే" అని చెప్పుకొచ్చేరు.

"ఆదివారం ఉదయం దంతధావనం చేసుకొని అద్దం ఎదుట నిలబడి తువ్వాలుతో మొఖం తుడుచుకుంటూంటే, ఎడమకంటి మీద తువ్వాలు కప్పబడి కుడికన్ను తెరచి ఉన్నా ఏమీ

కనపడక అంతా చీకటిగా తోచింది. హఠాత్తుగా కరంట్ కానీ పోయిందా అని అనుకుంటూ, ఎడమకంటి మీద నించి తువ్వాలు తీయగానే కరంట్ పోలేదు అని తెలుస్తూ అన్నీ కనిపిస్తున్నాయి. ఎడమకన్ను కప్పుకొని రెండు మూడు సార్లు చూస్తే కుడికన్ను ద్వారా ఏమీ కనిపించడం లేదు అని నిర్ధారణకు వచ్చి, కళ్ళ వైద్యుని దగ్గరకు వెళ్ళేను. ఆయన రెండు కళ్ళనూ పరీక్షించి ఒక మందు వ్రాసి మూడు రోజులు మూడు పూటలా మూడేసి చుక్కలు రెండు కళ్ళలోనూ వేసుకొని రెండు కళ్ళని పూర్తిగా గుడ్డతో కప్పి ఉంచమని చెప్పి, నాలోగో రోజు మరలా వచ్చి కళ్ళు చూపించుకోమని చెప్పేడు"



"గురువుగారూ మీకు చెప్పేటంతటి వాడిని కాను. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్న సంగతి మీకు తెలియంది కాదు. కాబట్టి ఈ చిన్నఊళ్ళో ఉన్న కళ్ళ వైద్యుని నమ్ముకొని కాలహరణం చేయకుండా, వెంటనే చెన్నై వెళ్లి అక్కడున్న పేరుమోసిన 'శంకర నేత్రాలయ' లో చూపించుకుంటే చాలా మంచిది"

"ఈ డాక్టర్ చెప్పినట్టు రేపొకసారి ఆయనకి కళ్ళు చూపించొకొని వచ్చి, అవసరమైతే అప్పుడు వెళ్లొచ్చు"

"మీరు వెళ్ళవలసి వస్తే, నేను కూడా వస్తానండీ" అని గురువుగారి భార్య అనగానే--

"అలాగే, నువ్వు పక్కన లేకుండా నేనెలా వెళ్తాను" అని నవ్వుతూ భార్యతో అన్నారు గురువుగారు.

"మీరిద్దరూ వెళ్తే సరిపోతుందా, నేను కూడా వస్తాను" అన్న నా మాటలు విన్న గురువుగారు--

"మూర్తిగారూ మీరు బ్యాంకు పని మీద వచ్చేరు. మరలా మీరు వెనక్కి వెళ్లి మీరు ఇక్కడ చేసిన పని గురించి మీ అధికారులకు వెంటనే తెలియచేయాలి కదా"

-3-

"నేను వచ్చి ఇక్కడ చేసిన పని గురించి మా అధికారులతో మాట్లాడి వారికి పంపవలసిన కాగితాలు మెయిల్ చేయడం అయిన తరువాతే మీ దగ్గరకి వచ్చేను. నేను చూసుకోవలసినది మీతో రావడానికి కావలసిన సెలవు మాత్రమే. ఆ విషయం నాకు వదిలేయండి. నేను చూసుకుంటాను. నేను కూడా మీతో వస్తున్నానంతే"

"సరే అలాగే వద్దురుగాని మూర్తిగారూ. ఇంతకీ రేపు ఈ డాక్టర్ ఏమంటాడో చూద్దాం"

"గురువుగారూ నా అభిప్రాయంలో ఇక్కడ డాక్టరుకి చూపించి వచ్చి మనం బయలుదేరడం కంటే, రేపుదయమే మనం చెన్నై బయలుదేరితే ఎల్లుండి ఉదయమే మనం శంకర నేత్రాలయలో చూపించుకోవచ్చు"

"సరే, మీ ఇష్టం మూర్తిగారూ. కానీ, ఇంత హఠాత్తుగా ప్రయాణానికి టిక్కెట్లు దొరుకుతాయా"

"నేనిప్పుడే వెళ్లి మనకి కావలసిన టిక్కెట్లు, అక్కడ ఉండడానికి వసతి సదుపాయం ఏర్పాటు చూసుకొని రేపుదయం వస్తాను. కలిసి స్టేషన్ కి వెళదాం"

"ఉండండి ఈ రాత్రి భోజనం చేసి మీరున్న హోటలుకి వెల్దురుగాని"

"మన్నించండి, మనకి పనులు ముఖ్యం. టిక్కెట్లు తీసిన తరువాత మీకు నేను ఫోన్ చేసి చెప్తాను. ఈరోజు రాత్రి త్వరగా తినేసి విశ్రాంతిగా పడుకోండి, గుడ్నైట్ గురువుగారూ"

శంకర నేత్రాలయ వారు రావుగారిని క్షుణ్ణంగా పరీక్షించి రెండూ కళ్ళలోనూ ఎటువంటి దోషం లేదు. ఎటువంటి మందు వేసుకోనక్కరలేదు అని తేల్చి చెప్తూ - 'న్యూరోలాజిస్ట్' ని కలవడం మంచిది అని ఉచిత సలహా ఇచ్చేరు.

"గురువుగారూ, నేనిప్పుడే వస్తాను. నేను వచ్చే వరకూ మీరిద్దరూ ఈ హాల్లోనే

**"ఆదివారం ఉదయం దంతధావనం చేసుకొని అద్దం ఎదుట నిలబడి తువ్వాలుతో మొఖం తుడుచుకుంటూంటే, ఎడమకంటి మీద తువ్వాలు కప్పబడి కుడికన్ను తెరచి ఉన్నా ఏమీ కనపడక అంతా చీకటిగా తోచింది. హఠాత్తుగా కరంట్ కానీ పోయిందా అని అనుకుంటూ, ఎడమకంటి మీద నించి తువ్వాలు తీయగానే కరంట్ పోలేదు అని తెలుస్తూ అన్నీ కనిపిస్తున్నాయి.**

కూర్చోండి, ఎటూ వెళ్ళకండి'' అని చెప్పి కొంతసేపటి తరువాత వచ్చి

"గురువుగారూ, బెంగళూరులో ఉన్న నాకు తెలిసిన 'న్యూరోలాజిస్ట్' తో ఇప్పుడే మాట్లాడేను. ఆయన ఇక్కడ ఒక డయాగ్నస్టిక్ సెంటర్ చిరునామా నెంబర్ ఇచ్చేరు. అక్కడ మీకు ఇప్పుడే టెస్ట్ చేయించమన్నారు. టెస్ట్ చేసిన తరువాత వారు మనకు వెంటనే రిపోర్ట్ ఇవ్వడమే కాక అతనికి ఆ రిపోర్ట్ ఈ-మెయిల్ చేస్తారు. మనం డయాగ్నస్టిక్ సెంటర్ చేరుకొనేలోపల వారితో ఆయన మాట్లాడతానన్నారు. కాబట్టి టెస్ట్ చేయించుకుందురుగాని పదండి ముందు'' అని -

ముగ్గురం కలిసి టెస్ట్ కోసం బయలుదేరేము. మేము అక్కడకి చేరుకోగానే రావుగారిని టెస్ట్ కోసం తీసుకొని వెళ్లి అరగంట తరువాత ఈవలకు తీసుకొని వచ్చి "అరగంట వేచి ఉండండి రిపోర్ట్ తీసుకొని వెల్దురుగాని'' అని చెప్పేరు. అరగంట తరువాత రిపోర్ట్ అందుకున్న మేము అక్కడ కూర్చొని ఉండగా బెంగళూరు ఉన్న న్యూరోలాజిస్ట్ "గురువుగారికి మెదడులో ట్యూమర్ ఉందని, ఏమాత్రం ఆలస్యం కాకుండా శస్త్రచికిత్స చాలా అవసరం అని చెప్పి, ఆసుపత్రిలో సుమారుగా 30 రోజులుకి తక్కువ కాకుండా ఉండి రేడియేషన్ చికిత్స కూడా చేయించుకోవాలి, అందుకు సుమారుగా నాలుగు లక్షలు ఖర్చు అవుతుందని, ఆ తరువాత ఆరునెలలకొక సారి వచ్చి పరీక్ష చేయించుకుంటూ ఉండాలి'' అని నాకు ఫోన్ లో చెప్పేరు.

-4-

అది విన్న రావుగారికి ఆయన భార్యకి విచారంతో నోటివెంట మాట రాలేదు.

"గురువుగారూ, మనం కాస్త ఎంగిలి పడి త్వరగా రైల్వేస్టేషన్ కి చేరుకుంటే, బెంగళూరుకి వెళ్లే ఏదో రైల్లోనో లేకపోతే బస్సులోనో బయలుదేరి ఈ రాత్రికి బెంగళూరుకు చేరుకోవొచ్చు''

"మూర్తిగారూ నాకోసం మీరు ఎంతగానో కష్టపడడం చూస్తూంటే నాకు మీరు చేస్తున్న సహాయానికి ఆనందం నావలన మీకు కలుగుతున్న కష్టానికి విచారం ఏకకాలంలో వస్తున్నాయి''

"అలా మాట్లాడి నన్ను పరాయివాడిని చేయకండి గురువుగారూ'' అని అక్కడనుంచి బయలుదేరేము.

బెంగళూరులో గురువుగారిని న్యూరోలాజిస్ట్ మరొకసారి పరీక్ష చేసి "హాస్పిటల్ లో వెంటనే చేరిపోమని, మరునాడు ఉదయమే శస్త్రచికిత్స చేస్తాను'' అని బోధపరిచేరు.

"గురువుగారూ డాక్టర్ చెప్పినది విన్నారు కదా. ఇంకేమీ ఆలోచించక ఆపరేషన్ చేయించుకోండి. త్వరలో బాగైపోతారు'' అని చెప్పిన నాతో

"మూర్తిగారూ, మీరు చెప్పినది చేయాలనే ఉంది కానీ, ఊరు కాని ఊర్లో ఇప్పటికిప్పుడు ఆపరేషన్, నాలుగు లక్షలు అంటే ఎలా''

"అవన్నీ ఇప్పుడు ఆలోచించే సమయం కాదు, అంత సమయం లేదు. అన్నింటికీ నేనున్నాను. మీకు ఆపరేషన్ అయి, మీరు బాగై, మీ ఇంటికి మీరు చేరుకున్న తరువాతే నేనిక్కడనించి కదిలేది''

"మూర్తిగారూ మిమ్మల్ని ఇలా వాడుకుందికి మనసు రావడం లేదు''

"గురువుగారూ నేను చెప్పేది పూర్తిగా వినండి. మీకు ఇప్పుడు ఆపరేషన్ అత్యవసరం. అందుకు మరేమీ ఆలోచించక ఆపరేషన్ కి మనసా సిద్ధం

"గురువు గారూ, బెంగళూరులో ఉన్న నాకు తెలిసిన 'న్యూరోలాజిస్ట్' తో ఇప్పుడే మాట్లాడేను. ఆయన ఇక్కడ ఒక డయాగ్నస్టిక్ సెంటర్ చిరునామా నెంబర్ ఇచ్చేరు. అక్కడ మీకు ఇప్పుడే టెస్ట్ చేయించమన్నారు. టెస్ట్ చేసిన తరువాత వారు మనకు వెంటనే రిపోర్ట్ ఇవ్వడమే కాక అతనికి ఆ రిపోర్ట్ ఈ-మెయిల్ చేస్తారు. మనం డయాగ్నస్టిక్ సెంటర్ చేరుకొనేలోపల వారితో ఆయన మాట్లాడతానన్నారు.

అయిపోండి. నేను డాక్టర్ తో మాట్లాడి వస్తాను''

గురువుగారికి ఆపరేషన్ విజయవంతంగా జరగడం, 30 రోజులకి ఆయన ఆసుపత్రినుంచి క్షేమంగా ఇంటికి బయలుదేరడం అంతా భగవంతుడు అమర్చినట్టు చక చకా జరిగిపోయింది.

మధ్యలో రెండుసార్లు నేను నా ఇంటికి, ఒక్క రోజు కోసం, వెళ్లి వెంటనే రావడం చేసేను.

గురువుగారిని ఇంటి దగ్గర చేర్చి "గురువుగారూ నేనిక సెలవు తీసుకుంటాను'' అన్న నాతో...

"ఈ రోజు మా ఆతిథ్యం తీసుకొని, ఈరోజు వరకూ నా మీద నువ్వు పెట్టిన ఖర్చు అంతా కూడా రేపు నా దగ్గర నుంచి పూర్తిగా తీసుకొని వెలుదువుగాని మూర్తీ'' అన్న గురువుగారి మాట విన్న నేను ఆనంద భాష్పాలతో ...

-5-

"మీరు తొలిసారిగా నన్ను 'మూర్తీ' అని ఏకవచనంతో సంభోదిస్తూంటే నా చిరకాల కోరిక తీరిన ఆనందం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూంది గురువుగారూ'' అని నా మనసులో ఆ క్షణంలో మెదిలిన అనుభూతిని వెలిబుచ్చేను.

"నన్ను అవసరంలో ఆదుకున్న నీకు, నువ్వు ఖర్చు పెట్టిన డబ్బు తిరిగి ఇచ్చి ఋణవిముక్తడను కాగలనేమో కానీ, సమయానికి దేముడిలా వచ్చి నువ్వు చేసిన నిస్వార్థ సేవకు నేను నా కుటుంబం ఎప్పటికీ మా మనసులలో నీ పట్ల ఋణగ్రస్తులుగానే మిగిలిపోతాం మూర్తీ'' అన్న గురువుగారితో--

"అంత పెద్దమాటలెందుకు గురువుగారూ, నాకు మీ పట్ల ఉండే గురుభావం మాత్రమే నన్ను అలా ప్రవర్తించేలా చేసింది, అంతే''

అన్న నా చేతిని తన చేతిలోకి తీసుకున్న గురువుగారు నావైపు నవ్వుతూ చూసి ఒక గురువు తన ప్రియ శిష్యుడిని ఎంతో అభిమానంగా దగ్గరకు తీసుకున్నట్టుగా నన్ను అక్కున చేర్చుకున్నారు.

కవిత

# బంగారం

వకుళవాసు, 99891 98334



బడిలో చదువుకునేటప్పుడు...
నాన్న! పక్కింటి మామయ్య
ముట్టుకుంటున్నాడే...
బంగారం అని పిలుస్తున్నాడే
అని చెప్పాలనుకున్నది కాని భయం
చెబితే నాన్న కోప్పడతాడేమోనని....

కాలేజీలో చదువుకునేటప్పుడు....
అమ్మా! ఎవడో వెంటపడుతున్నాడే
వెకిలిగా చూస్తున్నాడే బంగారం
అంటూ పిలుస్తున్నాడే

అని చెప్పాలనుకున్నది కాని భయం
చెబితే  నువ్వెందుకు దిక్కులు
చూస్తూ
నడుస్తున్నావని అమ్మ తిడుతుందని...

ఉద్యోగం చేస్తున్నప్పుడు....
ఏవండీ! మాతోని పనిచేసేవోడు
సమాజంలో పైకి మర్యాదస్తుడే కాని
ఎప్పుడూ వికారంగా చూస్తున్నాడండి

వింతగా ప్రవర్తిస్తూ బంగారం అని పిలుస్తున్నాడండీ
అని చెప్పాలనుకున్నది కాని భయం
చెబితే కాపురం ఎక్కడ ముక్కలౌతుందోనని....

ఎదలో శోక సముద్రం చిలుకుతున్నది
పెదాలపై చిరునవ్వులు పుట్టించాలని ....

కాని కళ్ళలో అగ్గిరవ్వలు
పుట్టుకొస్తున్నాయేంటో! ఎంత వద్దన్నా
కళ్ళల్లో కారే కన్నీరే కార్చిచ్చై
కాల్చేయదా ఏదో ఓరోజు ఈ పిశాచిని...

అంటూ మౌనంగా యుద్ధం చేస్తూనే ఉన్నది ఉంటుంది
ఎందుకంటే తను ఆడది కాబట్టి...

కాలాలు మారినా బుద్దులు మారని
కొందరురాక్షసుల మధ్యలో
పుట్టిన బంగారం కదా మరి....
అలా అని తన సహనాన్ని పరీక్షించకు...

రౌద్రజ్వాలై  కామంతో చూసే
నీ కనుగుడ్లు పీకేస్తుంది...
కంపనం కలిగించే నీ చేతులను
పెళపెళ విరిచేస్తుంది...
మదమెక్కిన నీ మగ దురహంకారాన్ని...
పాతాళలోకం లోకి తొక్కేస్తుంది...

క
థ

# నేలపై వినీలాకాశం

చదువు మనిషిని ఎలా
ఎదిగిస్తుందో చెప్పే కథ...



రామా చంద్రమౌళి
93901 09993

చదువు వలననె కలుగు
జగమెరుగు జ్ఞానంబు
చదువు వలననె కలుగు
అరి గెలుచు ధైర్యంబు
చదువు వలననె మనిషి మహితుడగును..

చదువు. చదువు.. కారణం తెలియదు గాని తన జీవితమంతా చదువు.. చదువే అన్నపానీయాలై.. చదువే ఆకలిదప్పులై.. చదువే రేయింబవళ్ళై.. చదువే శ్వాసై ధ్యాసై.. బ్రతుకై.,

కళ్ళు మూసుకుని ఒక యోగినిలా నిరామయ స్థితిలో ఉన్న పార్వతి హృదయం నిండా ఒక ఉద్వేగపూరితమైన అంతరిక్ష మండలం భ్రమిస్తూ విస్ఫోటిస్తూ నిశ్చలిస్తూ విహ్వలిస్తూ.

చుట్టూ భౌతికంగా విస్తరించి ఉన్న సకల చరాచర వాతావరణాన్నీ, సంభరిత స్థితినీ స్పృహించకుండా అలా ఉండిపోయి సంలీనమై ఉన్న ఆమె.

నిజానికి చదువుయొక్క ప్రతీకాత్మక రూపమే పుస్తకం.

తను చిన్నప్పటినుండి ఎన్ని వేల పుస్తకాలను చదివిందో.

అందరూ పుస్తకాలను డిగ్రీల కొరకు, యూనివర్సిటీ సర్టిఫికేట్ల కొరకు, తద్వారా పొందగలిగే ఉద్యోగాల కొరకు మాత్రమే చదువుతారు.

కాని తను జ్ఞానం కొరకు, తెలివి కొరకు, ధైర్యం కొరకు, తనను తానూ ఇతరులనూ ప్రశ్నించడం కొరకు.. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నీ. సమాజాన్నీ, మనుషులనూ, మనుషులను అంటిపెట్టుకుని వసిస్తున్న సకల మానవ సంవేదనలనూ, సమస్యలనూ, రాజకీయాలనూ, కుట్రలనూ, కుతంత్రాలనూ, వ్యూహాలనూ, వంచనలనూ.. అన్నింటినీ 'తెలుసుకోవడం' కోసం.. చదువుతూనే ఉంది పార్వతి. అనంతం నుండి మహానంతం దాకా. అసలు అంతమనే ముగింపులేని అనంత రాశులు రెండే రెండున్నాయి సృష్టిలో.. ఒకటి కాలం. రెండు చదువు.

చదివించిరి నను గురువులు,
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే
జదివినవి గలవు పెక్కులు,
చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ!..

మహాభాగవతంలోని ప్రహ్లాద చరిత్రలో ప్రహ్లాదుడు చదివి తండ్రికి వినిపించిన సందర్భం.,

'దేవుని పార్వతి .. డి. పార్వతి డాటర్ ఆఫ్ రాఘవులు, సోషియల్ సైన్సెస్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ విత్ గోల్డ్ మెడల్ అండ్ స్పెషల్ అప్రీషియేషన్ ఫ్రం హిందూ బనారస్ యూనివర్సిటీస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పురానేతిహాస.'

ఎస్ వి విశ్వవిద్యాలయ కాన్వొకేషన్ హాల్‌లో జరుగుతున్న వేలమంది విద్యార్థులూ, జాతీయ స్థాయి ఆచార్యగణం.. వేదికపై ప్రపంచస్థాయి ఘనులు.. అందరూ స్పెల్‌బౌండ్.

ఉలిక్కిపడి చటుక్కున కలలోనుండి ఊడిపడ్డట్టు.. ఈ లోకంలోకి జారి వర్షించి.. లేచి నిలబడింది పార్వతి. ఒక అసాధారణమైన అధ్యయనం ఆమెది. పరిశోధన.. విశిష్టమైన అంశంపై. వేదికపైనుండి.. స్వర్ణ పతకాన్నీ, తదితర సామగ్రిని ప్రదానం చేయడానికి బంగారు రంగు వస్త్రాలనూ, శిరస్సులపై సంప్రదాయ బానెట్(హుడ్)ను ధరించి ఆహూతులైన పెద్దలు,

పులకించిపోతూ.. అడుగులో అడుగేసుకుంటూ.

ఎక్కడి పార్వతి.. ఎక్కడి తిరుపతి. వరంగల్లు దగ్గరి పర్వతగిరి ప్రక్కనున్న దేవుని మాన్యం ఊరికి చెందిన బహుజన అమ్మాయి పార్వతి. తండ్రి ఊళ్ళోనే చుట్టుప్రక్కలకు ఎద్దులబండిలో సరుకుల రవాణా చేసే స్వయం కూలి.. తల్లి పొలాల్లోకి రోజువారి కూలీకి వెళ్ళే స్వయంపోషిత. ఇంకో పిల్లాడు పార్వతి తమ్ముడు వరంగల్లులోని ఎస్సీ ఎస్టి బాలుర వసతిగృహంలో ఉంటూ ఆరవ తరగతి చదువుతూ.

పార్వతి తమకున్న పదిహేను గుంటల భూమిలో కేవలం ఆకుకూరలనూ కూరగాయలను స్వయంగా ఒక్కతే

కథ

పండించి సిటి లోని 'ఓ' సిటీ కాలనీ మూలపై అబ్బనికుంట చౌరాస్తా దగ్గర అమ్ముట స్వయంగా. ఒకే ఒక గంటలో పార్వతి ఆకుకూరలూ, కాయకూరలూ కలాస్. ' సోల్డ్ '. వ్యాపారానికి మూలం నీ ప్రాడక్ట్ నాణ్యత, తక్కువ ధర, కష్టమర్లతో విధేయమైన మానవ సంబంధాలని ఆమెకు ఎప్పుడో తెలుసు. 'ఎవరి జీవితాన్ని వాళ్ళు ఇటుకపై ఇటుక పెట్టి గోడ కట్టినట్టు నిర్మించుకోవాలె..' అన్నది ఆమె తత్వం.

విశాలమైన వేదికపైకి వచ్చిన పార్వతిని వైస్ చాన్సలర్, గవర్నర్, ఇతర ప్రత్యేక అతిథులు.. చాలా వాత్సల్యంగా చేతులు చాచి స్వాగతించి.

పార్వతి స్వయంసిద్ధ.


ఆమె గమ్యం ఆమె చేతనే అతి స్పష్టంగా నిర్వచించబడి ఎక్కడో సచేతన స్వప్నమై నిరీక్షిస్తోంది.

నెత్తిపై బానెట్, కాన్వొకేషన్ ఆహార్యం, మెడలో వ్రేలాడ్తున్న స్వర్ణ పతకం.. చేతిలో సర్టిఫికేట్ చుట్ట.. చుట్టూ కెమెరాల ఫ్లాష్ మెరుపులతో విలసిల్లుతున్న పత్రికల, మీడియా బృందాలు.

ఉద్విగ్నంగా వెలిగిపోతున్న పరిసరాలను స్వప్నసాకారమైన ఆ శుభవేళ పరికిస్తున్న పార్వతి.. తొలకరి చినుకుల్లో తడుస్తున్న పుడమిలా ఉంది.

2

ఈ మనుషులనూ, ఈ ప్రపంచాన్నీ, నానాటికీ నీతిహీనమూ, రీతిహీనమూ ఔతూ సకల విలువలకూ తిలోదకాలిస్తూ జీవితమంటే డబ్బు.. డబ్బు.. డబ్బే అని ఎవనికివాడు నిర్వచించుకుని ఒకన్నొకడు అనైతికంగా దోచుకుంటున్న వర్తమాన సందర్భంలో అన్ని రంగాల్లో సామాజిక వ్యవస్థలన్నీ ధ్వంసమైపోతున్న వేళ వీటిగురించి ఎంత లోతుగా, ఎంత విపులంగా, ఎంత మైక్రోస్కోపిక్‌గా తెలుసుకుంటున్నకొద్దీ అదే స్థాయిలో చాలా చాలా దుఃఖం కలుగుతూంటుంది. హృదయం పగిలిపోతూంటుంది. పగిలిన హృదయంతో స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే తరిమెల నాగిరెడ్డి రాసిన 'ఇండియా మార్టిగేజ్డ్- తాకట్టులో భారతదేశం' పుస్తకాన్ని పరిశీలనగా చదివి పార్వతి ఖిన్నురాలైంది. లగాయితు, సర్వసత్తాక, సోషియలిస్టిక్ మరియు సెక్యులర్ స్వభావమే ప్రాణంగా రూపొందించబడ్డ భారత రాజ్యాంగం వివిధ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇప్పటివరకు 127 సార్లు సవరించబడి దాని మూల స్వభావాన్నే కోల్పోయింది. మొట్టమొదటి భారతప్రధాన మంత్రి నెహ్రూ మంత్రివర్గంలో పనిచేసిన వి కె కృష్ణమీనన్ చేత జరిగిన సైన్యంకోసం జరిపిన 80లక్షల విలువైన జీప్‌ల కొనుగోలు కుంభకోణంతో మొదలై ఇప్పుడు బిలియన్ల రూపాయల విలువైన అదానీ కుంభకోణంతో భారతదేశంలో అవినీతి, లంచగొండితనం ఒక వికృత నిత్యకృత్యమైపోయింది.



**పార్వతి మౌనంగా కళ్ళు మూసుకుని వెనక్కి వాలుకుర్చీలో ఒరిగింది. ఆ క్షోభకు కారణం.. మెల్లమెల్లగా ఆమె ఈ దేశపు లోతుపాతులను అధ్యయనం చేస్తూ చేస్తూ అసలు సత్యాలను 'తెలుసు కోవడం'. ఆ పరమసత్యాలు అతి కఠోరంగా, కటిక చేదుగా ఉండడమే. మనిషికి అనేక సత్యాలు తెలువడం ఒకరకంగా వేదనకు కారకమే.**

పార్వతి మౌనంగా కళ్ళు మూసుకుని వెనక్కి వాలుకుర్చీలో ఒరిగింది. ఆ క్షోభకు కారణం.. మెల్లమెల్లగా ఆమె ఈ దేశపు లోతుపాతులను అధ్యయనం చేస్తూ చేస్తూ అసలు సత్యాలను 'తెలుసుకోవడం'. ఆ పరమసత్యాలు అతి కఠోరంగా, కటిక చేదుగా ఉండడమే. మనిషికి అనేక సత్యాలు తెలువడం ఒకరకంగా వేదనకు కారకమే.

అసలు నెహ్రూ ప్రధాని కావడమే ఒక పెద్ద అవినీతి. 'పైరవీలతో ఎవరైనా ఏదైనా చేయవచ్చు ఈ దేశంలో' అని నెహ్రూ ఘటన ఋజువుచేస్తోంది.

పూర్వ భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ సహపాఠి, ది స్టేట్స్‌మన్, ద టైంస్ ఆఫ్ ఇండియా, హిందుస్తాన్ టైంస్ వంటి ప్రసిద్ధ పత్రికల్లో అత్యున్నత పదవులు నిర్వహించిన ప్రపంచ స్థాయి పాత్రికేయుడు దుర్గాదాస్ రాసిన ప్రసిద్ధ గ్రంథం 'ఇండియా ఫ్రం కర్జన్ టు నెహ్రూ అండ్ ఆఫ్టర్ (1969)'లో చాలా స్పష్టంగా రాశాడు. 1946 ఎప్రిల్, 29 న జరిగిన భారతదేశ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుని ఎన్నిక అత్యంత కీలకమైనది.. ఎందుకంటే ఎవరైతే కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడుతారో అతన్నే బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రథమ ప్రధాన మంత్రిగా నియమిస్తుందని స్పష్టపర్చింది. ఇక్కడ ఆశ్రిత పక్షపాతం, శక్తివంతమైన వాని మాట ఎలా పనిచేస్తుందో ఒక రాజకీయ పాఠమై ఒక దేశ భవిష్యత్తునే మార్చేసింది. వర్కింగ్ కమిటీ సభ్యులందరూ సమావేశమైన ఆ సభలో ఓటు హక్కు ఉన్న ప్రాంతీయ కమిటీ సభ్యులు మొత్తం పదిహేను మంది ఉంటే

క
థ

పన్నెండు మంది సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు అనుకూలంగా ఓటు వేస్తే ఇద్దరు జె. బి కృపలానికి, ఒక్కరు పట్టాభి సీతారామయ్యకు వేశారు. నెహ్రూకు ఒక్క ఓటు కూడా రాలేదు. అలిగి, కృద్ధుడైన నెహ్రూ సభనుండి వాకౌట్ చేస్తే.. నెహ్రూ పక్షపాతియైన గాంధీజీ తన మాటను జవదాటని పటేల్తో 'యంగ్ అండ్ మాడర్న్ ఇండియా నిర్మాణానికి పటేల్ మీరు కొంత త్యాగం చేయాలె.. నెహ్రూ మన ప్రభుత్వంలో రెండవ వ్యక్తిగా ఉండడానికి అంగీకరించేలా లేడు. మీరు వినకుంటే నేను 'ఫాస్టింగ్ అంటు డెత్' మాస్ మూవ్‌మెంట్ చేయవలసి ఉంటుంది.' అని దాదాపు బ్లాక్‌మెయిల్ చేస్తే అప్పుడు సరే అని తలూపి నిశ్శబ్దంగా పటేల్ అక్కడినుండి నిష్క్రమించాడు. అప్పుడు పటేల్ వయసు 71. నెహ్రూ వయసు 56. పటేల్ హోం మంత్రిగా ఇండియాలోని 565 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి సాధించిన సుస్థిరత, నెహ్రూ కథ నడిపిన లోపభూయిష్ట తీరుతో ఇప్పటికీ పాకిస్తాన్, కశ్మీర్ సమస్య గుండెలపై పుండులా మిగిలిపోవడం.. ఒక వాస్తవ చేదు అనుభవంగా మిగిలి ఉండడం మనకు తెలుసు.

3

మన దేశంలో ఇప్పుడు 4 కోట్లమంది నిరుద్యోగులున్నారు. 23 కోట్లమంది ఇంకా పేదరికంలో మగ్గుతున్నారు. ఈ దేశసంపదలో 23 శాతం సంపద ఒక్క శాతం భారతీయ వ్యక్తుల చేతుల్లోనే ఉంది. ఐనా మనం ఇప్పుడు ప్రపంచంలో 5 వ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నాం. అసలు ఈ ఆర్థిక శక్తిని గానీ.. ఇతరేతర శక్తులనుగానీ మనం చూస్తున్న కోణం, విధానం సరియైందేనా.. శాస్త్రీయ మైందేనా.. అని పరిశీలించినపుడు.. 'తలసరి ఆదాయాన్ని ఎట్లా లెక్కించాలె'. అన్న మీమాంస ఎదురౌతుంది. నిజానికి ఇద్దరు వ్యక్తుల తలసరి ఆదాయం అన్నపుడు ఒక ఆటో నడిపేవాని ఆ రోజు ఆదాయం ప్లస్ ముఖేష్ అంబానీ దినసరి ఆదాయం బై టు అని లెక్కకట్టాలె. కాని

**1909 సెప్టెంబర్ 15న శ్రీకాకుళం జిల్లా టెక్కలి దగ్గరి ఇజ్జువరంలో జన్మించి.. మనిషి పుట్టుక ఒక 'ఆక్సిడెంట్' అని చెప్పినవాడు రోణంకి. కొందరికి జన్మతః జ్ఞానదాహం ఉంటుంది. అందువల్ల బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎం.ఎ ఆంగ్లం చేసి విజయనగరం వచ్చి 30 ఏళ్ళు ఉద్యోగించి ఇంగ్లిష్ హెడ్‌గా రిటైరయ్యారు. తర్వాత ఎ.యు.లో ఎమిరిటస్ ప్రొఫెసర్. ఇటాలియన్, ఫ్రెంచ్ తో సహా ఆరేడు భాషలు వచ్చు ఆయనకు.**

లెక్కలు అట్లా కట్టరు. అప్పుడు కనిపించని ఆకలి, అర్థాకలి అన్న రెండు పదాలను ఈ దేశంలో పరిగణించాలె. ఇది ఒక గమ్మత్తైన గణనవిధానం. మన నీతి అయోగ్ పద్ధతి ప్రకారం మనది ఫాస్టెస్ట్ గ్రోయింగ్ ఎకానమీ.. ఇప్పుడు అది 6.6%. కాని వరల్డ్ హంగర్ ఇండెక్స్‌లో భారత దేశం121 లో 107వ ర్యాంక్‌లో ఉన్నా గ్రోత్ రేట్ లో మాత్రం 6.6% ఉంది. ఎట్లా ఇది. ఒక విద్యార్థి ఈ నెల 10 మార్కులు తెచ్చుకుని ఆ తర్వాత నెల 20 మార్కులు తెచ్చుకుంటే వాని గ్రోత్ రేట్ వంద శాతం. అదే మరో అమ్మాయి ఈ నెల 90 మార్కులు తెచ్చుకుని ఆ తర్వాతి నెల 95 మార్కులు తెచ్చుకుంటే ఆమె గ్రోత్ రేట్ 5.555% ఔతుంది. ఇక్కడ బేస్ విలువలను బట్టి గ్రోత్ రేట్ మారుతుంది. జనాభా, తలసరి ఆదాయం..ను తీసుకున్నప్పుడు.. యూనిట్ సైజ్ దేశం జనాభా, పౌరుని తలసరి ఆదాయం.. వంటి కీలకాంశాలు ప్రభావవంతమౌతాయి. ఇదంతా.. జ్ఞానాన్ని వృద్ధిపర్చుకుంటూ.. ఇసుకలోకి ఉష్ట్రపక్షి యాత్రిస్తున్నప్పటి తతంగం.

జీవితమంటే మనిషి విస్తృతం కావడమేనా.

4

మనిషి జీవించడం.. నువ్వు నీవలెనే జీవించడం.. నీకు నచ్చినట్టు జీవించడం.. నీకు నచ్చినట్టు జీవించగలగడం. ఇవన్నీ ఒకటే కాదు.

ఈ అన్నింటిలోకి నువ్వు నీకు నచ్చినట్టు జీవించగల్గడం.. అన్నింటికన్నా కష్టం.

ఏండ్లు.. ఏండ్లు.. గడుస్తూ.. 'అసలు ఈ జీవితం ఏమిటి' అని అడుగు దామనుకుంటూంటే.. ఎవరూ దొరకని ఒక శూన్య క్షణాన పార్వతి.. తన కూరగాయల మడిలో.. ఏపుగా ఎదిగిన వేపచెట్టు బోదెలో.. ఒక జంపుఖానను పరుచుకుని.. ఒత్తిగిల్లి.. భుజానికున్న సంచీలోనుండి ఒక పుస్తకాన్ని తీసి తెరిచి.. అందులోకి అంతర్థానమయ్యింది. ఏదైనా పనిలో లీనమౌతున్నప్పుడు మనిషి తనకు తెలియకుండానే తాను మాయమైపోతాడు.

ఆ క్షణాన.,

మహానుభావుడు ఆచార్య రోణంకి అప్పలస్వామి గారితో ఇంటర్వ్యూ కనబడింది 'నేను బతికిన క్షణాలు' పేరుతో.. ఆయనతో ఆత్మను విప్పి ఆకాశమై మాట్లాడగలిగిన ఆ అదృష్టవంతుడు - తాడి ప్రకాష్, విలేఖరి.

1909 సెప్టెంబర్ 15న శ్రీకాకుళం జిల్లా టెక్కలి దగ్గరి ఇజ్జువరంలో జన్మించి.. మనిషి పుట్టుక ఒక 'ఆక్సిడెంట్' అని చెప్పినవాడు రోణంకి. కొందరికి జన్మతః జ్ఞానదాహం ఉంటుంది. అందువల్ల బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎం.ఎ ఆంగ్లం చేసి విజయనగరం వచ్చి 30 ఏళ్ళు ఉద్యోగించి ఇంగ్లిష్ హెడ్‌గా రిటైరయ్యారు. తర్వాత ఎ.యు.లో ఎమిరిటస్ ప్రొఫెసర్. ఇటాలియన్, ఫ్రెంచ్ తో సహా ఆరేడు భాషలు వచ్చు ఆయనకు. 'జీవితమంతా కూడా పరభాషలను నేర్చుకోవడాన్ని ఒక మహా అనుభవంగా ఆనందించి అంతరిస్తాను' .. భాష.. అంటే ఒక హృదయం. అన్నింటికన్నా నిశ్శబ్దం అతి శక్తివంతమైన భాష.. అని ఎక్కడో రాశాడు.

దిగంబరులు రాసింది కవిత్వం కాదన్నారు మీరొకసారి. ఎందుకు కాదు?

మార్క్సిజం తెలిసినవాళ్ళకు

బోధపడ్తుందది. పల్లె జనంకి అర్థం కాదు. శ్రీశ్రీ రాసింది అందరికి బోధపడ్తుంది.

విప్లవ రచయితలతో మీకేమన్నా అభిప్రాయభేదాలున్నాయా?

అలాంటిదేమీ లేదు. విప్లవ కవిత్వం బాగా రాసినవాడు శ్రీశ్రీ. తర్వాత వచ్చిన విప్లవ కవులకు ఎలా రాయాలో తెలియదు.

ఆరుద్ర ఎలాంటి కవి? ఆంగ్ల కవి ఆడెన్‌తో ఆయన్ని పోల్చవచ్చా.

ఆడెన్ కాదు ఓడెన్ అనాలి. ఆరుద్ర, శ్రీశ్రీ అన్ని రకాల కవిత్వాన్నీ రాశారు. ఇద్దరూ ఇష్టమే.

బైరాగి?

తొలిరోజుల్లో కవిత్వం రాసినవాడు అతనే అని నేనంటాను. భావ కవిని కాను అహంభావ కవిని అని రాసింది అతనే.

పఠాభి, నారాయణబాబు, వేగుంట మోహనప్రసాద్, గురించి అడిగితే..

మోహనప్రసాద్.. ఏంటో ఆయన కవిత్వం.. నాకు బోధపడదు. వ్యక్తిగా నైదర్ ఫిష్ నార్ ఫ్లెష్.. నార్ గుడ్ రెడ్ హెర్రింగ్.

గుంటూరు శేషేంద్ర శర్మని 'యుగకవి' అనవచ్చా.

నాక్కొన్ని పుస్తకాలు పంపించాడు. చదివాను. బోధపడలేదు. లిక్కర్ బాటిల్స్ పంపిస్తే పొగుడుతూ రాయడానికి నేను శ్రీశ్రీని కాను. మధ్యలో మనం చెంచాలం కాదు అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ అంటే.. మనం చెంచాలం కాదు. చెంచాలతో సముద్రాన్ని కొలువగలమా.. అన్నాడు పురాణం.

తెలుగులో ఇప్పుడు వస్తున్న కవిత్వం గురించి మీ అభిప్రాయం?

నేను చూచిన మట్టుకు నాకేమీ నచ్చడం లేదు. ఏదో రాస్తే అది కవిత్వం కాదు. వాళ్ళు రాస్తున్న దాంట్లో కవిత్వం లేదు.

శ్రీశ్రీ తర్వాత ఎవరు?

శ్రీశ్రీ తర్వాత ఎవరూ కనిపించడం లేదు.

మీ పెద్ద లైబ్రరీని ఏం చేస్తారు?

నా దగ్గరే ఉంటుంది. ఎవరికీ ఇవ్వను. నా తదనంతరం నేను ఉన్నపుడూ లేనపుడూ ఎవరైనా చదువుకోవచ్చు. వెళ్ళేప్పుడు ఆ పుస్తకం ఎక్కడుందో అక్కడే పెట్టాలి.

అంతగా చదవడం వ్యసనం కాదా?

వ్యసనమే.

నక్సలైట్ల గురించి..?

నక్సలైట్లు చేస్తున్న పనులు ఏవీ లాభకరంగా లేవు. అవి వారికీ లాభకరం కావు.

తర్వాత పక్కపై ఒరిగి విశ్రమించారు విశ్వకవితా నీలాకాశాన్ని నేలమీద పరిచినట్టుగా.

కొందరు మనుషులు మాత్రమే వాళ్ళకు నచ్చిన జీవితాన్ని అస్సలే రాజీపడకుండా జీవించగలుగుతారు. జీవించడం ఒక గొప్ప కళ.



# రంగుల కేళి



జ్యోత్స్న ప్రభ, 94918 77359

ఒక వేకువ ఉదా రంగు కిరణమై
హృదయంలో నాదం మోగిస్తుంది
ఒక నీలిమ అనంత ఆకాశమై
మనసులో ప్రశాంత భావాన్ని మీటుతుంది
ఒక గాఢ నీలం విశాల సంద్రమై
వేయి కెరటాలుగా సంచలిస్తుంది
ఆకుపచ్చదనం అవనిపై పరిచిన వృక్షజాలమై
ఆహ్లాదాన్ని పెంచుతుంది
ఒక పసిమివర్ణం తీయని ఆమ్రమై
మాధుర్యం పంచుతుంది
ఒక నారింజ రంగు సాయం సంధ్యా కిరణమై
వేయి రాగాలు దిద్దుతుంది.
ఒక రక్త వర్ణం అనురాగమై
అంత రంగాలను స్పృశిస్తుంది
ప్రపంచమంతా సప్త వర్ణమయం
ఇది హెూలీ ఇది వసంతోత్సవం.
ఇది ఆమని పలకరింత.
ఒక్కో వర్ణం జీవితాన్ని రంగులమయం చేస్తుంది
విషాద ని శీధాలను వదలి వేస్తూ ఉల్లాస ఉదయాలకు ఊపిరి పోస్తూ
ప్రతి ఏటా ఉత్సాహం పంచుతుంది హెూలీ బ్రతుకులు రాగరంజితం
చేసుకోమంటుంది ఈ రంగుల కేళి.



కవిత

# ఓటు...



గడ్డం లక్ష్మయ్య, 98486 93280

ఉత్పలమాల:
ఓటు వివేకికందకనయోగ్యుడు రాజ్యమునేలుచుండు, సా
ౖమాట్టగు, వంశజుల్ కుటిలరాక్షసులైచరియించు, మాటలన్
కోటలుగట్టు వింతయగుఘోరవికారమృగస్వభావ క
ర్కోటకుడౌ సమాజవిరోధుడుగానుచరించ ధర్మముల్
బీటలువారు సజ్జనులుభీతియెదుర్కొను రాజ్యమంతటన్!

మత్తకోకిల:
ఓటు వేయనిచో మనుష్యుఁడు నొంటరౌభరతావనిన్
చేటుకాలమువచ్చు మూర్ఖవిజేతయైసభలందు వా
గ్ధాటిగా పరుషంబులాడుచు గౌరవించకవిజ్ఞులన్
కోటరించధమాధమున్డిల ఘోరధుర్మతియౌనుగా!

శార్దూళం:
ధీరా! భారతదేశమందు విలువౌధీటైనదీఓటు నీ
వారాదించెడురాజకీయవిలువల్నభ్యున్నతిజ్జెందగన్
చారిత్రాత్మకమైలిఖించుభవితన్ చైతన్యమౌప్రాంతముల్
కరుల్ రాజ్యనియంతలన్దరుము సత్ కృత్యంబిదేమిత్రమా!

సీసము:
రాచరికమ్మును పీఁచమడఁగజేసి
దెసలెల్లమిసిమినితెచ్చెనోటు!
సంస్థానధీశులా సంస్కృతినోడించి
జవమునునింపెనాశక్తియోటు!
గర్వాంధులైనట్టి ఘనమృగేంద్రులనంపి
సర్వజనప్రియైసాగెనోటు!
భాస్వరంబగుచు ప్రజాస్వామ్యమునుపెంచి
దీధితియైనట్టిదివ్వెయోటు!

తేగీ: సమసమాజమున్ స్థాపించుసుమతిగాను
శాంతిభావసమానత్వచరితనిచ్చి
కుటిలధుర్నాగకేళినిన్గూలజేసిజి
ఓటుదివ్యాస్త్రమైవెల్గెనొజ్జలార!

తేగీ:
ఓటువేయగపదవిలోనోలలాడి
పేదసాదలన్ మరచిపెంపెక్కు గర్వ
మతిగవిలసిల్లుమనుజుఁడుమాన్యుడెట్లు?
మానితంబదికాదదమానుషంబు!

కందము:
నైతికవర్తనగల్గిన
నేతనుపదవులువరించ నేరుపుతోడన్
ఖ్యాతిగసంక్షేమంబును
భూతలమునవృద్ధిజేయ భూషించుజనుల్!



కవిత

# ఒక్కసారి నదితో మాట్లాడు



**కె.ఎస్. అనంతాచార్య, 9441195765**

మట్టి పుట్ట చెట్టు చేమ
గుట్టతో కరచాలనం
చేయడం చెబుతుంది!

గుండెకు తడి అద్దుతుంది
పచ్చి పచ్చిగా నిక్కచ్చి గా
నిటారుగా చెట్టు లాగా
నిలబడుమని వృక్ష సూక్తం వినిపిస్తుంది!

ఒక్క తన పరిష్వంగం
భూమికి పులకరింత
సాలంతా కొలుచుకొనెంత
ఫలితం
అదే తన సందేశం!

తన దగ్గరకి వెళ్ళితేనే
నాన్న తో మాట్లాడినట్టు
పని పాటను మూట కట్టి
పయనం నేర్పిస్తుంది!

అమ్మ చనుబాల లాంటి
తీపి నీటిని ఇచ్చి
సేద తీర్చి
ఉద్వేగాన్ని ఉట్టికెక్కిస్తుంది!

చర్చిస్తావా లవణ
రసాయన శాస్త్రవేత్త
అంతు చిక్కక సీదా సాదాగా
ప్రవహించే విజ్ఞాన ఖని!

లోనికి చూస్తావా
భగీరథుడు వున్నాడు
నీ ప్రయత్నానికి
వీర తిలకం దిద్దుతాడు!

రాముని దాటించిన
గుహుని ఆనవాళ్ల నీటి చారికలు...
వాత్సల్య శిలాజాలు
లో లోతుల నిండా పరచుకున్నాయి!

అది రాతిని కోస్తూ
వినిపించే బుడగలు శబ్దం
శాస్త్రీయ సంగీతంలో
తొలి ఆలాపన!

నీటి పూలు చల్లుకోండి
దేహం మీద దయా మొలకలు మొలుస్తాయి
నది గుండె మీద చెవి
పెట్టండి
తాతల జీవన రాగాలు వినపడుతాయి!

దానిమీద ఒక్క ప్రయాణం చేయి
వేయి పుటల భావాలు
జలదిగ్బంధనం చేస్తాయి!

ఒక్కసారి నదితో
మాట్లాడు
మదిలో తెల్లని నురగలు
మేట వేస్తాయి
పచ్చటి పద్యాలను
స్రవిస్తాయి!

# ఆలోచింపజేసేదే నిజమైన సృజన...


- డా॥ టి. శ్రీరంగ స్వామి

స్ఫూర్తివంతమైన శ్రీరంగస్వామి జీవితావిష్కరణ...

వరంగల్లు ప్రాంతంలో సాహిత్య పరిమళాలు వెదజల్లుతున్న సుప్రసిద్ధ సాహితీ సంస్థ శ్రీలేఖ సాహితీ. సుమారు 150 కి పైగా గ్రంథాలను ప్రచురించి ఎందరో వర్తమాన రచయితలకు చేయూతనిచ్చిన సంస్థ అది. ఈ సంస్థను స్థాపించిన వారు డాక్టర్ టి. శ్రీరంగస్వామి. కవిగా విమర్శకుడిగా పరిశోధకుడిగా తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేస్తూనే శ్రీలేఖ సాహితిని నాలుగు దశాబ్దాలకు పైగా దిగ్విజయంగా నిర్వహిస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో శ్రీరంగ స్వామితో తంగేడు ఈ మాసం మాట ముచ్చట..

**మీ బాల్యం విద్యాభ్యాసం గురించి చెప్పండి.**

నా బాల్యం మా బాపు సంగెం మండలం తిమ్మాపురంలో ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు నాలుగవ తరగతి వరకు అక్కడే జరిగింది. మా నాన్నగారే నాకు తొలి గురువు. ఆ తదుపరి1958లో ఐదవ తరగతి సంగెంలో చదువుకున్నాను. అప్పట్లో అది తాలూకా కేంద్రం. సంగెం హైస్కూల్లో మా మేనమామ జనార్ధన స్వామి గారు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. నేను చదువుకునే రోజుల్లోనే ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు మా హైస్కూల్ వార్షికోత్సవానికి



ముఖ్యఅతిథిగా వచ్చారు. మాకు 5వ తరగతిలో అశ్వద్ధామ అనే నాటకం పాఠంగా ఉండేది. దానిని నేను మా స్నేహితులం సంజీవయ్య గారి ముందు ప్రదర్శించాం. తదనంతరం ఆరవ తరగతి హనుమకొండలో మా దూరపు బంధువు తిరునగరి వరవర స్వామి గారి ఇంట్లో ఉండి చదువుకున్నాను. వరవర స్వామి గారు గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ లష్కర్ బజార్ హై స్కూల్ లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు అక్కడే హెచ్ ఎస్ సి పూర్తి చేశాను. పియుసి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బీకాం డిగ్రీ చందాకాంతయ్య స్మారక డిగ్రీ కళాశాలలో చదివాను. ఉద్యోగంలో చేరాక 1984లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు ఎక్స్టర్నల్ ఉత్తీర్ణత సాధించాను. కోవెల సంపత్ కుమారాచార్యులు గారి పర్యవేక్షణలో పీహెచ్డీ పూర్తి చేశాను 1993లో డాక్టరేట్ పట్టా అందుకున్నాను.

**మీ ఉద్యోగ ప్రస్థానాన్ని వివరించండి?**

బీకాం అయినాక 1974 ఏప్రిల్ లో హైదరాబాదు నందు శారద ఇంజనీరింగ్ కంపెనీలో స్టోర్స్ మేనేజర్ గా చేరి 1977 ఫిబ్రవరి వరకు పని చేశాను. 1977లో మామునూరులో ఏర్పాటు చేసిన సెవెంత్ బెటాలియన్ ఏపీఎస్పీలో ఎల్.డి.సి గా చేరాను. అనంతరం అది డిచ్‌పల్లికి షిఫ్ట్ అయినప్పుడు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ లోకి మారాను. 2008లో యూడీసీగా ఉద్యోగ విరమణ చేశాను.

**సాహిత్య పరంగా మీపై ఎవరి ప్రభావం ఉన్నది?**

స్వయంగా నన్ను ప్రభావం చేసింది పుస్తకాలు మాత్రమే. తిలక్ అమృతం కురిసిన రాత్రి, అడవి బాపిరాజు సాహిత్య ప్రభావం నాపై ఉంది. హై స్కూల్ నుండి పుస్తకాలు చదవడం అలవాటయింది. డిగ్రీ అనంతరం సాహిత్యం అధ్యయనం చేస్తున్నప్పుడు జీవీ సుబ్రహ్మణ్యం దేవులపల్లి రామానుజ రావుతో ప్రభావితుడనైనాను. పరిశోధన (పిహెచ్‌డి) సమయంలో విమర్శ అంటే ఎలా ఉండాలి? ఎలా అధ్యయనం చేయాలి? అనేది కోవెల సంపత్ కుమారాచార్యుల

దగ్గర గ్రహించాను. సంస్థ నడపడానికి మెళకువలను కైలాసం, దేవులపల్లి రామానుజ రావు గార్ల సూచనలు ఇప్పటికీ ఉత్తేజితుడిని చేస్తూనే ఉన్నాయి. పురాణం సుబ్రహ్మణ్య శర్మ కొట్టివేత లేకుండా రాసేవారు. మనం అనుకున్న పదం కన్నా వేరే పదం పడితే ఆ పదానికి సరి అయినది జోడించి రాయడమేనన్న మాటలను నేను కూడా అనుకరించాను. అందువల్ల కొంత సాహిత్య జ్ఞానం పెరిగింది. స్వయంకృషితో సాహిత్య అధ్యయనంతోనే సాధించుకున్నానని చెప్పాలి. ఇది గర్వం అనుకున్నా పరవాలేదు. నేను అధ్యాపక వృత్తిలో లేని వాడినని కొంత చిన్నచూపు చూసినా తదుపరి కాలంలో నా సాహిత్యమే నన్ను నిలబెట్టింది. నాపై నాకున్న నమ్మకమే నన్ను నిలబెట్టింది. మిత్రులందరి నుండి ఎంతోకొంత నేర్చుకున్నాను. ఇతరులకు అండగా ఉండడమే నన్ను నిలబెట్టిందని అనుకుంటున్నాను.



**నవల / కథ / వ్యాసం మొదలైన సాహిత్య ప్రక్రియలో మీకు ఇష్టమైన ప్రక్రియ ఏది ఎందుచేత దానిలో మీరు చేసిన కృషి ఏమిటి?**

నేను కవిత, కథ ప్రక్రియలో రాసినా నాకు ఇష్టమైన ప్రక్రియ వ్యాసం. వ్యాసం రాయడం అంటే కేవలం అంశాన్ని వ్యక్తీకరించడమే కాకుండా ఆ అంశం నేపథ్యం ఆనుపాసులు కూలంకషంగా విప్పి చెప్పే ప్రయత్నం చేశాను. మన వ్యాసం ద్వారా సమాజానికి మనం కొంత సమాచారం ఇవ్వడంతో పాటు ఏదైనా చెప్పాలనేది నా ఆలోచన. నేను ఇంతవరకు 13 వ్యాస సంపుటాలు వెలువరించాను. మరో 10 సంపుటాలకు సరిపడే వ్యాసాలు ఉన్నాయి.

**విమర్శ అనే సాహిత్య ప్రక్రియ పై మీ అభిప్రాయం ఏమిటి? ప్రస్తుతం తెలుగులో విమర్శకుల లోటు ఉంది. నా అభిప్రాయంతో మీరేకీభవిస్తారా? ఈ ప్రక్రియలో మీ కృషిని గురించి తెలుపండి.**

విమర్శ సాహిత్య ప్రక్రియను నిశ్చలమనస్సుతో పరిశోధనాత్మకతతోను, సద్వివేచన తోనూ చేస్తే మంచి వ్యాసం వస్తుంది. ఇవాళ వచ్చే విమర్శ ప్రయోజనాన్ని ఆశించి తాము రాసిందే వేదం అనే ధోరణితో వస్తుందనవచ్చు. విమర్శలో ఎంతగా ఉదహరిస్తే అంత గొప్పదనే ధోరణి ప్రబలుతున్నది. అంతేకాదు పై పైన స్పృశించి విమర్శ అంటున్నారు. అలాకాకుండా పూర్తిగా కరతలామలకం చేసుకుని లోలోతులకు వెళ్లి పరామర్శించాలి. మనకు విమర్శకులు ఉన్నారు కానీ వారు సరిగా కృషి చేయడం లేదనిపిస్తున్నది. పాశాత్య గ్రంథాలు ఇతర గ్రంథాలలోని అంశాలను ఉదాహరించడంతోనే సరి పెట్టుకోవడం ఒకటి అయితే ఆయా గ్రంథాలను మేము అధ్యయనం చేశామని చాటుకోవడమే గాని అసలు అంశంపై సరియైన దృష్టిని సారించడం లేదనిపిస్తుంది. ఇతర సాహితీవేత్తల వాక్యాలను పేరాలకు పేరాలు ఎత్తి పెట్టడం వల్ల పాఠకుడికి మొహం మొత్తడంతోపాటు తికమక పరుస్తున్నది. ఇరువెంటి కృష్ణమూర్తి సంపత్ కుమార, జీవి సుబ్రహ్మణ్యం గార్ల విమర్శ సాహిత్యం చదివినప్పుడు మనకు విషయం స్పష్టమవుతుంది. నా వరకు



ముఖాముఖి

నేను వారి మార్గాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తున్నాను.

**మీరు సాహిత్యం వైపు దృష్టి సారించే సమయానికి వరంగల్ సాహిత్య రంగం ఎలా ఉండేది?**

నేను సాహిత్యం వైపు వచ్చేసరికి విప్లవ కవిత్వం చేతనావర్త కవిత్వం ప్రభావంతో పాటు మినీ కవితా ఉద్యమం కూడా ఉచ్ఛదశలో ఉన్నది. కవిత్వం రాస్తున్నప్పటికీ పత్రికలకు పంపడంలో వెనుకకే ఉన్నాను. చదివిన పుస్తకాలపై మిత్ర బృందంతో కూలంకషంగా చర్చించుకోవడం జరిగేవి. 1974 లోనే నా సాహిత్య వ్యాసం ప్రచురణ జరిగింది. మినీ కవితా ఉద్యమంలో భాగంగా విజయవాడ, అమలాపురం, కాకినాడ, మచిలీపట్నం, హైదరాబాదులు తిరిగాము. 1979లో ఏ. సురేంద్ర కుమార్ స్థాపించిన చైతన్య సాహితి మూడు సంవత్సరాలు దిగ్విజయంగా కార్యక్రమాలు జరిగినవి. ఆ సంస్థకు నేను సహాయ కార్యదర్శిని. అప్పుడే నా కార్యకారత్వంలో 1980లో పాత కొత్తల మేలు కలయికతో చైతన్య కవితా సంకలనం వచ్చింది. అప్పటి వరకు కొత్త తరాన్ని పట్టించుకున్న వారు లేరు. నేనెప్పుడైతే కొత్తవారికి అవకాశం ఇచ్చానో కొంత చలనం వచ్చింది. నా నేతృత్వంలో యువ రచయితల మహాసభలను ఏర్పాటు చేసి కొత్త వారందరికీ అవకాశం ఇవ్వడం వల్ల గుర్తింపు ప్రారంభమైంది. వారికి కూడా నేనున్నానని నమ్మకం ఏర్పడింది.

**తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో సాహిత్యకారుడిగా మీ పాత్ర ఏమిటి**

తెలంగాణ తొలి దశ ఉద్యమ సమయంలో ఆర్ట్స్ కాలేజీలో పియుసి చదువుతున్న కాలమది. హనుమకొండ చౌరస్తాలో ధర్నాలు, బహిష్కరణలు చేశాం. అప్పుడు కవిత్వం రాయలేదనే చెప్పాలి. మలిదశలో మాత్రం ఉద్యమంలో పాల్గొంటూనే కవిత్వం రాశాను. 2006లో సాహిత్య స్వరూపాలు ఎలా ఉన్నాయో చాటి చెప్పేందుకు ఒక



**రెండింటికీ భిన్నంగా రాసిన మరో కవితా సంపుటి 'చూస్తుండగానే...'. ఆధునిక జీవితం లోని సంఘర్షణ, మానవ సంబంధాలు, రేపటి మనిషి, రాజు తీర్పు లాంటి అధిక్షేప కవిత్వాలు ఇందులో వున్నాయి. అనగా అనగా... అన్న కవిత ఎందరినో ఆకర్షించింది. సత్యమూర్తి ప్రత్యేకంగా ఆ కవిత మీద ఉత్తరం రాశాడు.**

సదస్సును ఏర్పాటు చేయడమే కాక ఆ సదస్సులో వచ్చిన వ్యాసాలకు పుస్తక రూపం ఇవ్వగలిగాను. కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు దీక్షలు నిర్వహించినప్పుడు నాతో పాటు మిత్రులతో వారికి భోజనాలు ఏర్పాటు చేశాం. ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమంలో పాల్గొన్నాం.

**తెలుగు రాష్ట్రాల్లో శ్రీరంగ స్వామి అనగానే గుర్తుకు వచ్చేది శ్రీలేఖ సాహితి. ఏ పరిస్థితుల్లో మీరు ఈ సాహిత్య సంస్థను స్థాపించారు?**

1977 సంవత్సరంలో శ్రీలేఖ సాహితిని స్థాపించడం జరిగింది. అప్పుడు వరంగల్ లో సాహిత్య సంస్థలు ఉన్నట్టుగాని, సాహిత్య సేవ చేస్తున్నట్టుగాని నాకు తెలియదు, నా దృష్టికి రాలేదు. 1969 నుండి యువభారతి సికింద్రాబాద్ వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు ఉన్నందువల్ల మాకు వారు అనుసరిస్తున్న పద్ధతిలో మనం కూడా వరంగల్ లో సాహితీ సంస్థను ప్రారంభిస్తే బాగుంటుందని ఆలోచన కలిగి 1977లో నేను రత్నాకర్ సముద్రాల ఓంకార్ లింగాల రాజయ్యలము కలిసి శ్రీలేఖ సాహితికి బీజం వేసాం. ఓంకార్ ప్రెస్లో రత్నాకర్ ఇంట్లో అప్పుడప్పుడు సమావేశం అయ్యే వారం. 1984 వరకు అడపాదడపా సమావేశాలు పుస్తకావిష్కరణలు ఏర్పాటు చేస్తున్నా ప్రచురణ వైపు దృష్టి సారించి శ్రీరామ శతకం వెలువరించగానే స్థానిక రచయితలు తమ పుస్తకాలకు శ్రీలేఖ సాహితి ఆధ్వర్యంలో ప్రచురించడానికి ముందుకు రావడం వలన ఒక కొత్త మార్గం ఏర్పడింది.

**శ్రీలేఖ సాహితీ సాహిత్య సంస్థ ద్వారా మీరు ప్రచురించిన పుస్తకాలు మరెయితర సంస్థ ప్రచురించినట్లు కనిపించదు. ఇది మీకు ఎట్లా సాధ్యమైంది?**

ప్రస్తుతం శ్రీలేఖ సాహితీ ప్రచురించినన్ని పుస్తకాలు మరో సంస్థ ప్రచురించకపోవచ్చు కానీ అలా అనుకోవడం కొంత అతిశయోక్తి గా అనిపిస్తుంది. సాహితీ సంస్థ ఒక సదాశయంతోను ఆర్థికాపేక్షను ఆశించకుండా పనిచేస్తే ఫలితాలు వస్తాయి. శ్రీలేఖ సాహితీ ప్రధానంగా యువతను కలం పట్టిన ప్రతి కవిని ప్రోత్సహిస్తూ వారి రచనలకు సాహిత్య సృజన శక్తికి ప్రోత్సాహం ఇచ్చి ఊతంగా నిలిచినందునే ఇన్ని పుస్తకాలు వెలుగు చూసినవి. చిన్న పెద్ద అనే తేడా లేకుండా పుస్తకం వేసుకుంటాను అన్న రచయితకు అండగా ఉండడం ప్రధాన కారణం అనుకుంటాను. శ్రీలేఖ సాహితీ సంకలనాలలో చోటుచేసుకున్న ప్రతి రచయిత శ్రీలేఖ సాహితీ తనదే అనుకోవడం కూడా కారణం. అంతేకాదు ప్రాంతం చిన్న పెద్ద తేడా పాటించకపోవడం కూడా ఒక కారణం. అందువలన సంకలనాలలో దేశంలోని విభిన్న ప్రాంతాల రచయితలు చోటు చేసుకున్నారు. శ్రీలేఖ సాహితీ ప్రచురణలలో గుంటూరు తెనాలి

ఒంగోలు అనంతపురం కర్నూలు ప్రాంతాల రచయితలు తమ పుస్తకాలను చేర్చారు అందుకే మేము స్నేహం నీడను ఇచ్చే చెట్టు లాంటిదని అంటాము.

**శ్రీలేఖ సాహితీ సంస్థ ద్వారా సాహిత్య రంగానికి మీరు చేసిన సేవ ఎలాంటిది?**

సాహితీ రంగానికి నేను చేసిన సేవ ఏమీ లేదనే చెప్పాలి. నాకంటే ముందున్న వారు చేసిన దాంట్లో నేను చేసింది పిసరంత. శ్రీలేఖ సాహితీ ప్రధానంగా ఉదయమాన కవులను దృష్టిలో పెట్టుకుని పనిచేసింది. యువ రచయితలకు అండగా ఉంటూ వారి ప్రతిభా వ్యుత్పత్తులను బహిర్గతం కావడానికి వారిచే ఉపన్యాసాలు ఇప్పించడం, రచనలు చేయించడం, వారి రచనలు ప్రచురణ రూపంలో పదిమందికి తెలిసేలా చేయడం ప్రధానంగా సాగింది. సంకలనాలలో ప్రతి రచయిత చిరునామా ఉండడం వల్ల చదివిన వారు నేరుగా స్పందించడం

కూడా ప్రధాన శక్తిగా నిలిచింది. అంతే కాకుండా భవిష్యత్తు తరానికి వరంగల్‌ను సాహిత్య చరిత్రను భద్రపరిచే నేపథ్యంతో వరంగల్లు రచయితల చరిత్రలను వెలువరించాం. వరంగల్లులో 500 మంది రచయితలు ఉన్నారని సమాజానికి తెలిపాం. శ్రీలేఖ సంకలనాల ద్వారా రాష్ట్ర నలుమూలలోని కవుల 1500 మంది కవితలను 220 కథలను 50 వ్యాసకర్తలను సాహిత్య రంగానికి పరిచయం చేసాం. ప్రముఖ సాహితీ వేత్తలతో పాటు ఇప్పుడిప్పుడే సాహిత్య వ్యాసాలు రాస్తున్న వారితో వివిధ అంశాలపై వ్యాసాలు రాయించి వ్యాస సంకలనాలు తెచ్చాము. వ్యాస ప్రపంచంలో కాలూనుతున్న వారికి ఎలా రాయాలో ఎలా విషయాన్ని వింగడించాలో చెప్పి వారితో రాయించుకున్నాం. భారత భాగవత రామాయణాల పైననే కాకుండా కృష్ణుడిపై 32 పార్శ్వాలను, అన్నమయ్య పై 16 విధాలుగా సాహిత్యంలో మధుర భక్తి అంశంతో తొలి వ్యాస సంకలనం, కోవెల సంపత్కుమార గారి రచనలపై అధ్యయనం చేసేందుకు ఒక వ్యాస సంకలనం ప్రచురించాం. ఈ సంకలనాలలోని యువ వ్యాసకర్తలు ఆయా విషయాలపై అధ్యయనం చేయడానికి అవకాశం కల్పించాము. ఈ వ్యాస సంకలనాలన్నీ ఇతర వ్యాసాల కంటే భిన్నమైనవి కూడా. అందువలననే సాహితీ రంగంలో శ్రీలేఖ సాహితీ ప్రచురణలకు ఒక గుర్తింపు. ఈ మనుగడమే శ్రీలేఖ సాహితీ అన్నా వరంగల్లు అన్నా శ్రీరంగస్వామి గుర్తుకు రావడం అది వారి సహృదయత.

**మీ రచనల గురించి తెలియజేయండి**


నేను కవిత్వం, పరిశోధన, వ్యాసం, కథా ప్రక్రియలలో రచనలు చేశాను. మధుర, శిఖరం, మానస సంచరరే....,నిరంతరం, సరయేవో నుండి ఏకశిలకు (బోస్నియా హెర్జగోవినా దేశములోని సరయేవో కవయిత్రి అజసా జహిరోవిచ్ కవితలకు అనుసృజన), నీలమోహనాష్టకము, సమజ్ఞ, డిశంబర్ 11 అనే కవిత్వ సంపుటాలు, వరంగల్లు జిల్లా రచయితల వాఙ్మయ సూచిక, కోవెల సుప్రసన్నాచార్యుల వాఙ్మయ, జీవిత సూచిక, దేవులపల్లి రామానుజరావు ఒక రేఖాచిత్రం, విశ్వనాథ వారి కృష్ణకావ్యాలు, వరంగల్లు కథా సర్వస్వం మొదలైన పరిశోధనా గ్రంథాలు, విపంచి, సాహితీ గవాక్షం, శ్రీవ్యాసం, సమూహ, మంచిమాట, విశ్వనాథ రామ కృష్ణ, పొనుక, విష్ణుపద, పలుకు జెలి, విహారి శ్రీపద చిత్ర రామాయణం కావ్యాలోకనము, వెలుగుల గుత్తి అనే వ్యాస సంకలనాలు,సజీవచిత్రాలు, షుగర్ లెస్ కాఫీ, కిస్టమ్మ పెద్దాయి మొదలైన కథా సంపుటాలు ఇత్యాది 25 కు పైగా గ్రంథాలు వెలువరించాను.

**నేటి సాహిత్య పరిణామాలపై మీ అభిప్రాయం ఏమిటి?**

సాహిత్య పరిణామం జరిగినప్పుడే చైతన్యంతో కూడిన సాహిత్యం రావడానికి అవకాశం ఉంటుంది. సృజనకు అవకాశం ఏర్పడుతుంది. అయితే మనసుకు చేతనత్వం లేకుండా యాంత్రికంగా పరిణామాలు సృజనాత్మకత కాదు. మనం సృజించే సాహిత్యం ఒకరినైనా ఆలోచింపజేయాలి. కొత్తదారులకు కవాటాలు తెరవాలి అన్నదే నా ఆలోచన.

**ఇప్పుడిప్పుడే సాహితీరంగంలో అడుగుపెడుతున్న వర్ధమాన రచయితలకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలూ...**

సాహిత్య రంగంలో అడుగు పెడుతున్న వారు తమ పద సంపదను పెంచుకోవాలి. ముందుగా పదాన్ని ఎక్కడ వాడాలో తెలుసుకోవాలి. ప్రస్తుతం చాలా వరకు అధ్యయనం తగ్గిపోయిందని పిస్తోంది. వారికి తెలిసిందే వేదమని అనుకుంటున్నారు. తాము చదివిన దాని వెనుకనున్న మూలాలను గురించి ఆలోచించడం లేదనిపిస్తోంది. ముందుగా అక్షర దోషాలు లేకుండా రాయడం అలవర్చుకోవాలి. దారకు, ధారకు భేదం తెలియని వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇలాంటివి సవరించుకుంటే చాలు.



ఇంటర్వ్యూ:
**డాక్టర్ సాగర్ల సత్తయ్య**
7989117415





# మనిషి సంఘర్షణలే ఇతివృత్తాలుగా కలం కదిపిన...


# సెస్లావ్ మిలోస్జ్

సాహిత్యంలో నోబెల్ బహుమతి 1980 సంవత్సరానికి గాను "తీవ్రమైన సంఘర్షణల ప్రపంచంలో మనిషి యొక్క బహిర్గత స్థితిని రాజీలేని స్పష్టమైన దృష్టితో వివరించిన "సెస్లావ్ మిలోస్జ్ గారికి ప్రకటించబడింది. సెస్లావ్ మిలోస్జ్ 30 జూన్ 1911లో లిథువేనియాలో చారిత్రాత్మక నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆదిమ జానపద సంప్రదాయాలు సంక్లిష్టమైన చారిత్రక వారసత్వంతో కలిసి జీవించే వాతావరణంలో బతికారు. ఈ దేశం మరియు ఈ సంస్కృతి మరియు దానిలోని చాలా మంది ప్రజలు ఇప్పుడు ఉనికిలో లేరు. నాజీ భీభత్సం మరియు మారణ హోమం, యుద్ధం, స్టాలినిస్టిక్ దౌర్జన్యం, పోలాండ్ మరియు బాల్టిక్ రాష్ట్రాలు వాటిని తుడిచిపెట్టాయి.

సెస్లావ్ మిలోస్జ్ పట్టణంలోని విల్నాలో చదువుకున్నారు. ఆ సమయంలోనే అతను సాహిత్యంపై ఆసక్తిని కనబరిచాడు. సాధన చేసి అనతికాలంలోనే సృష్టించాలనుకునే యువతరంలో ప్రముఖ రచయితలలో ఒకడు అయ్యాడు. నాజీ అణచివేతకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమాలలో రహస్యంగా చురుకుగా పాల్గొన్నాడు. నమ్మకమైన సోషలిస్ట్‌గా కొత్త పోలాండ్ లోని రాజకీయ, మేధావి వర్గాలకు అనుబంధంగా ఉన్నాడు, కాలక్రమేణా విదేశాలలో తన దేశానికి ప్రాతినిధ్యం వహించే విశ్వసనీయ అధికారిగా, సాంస్కృతిక ప్రతినిధిగా ఎదిగాడు. 1951లో అతను పోలాండ్‌ను విడిచిపెట్టి పారిస్‌లో "స్వేచ్ఛా రచయిత"గా స్థిరపడ్డాడు. 1960లో కాలిఫోర్నియాలోని బర్కిలీ యూనివర్సిటీలో పోలిష్ సాహిత్యంపై లెక్చరర్‌గా అమెరికా వెళ్లారు. అయినప్పటికీ పోలాండ్‌లో అతని మూలాలు మరియు దాని మేధో జీవితంతో అతని సంబంధాలు ఆయనలో ఎన్నడూ విచ్ఛిన్నం కాలేదు.

సెస్లావ్ మిలోస్జ్ యొక్క మొదటి కవితా సంపుటి, "ఎ పోయెం ఆన్ ఫ్రోజెన్ టైమ్" 1933లో పోలిష్ భాషలో ప్రచురించబడింది. అదే సంవత్సరంలో, అతను హిట్లర్ ఎదుగుదల సందర్భంగా విల్నోలో జరిగిన జాతి వ్యతిరేక "పొయెట్రీ ఆఫ్ ప్రొటెస్ట్" కార్యక్రమంలో బహిరంగంగా తన కవిత్వాన్ని చదివాడు. జర్మనీలో అధికారంలోకి. 1934లో అతను న్యాయశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. అమెరికన్ పాఠకులకు తన కవిత్వంతో పాటు తన తోటి పోలిష్ కవుల రచనలను పరిచయం చేసే ప్రయత్నంలో భాగంగా, మిలోస్జ్ 1965లో ఆంగ్లంలో "యుద్ధానంతర పోలిష్ పొయెట్రీ" సంకలనాన్ని రూపొందించాడు . అతను తన స్వీయ రచన " సెలెక్టెడ్ పోయమ్స్ (1973)" సంపుటిని ప్రచురించారు. వాటిలో కొన్నింటిని తానే స్వయంగా ఆంగ్లంలోకి అనువదించాడు. ఇది ఆంగ్ల భాషలో ప్రచురించబడిన అతని మొదటి కవితా సంకలనం. అతని కవితా సంకలనాల్లో "కింగ్ పోపియెల్ అండ్ అదర్ పోయమ్స్" (1962), "బోబోస్ మెటామార్ఫోసిస్" (1965), "సిటీ వితౌట్ ఎ నేమ్" (1969), మరియు "ఫ్రమ్ ది రైజింగ్ ఆఫ్ ది సన్" (1974) ప్రధానమైనవి . 18 సంవత్సరాల తర్వాత, మిలోస్జ్ 1978లో అధ్యాపక వృత్తి నుండి రిటైర్ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ తో సమానమైన "బర్కిలీ సైటేషన్"ను అందుకున్నారు. 9 అక్టోబర్ 1980న, స్వీడిష్ అకాడమీ మిలోస్జ్ సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నట్లు ప్రకటించింది. ఈ అవార్డు అతనికి ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 1981లో, మిలోస్జ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కవిత్వానికి సంబంధించిన నార్టన్ ప్రొఫెసర్‌గా నియమితుడయ్యారు. అక్కడ అతను "చార్లెస్ ఎలియట్ నార్టన్" ఉపన్యాసాలను అందించడానికి ఆహ్వానించబడ్డాడు . 1990ల నుండి అతని రచనలలో "ఫేసింగ్ ది రివర్" (1994) మరియు "రోడ్‌సైడ్ డాగ్" (1997) కవితా సంకలనాలు మరియు "ఏబీసీ" (1997) సంకలనం ఉన్నాయి. మిలోస్జ్ యొక్క చివరి స్టాండ్-అలోన్ కవితా సంపుటాలు " దిస్" (2000) మరియు "ది సెకండ్ స్పేస్" (2002). మరణానంతరం "సెలెక్టెడ్ అండ్ లాస్ట్ పోయమ్స్" (2011)లో ప్రచురించబడ్డాయి.

సాహిత్యంలో నోబెల్ బహుమతితో పాటు, మిలోస్జ్ మరిన్ని అవార్డులను అందుకున్నారు. "పోలిష్ పెన్" అనువాద బహుమతి (1974), క్రియేటివ్ ఆర్ట్స్ కోసం గుగ్గెన్‌హీమ్ ఫెలోషిప్ (1976), న్యూస్టాడ్ట్ ఇంటర్నేషనల్ ప్రైజ్ ఫర్ లిటరేచర్ (1978), నేషనల్ మెడల్ ఆఫ్ ఆర్ట్స్ (యునైటెడ్ స్టేట్స్, 1989), రాబర్ట్ కిర్ష్ అవార్డు (1990), ఆర్డర్ ఆఫ్ ది వైట్ ఈగిల్ (పోలాండ్, 1994) అవార్డులను ఆయన గెలుచుకున్నారు. మిలోస్జ్ యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ మరియు యూనివర్సిటీ ఆఫ్ ఓక్లహోమాతో సహా అనేక సంస్థల్లో విశిష్టమైన విజిటింగ్ ప్రొఫెసర్ గా పేరుపొందారు, అక్కడ అతను 1999లో పుటర్‌బాగ్ ఫెలోగా ఉన్నారు. ఆయన 14 ఆగస్టు 2004న, అతని క్రాకో ఇంటిలో, 93 సంవత్సరాల వయస్సులో మరణించారు.



కవిత



# ఎందుకో అమ్మ యాదికి వస్తుంది



పిన్నంశెట్టి కిషన్, 97002 30310

గూటిలో దీపమై మలిపొద్దు వెలిగే వేళ
చాకలి బాగవ్వ ఉతికి తెచ్చిన
అమ్మ బట్టల మూటపై పడి దొర్లి
అంటించుకున్న పురాపరిమళమై
అమ్మ తలపుకొస్తుంది ఎందుకో!

శవపేటికలో ప్రాణిలా స్ట్రెచ్చర్‌పై
పై కప్పు తప్ప
నలు దిక్కులా చూపానని స్థితి

చుట్టూతా చితాభస్మ తెలుపు రంగు పరదాల
నిశ్శబ్ద నీరవ తాండవం!
ఐ సి యు యంత్రాలు చేస్తున్న చప్పుడేదో
మృత్యు సంకేత భాష!

గది గాజు కుడ్యం వెనుకో! ముందో!
పచ్చని లీలగా తచ్చాడుతున్న
బంధువులెవరో! ఎవరి బంధువులో?
అస్పష్ట భావోద్వేగాల మూకాభినయం.

ఈ వేళ ఎందుకో అమ్మ యాదికి వస్తుంది

అంపశయ్య మీద వీపు మోస్తున్న గాయాలు
బీష్మాష్టమి రాకకై చేస్తున్న పలవరింతలు!

పక్కపై ప్రక్కకు తిరిగే సాధారణ కోరిక
ప్రాణ సంకటంగా మారినప్పుడు
బాధాతప్త మూలుగులో
అమ్మాని నోరారా తలవడమే
మనసుకింత ఆసరా!

పెదాలు తడారిన దేహానికి
గుక్కెడు దాహం అందించే తరుణి నర్స్ ఓ కిరీటి!
ఆమెను చూసే చూపులో
నిన్నటికి నేటికీఎంత తేడా!

ఎందుకో ఈ వేళ అమ్మ యాదికి వస్తుంది

అనెస్థీషియా ప్రభావిత స్పర్శ లేని అంగాల్లా
ఎల్ ఇ డి లైట్ల వెలుగులో
దివారాత్రుల బేధం లేదు
ఉన్నదల్లా ఖేదమే!

జీవంగా వచ్చి
శవంగా తరలిపోతున్న ఇరుగు పొరుగు
తదుపరి యమ పిలుపు గుబులు!
రెప్ప వాలని కను కొనల్లోంచి జాలువారి
వాలుజడలైన కన్నీళ్ల అశక్త ప్రకటన.

రోగ రోదనలు నులిపెడుతుంటే
'దేహమే నీ తోడు
గాటు పడకుండా కాపాడుకో'
అన్న అమ్మ  వాక్కు నిక్కమై తోస్తున్నది.

అరవై ఏళ్ల కొడుక్కి
ఎనభై ఆరేళ్ళ అమ్మ యాదికి వస్తుంది.

వ్యాసం

# రామసింహ కవి జీవితం ఆత్మకథ ఒక పరిశీలన

కవితా ధీమంతుని స్ఫూర్తివంతమైన జీవన పథం...




సంకేపల్లి నాగేంద్రశర్మ
80748 26371




(ఫిబ్రవరి సంచిక తరువాయి)

ఒక నాడు కొయగిరి ప్రాంతంలో సంచరించినపుడు జోగడనే లంబాడీ వాడిని చంపడానికి వచ్చిన పులిని తన బావమరిది రూఢ సింహం వద్ద ఉన్న కత్తితో శూరత్వంతో వధించినట్లు, తన సాహస క్రియకు పది రూపాయల ఇనాం అధికారుల వద్ద నుండి లభించిందని, తద్వారా తాను గ్రామ జనుల ప్రేమపాత్రుడైనట్లుగా చెప్పుకున్నారు. పక్షులను వేటాడే సమయంలో తాను నీళ్ళలోకి జారిపడి నట్లు, ఎవ్వరో ఒకరు వచ్చి కాపాడినట్లు, అప్పటి నుండి ఈ వేట మాని, కవిత్వం రాయడానికి సంకల్పించినట్లుగా తెలుపుకొన్నారు. ఆ కాలంలో నాటకాలు లేవని, వీధి నాటకాలున్నాయని చెప్పు కొచ్చారు. సుభద్రా పరిణయం, భానుజా పరిణయము, మిత్రవిందా వివాహం, జాంబవతీ కళ్యాణము, జాంబవతీ పరిణయము చదివి, వీధి నాటకాలు ఆడినట్లుగా చెప్పుకొన్నారు.

రెండవ, మూడవ, ఆశ్వాసములలో కవి నేరం చేసి, జీవిత ఖైదు శిక్ష పడటం, లంచం ఇవ్వక పోవడం వల్ల ఊహించని శిక్ష పడటం, కరీంనగర్ జైల్ నుండి గుల్బర్గా జైలు వరకు సాగిన 14 ఏళ్ళ జైల్ ప్రయాణ జీవితాన్ని ఇందులో రాశాడు. వీరు సుమారుగా పదునాలుగేళ్ళ జైల్ జీవితం గడిపారు. తన యొక్క దురదృష్టం, అయోగ్యతపై మిక్కిలి వ్యధ చెందుతూ కీర్తనలు, పద్యాలు రాయడం మొదలు పెట్టారు. స్వజాతీయుడైన హరిసింగ్ నామస్థుడు ఉగ్రుడై పేచీకి వచ్చి, కవ్వించి, క్షణికావేశములో జరిగిన హత్యాపాతకముతో జైలు శిక్షకు లోనయ్యారు. ఆత్మ రక్షణ కోసమే జరిగినది కానీ, హత్య కాదని కవి చెబుతాడు. ఆ మూర్ఖుడు చంపడానికి వచ్చి, జైల్ వార్డెన్ కుడికాలుకు కడియమొకటి వేసి, తనను శిక్షకు పంపినారు. పేషీ క్లర్క్ మోతుకు రాజేశ్వర్‌రావు వచ్చి అయిదు వందల రూపాయలు లంచమిస్తే విడుదల చేస్తామని అన్నాడు. కానీ ఈ కవి మొదలు జమానత్ పై విడుదల చేయాలని కోరగా, కోపించి జైల్ సజా వేశాడని చెప్పుకొచ్చాడు.

జైలర్ గారి దయ వల్ల, జైల్ ఖైదీల నిత్య భత్యపు లెక్కలు వ్రాస్తూ, వీలు చిక్కినపుడల్లా కవిత్వం రాస్తూ కాలం వెళ్ళదీసినట్లు కవి గారు చెప్పుకొన్నారు. పశ్చాత్తాప హృదయుడై గతి తప్పిన నలుడు, హరిశ్చంద్రుడూ రాజ్యాలు పోగొట్టుకోన్నట్లుగా, వాలి బాధ వల్ల సుగ్రీవుడు కష్టాలు పడటం, శ్రీరామ చంద్రుడు అంతటి వాడు వనవాసానికి పోవడం వంటి ఉపమానాలతో కవి రామసింహం కీర్తనలు, పద్యాలు రాస్తూ దైవ నామ స్మరణలో జైల్ లో ఆధ్యాత్మిక జీవితాన్ని ఎంచుకొన్న వైనం కనిపిస్తుంది.

"ప్రారబ్ధ ఫలమో, నా గ్రహచారమో నా ప్రాగ్జన్మ ఫలమో
ఆరూఢిగను కారణార్థమేమొ లేని
వైరంబు బుట్టించి క్రూరాత్ముడట్లాయ"

అంటూ ఒక చరణంలో తన బాధను వెళ్ళగక్కుతాడు. కరీంనగర్ జైలు లో ఆరునెలల శిక్షణానంతరం వరంగల్ జైలు నిర్మాణంలో ఉన్నందున, నిజామాబాద్ జైల్, హైదరాబాద్ చంచల్ గూడా జైళ్ళకు వెళ్ళే అవకాశం లేనందున గుల్బర్గా సెంట్రల్ జైలుకు కవిని మార్చారు. అక్కడి జైల్ అధికారి మహమ్మద్ వలి ఇతని విషయం తెలిసి, ఎంతో గౌరవించారు. అక్కడి జైల్ లో ఉన్న వివిధ రకాల యమలోక శిక్షలను ఈ కవి వివరంగా రాశారు. దీని వల్ల ఆనాటి జైల్ ఖైదీల జీవితాలు ఎలా ఉండేవో, విధించిన రకరకాల శిక్షలు అమలు ఎలా ఉండేదో ఈ తరానికి తెలియవస్తున్నాయి.

గుల్బర్గా జైల్‌లో వీరు రాసిన పద్యాలు, కీర్తనల ప్రతులు మిత్రులు తీసుకొని పోవడం వల్ల, అవి అచ్చుకు నోచుకోలేదని ఆయన బాధతో చెప్పుకొన్నారు. గుల్బర్గా జైల్ జీవితంలో గత్తర్ మహమ్మారి వచ్చి, జైల్ జీవితం అల్లకల్లోలమైనది. జీవితాలపై ఆశ వదులుకొన్న తమకు డాక్టర్ పంపించిన ఔషధాలతో బతికి బట్ట కట్టామని రాసుకొన్నారు. నిజాం ప్రభుత్వంలో పనిచేసిన ఆంగ్లేయుడు హెంకిన్ ఒకసారి జైల్ తనిఖీకి వచ్చినపుడు ఉర్దూలో గజల్ వినిపించారు. సంతోషించిన అధికారి ఆయన విడుదలకు సిఫారసు చేశారట.

ఇహ నాల్గవ ఆశ్వాసంలో రామసింహ కవి జైల్ నుండి విడుదలై ఇంటికి చేరడం, గ్రామస్తులు స్వాగతించడం రాసుకొన్నారు. ఈ సంచారంలో నాందేడ్ గురుద్వారా సమాధిని దర్శించారు. పలు ప్రాంతాలు తిరిగి, పలువురి వదాన్యుల చేత సన్మానాలు పొందిన విషయాలను పేర్లతో రికార్డు చేశారు. నేరస్తుడైన ఖైదీని తక్కువ చూపుతో చూస్తారన్న కవి భావనలు పటాపంచలై పోయాయి. తాను నిరపరాధినని కవి ఆత్మగతంగా విచారించుకొంటాడు. గత పద్నాగేళ్ళుగా లేనందున భూమిని పటేల్ పట్వారీలు అక్రమించుకొని, లబ్ది పోందుతున్నారని తెలుసుకొని, కార్యాయి జరిపి తిరిగి అట్టి భూములను స్వాధీనం చేసుకొన్న వివరాలను పూస గుచ్చినట్లు రాసుకొన్నారు. తన ఊరిలో కోమటి గౌరిశెట్టి రామయ్య, ఉట్నూర్ చిన్ననర్సయ్య అనే కాపుతో కలిసి పూర్తిగా కమ్మలు (కాగితాలు) లేని తప్పుడు కుదువ కాగితాన్ని సృష్టించి, డబ్బు లాగడానికి చేసిన విఫలయత్నం గూర్చి రాశాడు. ఈ కవి సంచారంలో భాగంగా ఒక భోగం వనిత అవమానించగా పద్యాలు రాయడం, ఒక వైశ్యుడు శివలింగ పూజలో ఉంటూ పంచమునికి త్రాగు నీరు పోయడానికి నిరాకరించడంతో ఈ దృశ్యం చూసిన కవి గారే బావి నుండి మంచినీరు తోడి పోయడం వంటి అంశాలను చర్చించారు. సిరిసిల్లా తాలూకా సంచారంలో అనంతగిరి చేరి అక్కడి దొరవారు వెంకటరావు ఇచ్చిన ఒక కొరుకుడు పడని సమస్యకు పద్య పూరణం గావించారు. దీనికి బదులుగా దొరవారు చంద్రహారాలు బహుమతిగా ఇవ్వడాన్ని ఇందులో హైలెట్ గా చెప్పుకొన్నారు. పెద్దపల్లి ఎరబాటి లక్ష్మీకాంతరావు, దొంగతుర్తి, ఎండపల్లి, గుళ్ళకోట, చిల్వకోడూర్ దొరల వద్దకు వెళ్ళి,పద్యాలు వినిపించి సంభావనలు గైకొన్న వైనాన్ని రాశారు. పద్యాలు చదివి పలు దొరల వద్దకు చేరి ఉంగరాలను, సంభావనలను పుచ్చుకొన్న వివరాలను రాశారు.

అయిదవ ఆశ్వాసంలో ధర్మపురి పోలీసులు తన పట్ల దురుసుగా వ్యవహరించిన విధానాన్ని రికార్డు చేశారు. తాను లంచగొండులపై రాసిన శతకాన్ని శంకిస్తూ, మరో రచనను ఆక్షేపిస్తూ అపరాధిని చేసి శిక్షించాలని కచ్చంపై పిలిపించి చేసిన ప్రయత్నం విఫలం కావడం, ధామ్ అనే స్థానం నుండి వచ్చిన ఒక యోగాచారి వికట చేష్టలను రాశారు. నేను ఆయనను ప్రశ్నించగా జవాబులు చెప్పలేక అవమాన పడ్డారని ఇది ఒక ముఖ్యాంశంగా రాశారు. కలియుగ వర్ణాశ్రమ ధర్మము అనేడి పుస్తకాన్ని రాసి, ప్రజల సహకారంతో ఈ కవి ప్రచురించారు. దీన్ని చదివిన కోరుట్ల పట్టణంలోని ఆద్య శతావధాని శిరిసినహల్ కృష్ణమాచార్య ఆక్షేపించి లేఖ రాయడం, తదనంతర పరిమాణాల గూర్చి సుదీర్ఘంగా చర్చించారు. రామసింహకవి గారు ఘాటుగా జవాబు చెప్పడం, ఇందుమిత్తంగా జరిగిన వివాదాన్ని పోకస్ చేస్తూ రాశారు. జగిత్యాల వైదిక సంఘం తరపున ఆ లేఖను వ్రాయించలేదని, శతావధాని గారు ఇస్తే పోస్ట్ చేసినట్లు పేర్కొనడంతో రామసింహ కవి గారు ఆ శిఖామణిని ఘాటుగా దూషించారు. ఈ సందర్భంగా తన విశ్వకర్మ శతకాన్ని ఆక్షేపించడంతో దానికి బదులుగా పద్యాలు రాసి బదులు ఇచ్చానని, కవి రామసింహం చెప్పు కొచ్చారు. ఒక రెవిన్యూ గిర్దావర్ తన వతన్ పై యాభై రూపాయల ఫైన్ వేయడాన్ని సవాల్ చేసి, అట్టి పైకాన్ని కరింనగర్ కు వెళ్ళి పద్యాలు చదివి వాపస్ తెచ్చుకొన్న సంఘటనను కవి గారు రాసుకొన్నారు.

ఆరవ ఆశ్వాసంలో ఒక సంపన్ను రాలైన విధవాంగన కామించడం, దానికి స్పందించలేదని రాసుకొన్నారు. కవి సంచారంలో తాను సన్మానాలు పొందిన విషయాలను రాశారు. ఈ కవి కొంత అనారోగ్యానికి గురై, తిరిగి బాగు పడటంతో సంచారానికి వెళ్ళడం, నిజామాబాద్ జిల్లాలోని నింబగిరి నారసింహ క్షేత్రాన్ని జగిత్యాల తాలూకా లోని ఎకీన్ పూర్ మధ్వ బ్రాహ్మణ దేశ్ పాండేతో కలిసి దర్శించారు. నింబగిరి స్వామిపై నలుబై పద్యాలు రాసి, అక్కడి అర్చకుడు నంబి నారాయణ స్వామి వద్ద ఆతిథ్యం పొందారు. పెద వేముగుంట బ్రాహ్మణ ప్రభు లంకారామారావు గారి చేత సన్మానించబడ్డారు. తదనంతరం గురు గోవిందసింగ్ విజయ చరిత్రము పుస్తకం, ఆనంద విజయమనే హరికథను రాశారు. జగిత్యాలలో జరిగిన నిర్మల్ అంబయ్య సిద్ధాంతి నిర్వహించిన రుద్రయాగంలో పాల్గొని పద్యాలు చదివి విప్రవర్యుల చేత ప్రశంసలు పొందారు. ఇలా 90వ ఏట కూడా వీరి సాహితీ ప్రయాణం సాగింది. జగిత్యాల సభలో శతావధాని శిరిశనగండ్ల కృష్ణమాచార్య గారు చదివిన సీస పద్యములోని యతి,ప్రాసల తప్పొప్పులను లేవదీశారు. ఒక దాత సాయంతో కరీంనగర్ సౌభాగ్య ప్రింటింగ్ ప్రెస్‌లో యదార్థ రామాయణము కృతిని మూడు వేల ప్రతులు ముద్రించారు. 95 సం. వయస్సు నుండి కొందరి ప్రేరణతో తన ఆత్మకథను రాయడం మొదలు పెట్టారు.

రామసింహ కవి గారు యదార్థ రామాయణము, యధార్థ భారతం, భాగవతము మూడు గ్రంథాలను రాయడానికి సంచారం చేశారు. దాతలను కలుస్తూ, ఉపన్యాసాలు, ప్రవచనాలు,

కావ్య పఠనాలు చేస్తూ తన ప్రయాణం కొనసాగించారు. దాతల విరాళాల సేకరణతో పాటుగా, పుస్తకాల రచనలు, ప్రచురణలు అనే కార్యక్రమాన్ని సమాంతరంగా నడిపారు. ఆత్మకథలోని 12 ఆశ్వాసాలలో సింహభాగం ఇదే రాశారు. వయోభారమైనా, నేటి లాగా రోడ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ సౌకర్యాలు లేకున్నప్పటికినీ, తన దైన శైలిలో సంచార ప్రయాణాన్ని కొనసాగించారు. రచనలు చేయడం, వయో భారంతో నైనా సంచారం చేయడం, పుస్తకాలను ప్రచురించడం మూడు ముఖ్యాంశాలు వీరి ఆత్మకథలో ప్రధానంగా చర్చకు వస్తుంటాయి. శైవ పీఠాధిపతుల సాహచర్యం, రాజవీరయ్య, కేదారేశ్వరయ్యల ప్రేరణతో శివకీర్తనల కృతి రాయడం, జగిత్యాల విశ్వేశ్వర స్వామి చరిత్రను పద్యగద్యములతో నిర్వాహకులైన వైశ్యుల కోరికపై రాశారు. తదనంతరం రతిరాజ ప్రభావం, కలికాల ప్రభావం, వివేక విద్యాకల్పము వంటి కృతులను రాశారు. జగిత్యాల వైశ్య రత్నం గట్టు లక్ష్మీరాజం, జవ్వాజివారి ధర్మశాల మహంతు మహేశ్వర శ్రీ గురుమూర్తి లింగేశ్వరయ్యలు ఆదరించి తన కెంతో సహకరించినట్టుగా చెప్పుకొన్నారు.

1953 నాటి గోల్కొండ పత్రికలో రామసింహకవి గారి యధార్థ రామాయణము పుస్తకము పై సంపాదకులు నరోత్తమరెడ్డి గారు రాసిన సాహితీ విమర్శను తిప్పి కొట్టారు. గ్రంథకర్త సిక్కు జాతీయుడైనా తమ మత గ్రంథ రాజం కంటె విశేష భక్తి కల్గి రాసినప్పటికినీ, ఇది ప్రత్యక్ష రామాయణ మనబడదని విమర్శించారు. వాల్మీకి రామాయణము అతని కళ్లెదుటే జరిగిందని, వ్యాసప్రోక్తమైనదని పేర్కొంటూ, శంఖున బోయని తీర్థము వంటిదని ఘాటుగా విమర్శించాడు. సురవరం ప్రతాపరెడ్డి కూడా రామాయణ విశేషాలు అనే గ్రంథం రాశారని, అల్లసాని పెద్దన, రామరాజు భూషణుడు కూడా జనవాక్యంతో గ్రంథాలు రాశారని, ఇందులో తమ సిక్కు జాతిని గూర్చి ప్రత్యేకంగా వింగడిస్తూ, విమర్శించడం సరికాదని అన్నారు. గురు గోవిందసింహ స్వామి వారు కూడా రామావతార్ గ్రంథాన్ని రాశారని, ప్రతినిత్యం హనుమన్ నాటకాన్ని పారాయణం చేసే వారని, ఇది సరియైన విమర్శ కాదని బదులిచ్చాడు. తాను కూడా రాముడిని కొలిచేవాడినని, తన పేరు కూడా రామసింహమేనని అన్నారు. ఇదే అంశాన్ని రామసింహ కవి దశమాశ్వాసంలో కూడా ప్రస్తావించారు. వాల్మీకి మహర్షి కూడా తాను రామాయణ గాథ వినే రాశాడని, చూసి రాయలేదని విమర్శించారు. ఈ కావ్యంలోని దోషాలను పట్టి వాటిని సవరించి రాశానని చెప్పుకొచ్చారు.

"ధూషణార్హుడవు నీవు స్తుతికర్హుడవు కావు
తెలియక స్తుతించినాడ నాకృతి పద్యమున్
కంపివేయుము పామరంబున
పొరపాటయిన
ది క్షమవేడెదను విమర్శకుడవు గావీవు"

అంటూ తన విమర్శనాస్త్రాలను రామసింహ కవి సంధించిన వైనం ఆత్మకథలో గొప్ప అంశమే. తొమ్మిదవ ఆశ్వాసంలో జగిత్యాలలోని మెట్టు పెద్దన్న ఇంటనుండగా భట్టు ఆంజనేయకవి గారు ఇచ్చిన ఒక సమస్యాపూరణం పూర్తి గావించి ప్రశంసలు పొందారు. రాజమండ్రి నుండి ఒక శతావధాని కవి ఇంటికి వచ్చి పరీక్షించదలచినట్లుగా చెప్పి భంగపడి పోయిన విషయాన్ని గర్వంగా రాసుకొన్నాడు. ఆ కవికి నేనిచ్చిన సమస్యా పాదములను పూరింపక తెల్ల మొగం వేసినట్లు రామసింహ కవి రాశారు. ఒక కరణం పంతులు తన భూమిని వివాదం చేశారు. ఇందువల్ల దురాశ, లంచగొండి తనాన్ని విమర్శిస్తూ కవి పద్యాలు, కీర్తనలు రాశారు.

దశమాశ్వాసంలో రామసింహ కవి తన యదార్థ భారతము మరియు ఇతర గ్రంథాలకై సంచారం చేయడం చిత్రించారు. నింబగిరిపై రాసిన పద్య నక్షత్రమాలికను సమర్పితం చేసిన అనంతరం, పెద వేముగంటి బ్రాహ్మణ ప్రభువైన లంకారామారావు గారి వద్దకేగి యదార్థ భారత ముద్రణకై ఆర్థిక సాయం పొందారు., కరీంనగర్ తాలూకాలోని నందగిరి గ్రామస్తుల పశువులను కాయటానికై వచ్చిన లంబాడీలు మోసం చేసి, అట్టి పశువులను తస్కరించారు. యజమానుల కోరికపై రాఘవపట్నం లో ఉన్న ఆయన తండ్రిగారు, పెద్దనాన్న వర్గీయులు సహకరించగా, అడవుల్లోకి వెళ్ళి భారతంలోని ఉత్తర గోగ్రహణం లాగా లంబాడీలను ఎదిరించి, పశు సంపదను యజమానులకు అప్పగించారట. ఈ సాయానికి కృతజ్ఞతగా వారు కొన్ని దూడలు ఇచ్చి వెళ్లారట. 90 ఏళ్ళ కింద జరిగిన సంఘటనను ఈయన చాలా ఆసక్తికరంగా చిత్రించారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ లోని శివారాధ్యుడైన నిర్మల శంకరశాస్త్రిని కలిసినట్లుగా రాసుకొన్నారు. ఆహ్వానంపై నాందేడ్ తాలూకాలోని ముదోల్ చేరి, యజ్ఞాలలో పాల్గొన్నారు. అందులో శతావధానిగా శిరిశినగండ్ల కృష్ణమాచారి తాను ఇచ్చిన పద్య పూరణాలు పూరింపక అవమానాల పాలయిన సంఘటనను చర్చించారు. అవధానులను, శతావధానులను, పండితులతో వాద వివాదాలు గూర్చి కవి రాయడం ఆసక్తికరంగా వీరి ఆత్మకథ కనిపిస్తుంది.

పది, పదకొండు ఆశ్వాసాలలో కవి గారు ముద్రణ శాలలో 500 గ్రంథాలు అచ్చొత్తించగా, ద్రవ్యం సరిపోనందున వారు కేవలం 20 పుస్తకాలనే ఇచ్చారు. అతి కష్టంగా వారి డబ్బు చెల్లించి గ్రంథాలను తెచ్చుకొన్నట్లుగా రాసుకొన్నారు. పలు చోట్ల తిరిగినట్లుగా రాసుకొన్నారు. కొందరు ధనం ఇవ్వలేదు. నాచుపల్లి దొర కిషన్ రావు గారు మేము దొరలమంతా కలిసి రెండు నెలల్లో ముద్రణకు సాయం చేస్తామని హామీ ఇచ్చి, ఒక రూపాయి ఇవ్వని సంగతిని రాశారు. దాతల వదాన్యతలను, చేయిచ్చిన సంఘటనలను కవి గారు సవివరంగా రాశారు. కొండగట్టులో ఉన్న కాసుగంటి నారాయణరావు వద్దకు

వ్యాసం

సాయానికి వెళ్ళానని, అచటి కోనేటి తీర్థం తాగి అనారోగ్యానికి గురై కరీంనగర్ కు చేరుకొన్నట్లుగా రాశారు. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లికి, వెలిచాల సంచారాల గూర్చి రాశారు. ఎండపల్లి హరికథా విద్వాన్ శిరిషినహల్ కృష్ణమాచారి వారి ఆదరణవల్ల వెలిచాలకు వెళ్ళినట్లు చెప్పుకొన్నారు. వెలిచాల పొలసాని రామారావు గారింటికి వెళ్ళారు. కరీంనగర్ హైస్కూల్ లో చందాలకు వెళ్ళి, పిల్లలు, ఉపాధ్యాయుల నుండి కొంత ధనం అతి కష్టముగా సేకరించిన వృత్తాంతాన్ని చర్చించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంతట రామసింహ కవి తిరిగారు. వెదిరె, తదుపరి సిరిసిల్లలో పర్యటించి నట్లు రాసుకొన్నారు. సిరిసిల్లలో లక్ష్మణరావు, రంగయ్య వకీల్, కమలాకర్ రావు, వెంకటరెడ్డి, నాగనాథం, పత్తిపాక విశ్వనాథం లను కలిసి కొంత సేకరించు కొని వేములవాడ చేరానని, మారుపాక పెగ్గారావు, రేగులపాటి జగ్గారావు, ఇతరులు గ్రామాంతరం వెళ్ళడం వల్ల కలువలేక పోయినట్లు రాసుకొన్నారు. ఇక్కడ జంగం భూమయ్య-రాజేశ్వరయ్య మఠాలలో తలదాచుకొన్నట్లుగా రాశారు.

12వ ఆశ్వాసంలో కవి సంచారం వేదనతో సాగిందని తెలుస్తుంది. దాతలు లుబ్ధులుగా కనిపించారని కీర్తన రాసి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అంతేకాక కొడుకు, మనువడు అనారోగ్యానికి గురి కావడంతో సొంత ఊరు లోనే ఉండవలసి వచ్చింది. తదుపరి మానకొండూర్, కరీంనగర్, సికింద్రాబాద్‌లలో పర్యటించారు. కవి చెర్విరాల భాగయ్య దర్శన భాగ్యం గూర్చి గొప్పగా చెప్పుకొన్నారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్, కొండా శంకరయ్య ప్రెస్ సందర్శించిన విషయాన్ని రాశారు. దొరల కంటే దొరసానులే ఎక్కువగా సాయాలు చేసి ఆదరించారని చెప్పుకోవడం ఆనాటి స్త్రీ మూర్తుల ఔదార్యం కనిపిస్తుంది. జోగినపల్లి గోపాలరావు పుత్రులు, కాంగ్రెస్ నాయకులు జెవి.నర్సింగరావు గాంధీ భవన్ హైదరాబాద్ లో కలువగా, వారిచ్చిన 150 రూపాయల ధన సాయంతో కొండా శంకరయ్య ప్రెస్ లో ఆగిన యదార్థ మహాభారతము గ్రంథాలను తెచ్చుకొన్నట్లుగా రాసుకొన్నారు. గురుగోవింద సింహ విజయ అనువాద ముద్రణకై కూడా దాతల సాయం కొరకు తిరిగినట్లుగా చెప్పుకొన్నారు. చొప్పదండి సమీపంలోని ఆర్నకొండ సందర్శించిన విషయము రాసుకొన్నారు. 104 సంవత్సరాలు వచ్చినప్పటికినీ కవి సంచార యాత్ర వివరాలు కొనసాగాయి. చివరి రెండు సంవత్సరాల ముందు తన మేధాబలము శిథిలమైనట్లుగా కవి గారు రాసుకొన్నారు. 150 ఏళ్ళ చరిత్ర గల రామసింహ కవి ప్రతులను కాపాడిన ముని మనువడు 76 ఏళ్ళ సర్దార్ గురుదేవ్ సింగ్, ఆత్మకథ సంపాదకులు వేముల ప్రభాకర్ గార్లిద్దరూ ధన్యజీవులు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

సమీక్షావ్యాసం


# "యోధ" కేసీఆర్ ధీర గాథ

**కవితోద్ధతిలో సామాజిక యోధుడు....**



ఘనపురం దేవేందర్
99480 32705

మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య సమరాన్ని ముందుండి నడిపాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశ పరిపాలన పగ్గాలు పట్టడానికి ఎందుకు ముందుకు రాలేదో... ! స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడాదికే ఆయన హత్యకు గురి కావడం ఎందుకు జరిగిందో....! ఏది ఏమైనా మహాత్ముడు నింపిన స్ఫూర్తి దేశ ప్రజలకే కాదు ప్రపంచానికే శాంతి, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలపై అపారమైన నమ్మకాన్ని పెంచాయి. ఆయన మహాత్ముడు అయ్యాడు. జాతిపిత అయ్యాడు. ప్రత్యర్థులకు సైతం ఆరాధ్యుడయ్యాడు. ఆయనను తిట్టిన వారికి సైతం ఆయన ఫోటో పెట్టుకోకుంటే నడవని అనివార్య పరిస్థితిని మనం చూస్తున్నాం. ఈ సరళిని మనం తెలంగాణకు అన్వయించుకుంటే తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన ఘనత "కేసీఆర్ దే" అంటే అతిశయోక్తి లేదు. నిత్యం ఆయనను తిడుతూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న వారి పూర్వాశ్రమాన్ని పరిశీలిస్తే వారు కేసీఆర్ ని ఎంత ఆరాధ్యుడిగా భావించారో తెలిసి వస్తుంది. భారతదేశానికి స్వాతంత్రం సాధించిన మహాత్ముడిలా కేసీఆర్ అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాడు. అభిమానుల హృదయాలలోనే కాదు ప్రత్యర్థుల




హృదయాలలోనే కాదు, ఆగర్భ శత్రువుల మనసులలో కూడా హీరోగా ముద్రించుకున్న రూపం కేసీఆర్.

ఎందుకంటే ఆయన మహాత్ముడిలా పాలనాపగ్గాలకు దూరం ఉండలేదు. ఉద్యమం నడిపించిన స్ఫూర్తితోనే ప్రజల ఆశీస్సులతో అధికార దండాన్ని చేతబట్టాడు. కరెంటు కష్టాలను జయించి, దాదాపుగా ప్రతి పొలానికి నీరును పారించి, సాంకేతికాభివృద్ధిలో దేశం సాధించిన అన్ని మైలురాళ్లను అధిగమించి, ఆర్థిక వృద్ధిలో అగ్రగామిగా నిలిపి, దేశంలోనే అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలను, అనూహ్యమైన ప్రైవేటు రంగ ఉద్యోగాలను కల్పించి, తెలంగాణ భాషకు పట్టాభిషేకం చేసి కొత్త చరిత్ర సృష్టించాడు.

మనం చిన్నప్పుడు "మేకను చూపెట్టి కుక్కగా నిరూపించిన" కథను చదువుకున్నాం. సరిగ్గా అటువంటి కథని ప్రత్యర్థులు నడిపించి కేసీఆర్ ను అధికారానికి దూరం చేసి ఉండవచ్చు గాక.... ఇప్పటికీ తెలంగాణలో అందరూ అభిమానించే అగ్రగామి నాయకుడు కేసీఆర్. దేశంలోని దృఢమైన నాయకులలో మొదటి వరుసలో ఉండే నాయకుడు ఆయన. ఇంత విశిష్టత సాధించిన కేసీఆర్ గురించి కల్లెం నవీన్ రెడ్డి రాసిన"యోధ"అనే కవితా సంపుటి ఈరోజు టాక్ ఆఫ్ ద స్టేట్. హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో చాలామంది చేతిలో కనిపించిన పుస్తకం అది. ముఖ్యంగా యూత్ చేతిలో మురిపెంగా కనిపించిన పుస్తకం అది.

కల్లెం నవీన్ రెడ్డి అనే ఒక యువకుడు రాజకీయం గురించి తెలుసుకుంటున్న సందర్భంలో నమ్మశక్యం కాని, అసాధారణ అద్భుత లక్షణాలు కలిగిన కేసీఆర్ ఆయనని ఆకర్షించాడు. ఆయనలో ఆరాధనగా మారాడు. ఆ క్షణం నుంచి ఈ క్షణం వరకు కేసీఆర్ ను మనసుపెట్టి అనుశీలించి, ఆయనలోని విశిష్టతత్వాన్ని అక్షరాలుగా

మార్చి "యోధ" రూపంలో సమాజం ముందు నిలిపాడు.

ఎవరు అవునన్నా కాదన్నా ఈనాటి యువత సంపద సంపాదించడం వెనుక పరిగెడుతున్నది. కానీ స్ఫూర్తిదాయకమైన నాయకుల ఆశయాల వెంట వెళ్తున్న వాళ్ళు చాలా తక్కువ. ఆ అరుదైన వాళ్ళలో కళ్లెం నవీన్ రెడ్డి మనల్ని ఆకర్షిస్తాడు. ఆయన ఫేస్బుక్ ఎకౌంట్ ఫాలో అయితే నిర్భయంగా, నిస్వార్థంగా, నిస్సంకోచంగా, నిజాయితీగా కేసీఆర్ గురించి పెట్టే పోస్టులు ప్రత్యర్థులను సైతం నిశ్చేష్టులను చేస్తాయి. వృత్తిరీత్యా ఇంగ్లీషు లెక్చరర్ గా పనిచేసే కళ్లెం నవీన్ రెడ్డి మాతృభాష తెలుగులో మంచిపట్టునే సాధించాడు. అందుకే తొలిపుస్తకమైనా "యోధ" పాఠకులను తన వెంట నడిపిస్తుంది. స్వయంగా కేసీఆర్ స్వహస్తాలతో ఆవిష్కరణ చేసిన పుస్తకం "యోధ".

ఇటీవలే 70 వసంతాలు పూర్తి చేసుకున్న కేసీఆర్ కు 78 కవితలతో పుట్టినరోజుకు ముందుగానే అందిన మంచి కానుక ఈ పుస్తకం.

"మీ ఋణం
మీ వెంటే ఉంటే తప్ప
తీర్చుకోలేనిది" ("యోధ" కవిత)

అని చాలా గొప్పగా తన అభిమానాన్ని చాటుకున్నాడు నవీన్. కేసీఆర్ గురించి రాస్తూ ఉంటే ఆయన ప్రత్యర్థులకు అనుయాయులు "బానిస" అంటే వెక్కిరించడం చూస్తూ ఉంటాం. అటువంటి నీచ దృష్టి కలిగిన వాళ్లకు

"బానిస అంటే
మీరు అనుకున్నట్లు కాదు
బానిస అంటే బాధ్యత"

అంటూ కనువిప్పు కలిగిస్తాడు.

" ఓర్వలేని తనాలకు బెదిరింపులకు
భయపడే వాడిని కాదు" అంటూ
గర్జిస్తాడు.

"కొన్ని మౌనాలు
గొప్ప కార్యాలు చేయడానికే....
చెప్పేవాడు చేయడు...
చేసేవాడు చెప్పడు...
అతను చేసి చూపిస్తాడు" అంటూ
కెసిఆర్ మౌనాలకు భాష్యం చెప్తాడు.

"అతని సంకల్పశక్తి ముందు....
కాలం కూడా నమస్కరిస్తుంది"

("అతనికై" కవిత) అంటూ కేసీఆర్ విజయాలను ఏక వాక్యంలో మహోన్నతంగా ఆవిష్కరిస్తాడు.

"తెలంగాణ ఆత్మ" అనే కవితలో

"అతను ఎక్కడ పోటీ చేసినా....
గెలవడానికి కాదు... మనల్ని గెలిపించడానికి..." అంటూ కెసిఆర్ అంతరంగాన్ని తెలియచెప్తాడు. కేసీఆర్‌కు అభిమానించడం తెలుస్తుంది. కేసీఆర్ ను ద్వేషించడం తెలుస్తుంది. కానీ ఆయనను అర్థం చేసుకోవడం చాలా కష్టం. అందుకే "అంబేద్కర్ సాక్షిగా" అనే కవితలో

"అతను అర్థం కావాలంటే
అతని లాగే ఆలోచించాల్సి ఉంటుంది...
అతను ఒక ప్రపంచ పుస్తకం..." అని మార్గ నిర్దేశనం చేస్తాడు.

"ఒక పుస్తకం" అనే కవితలో

"అతనిని ప్రేమించి గెలవచ్చు
కానీ ద్వేషించి ఎన్నటికీ గెలవలేరు"
అంటూ కుండ బద్దలు కొడతాడు.

మరొక కవితలో

"అతనిని ప్రేమించాలంటే
ముందు తెలంగాణను ప్రేమించాలి "
అంటూ ఇంకో మార్గం చూపుతాడు.

"తెలంగాణ ఇంటికి నిట్టాడు ఉంది....
ఆ నిట్టాడు పేరే కేసీఆర్" అంటూ తెలంగాణకు జీవం కేసీఆర్ అని ఆత్మవిశ్వాసంతో చాటి చెబుతాడు.

"మోసేది బరువు అనుకుంటే
దింపేయాలనిపిస్తుంది....
బాధ్యత అనుకుంటే
నిరంతరం మోయాలనిపిస్తుంది"
అంటూ కేసీఆర్ తెలంగాణ కోసం పడే తపనను హృదయంతో అక్షరీకరిస్తాడు.

"చేస్తామని బుకాయింపు మీద
చేసి చూపించిన వాస్తవం మా
అధినేతది" అంటూ నిత్యం దూషించే ప్రత్యర్థులకు చురకలంటిస్తాడు.

"సెల్యూట్" అనే కవితలో

"రేపు అతను ఎగరవేసే
మువ్వన్నెల జెండాకు
మీరంతా చేస్తారు సెల్యూట్"
అంటాడు. ఈ మాట వెనక చాలా అర్థం ఉంది. నెక్స్ట్ కేసీఆర్ జెండా ఎగురవేసేది "ఎర్రకోట" మీద అనే అంతరార్థం ధ్వనిస్తుంది. దేశపాలకునిగా కేసీఆర్ ను దేశం చూడబోతున్న ఆకాంక్ష ఆత్మవిశ్వాసం నవీన్ అణువణువులో కనిపిస్తోంది.

"ఈ దేశాన్ని
మలినమైన మనుషుల నుండి
దొంగ దేశభక్తుల నుండి
తప్పకుండా రక్షిస్తాడు" అంటూ
భరతమాతకు ధైర్యం నూరిపోస్తాడు.


"అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదు
అలాంటిది ఆయన
అడగనిదే అన్ని చేస్తున్నాడు"
అంటూ కేసీఆర్ ప్రవేశపెట్టిన "కళ్యాణ లక్ష్మి" " రైతుబంధు" లాంటి అనేక పథకాలను ప్రజల ముందు ఉంచుతాడు. ఇలా నిలువెత్తు కేసీఆర్‌ను ఆవిష్కరించే ప్రయత్నం కేఎన్ఆర్ అంటే కళ్లెం నవీన్ రెడ్డి చేశాడు. అభినందనలకు పాత్రుడయ్యాడు.

ఈ పుస్తకంలో భారత జాగృతి అధినేత్రి గౌరవ శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత "అభినందనలు", కేసీఆర్ గురువు మృత్యుంజయ శర్మ రాసిన "ముందుమాట" నవీన్ వ్యక్తిత్వాన్ని తెలియ చెబుతాయి.

ఉమ్మడి నిజాంబాద్ జిల్లా ముద్దుబిడ్డ కళ్లెం నవీన్ రెడ్డి ఇంకా సాధన కొనసాగిస్తే సాధారణ పాఠకులనే కాదు, లబ్ధ ప్రతిష్టులైన సాహితీవేత్తలను మెప్పించే కవిత్వమూ రాయగలడు. ఈ "యోధ" పుస్తకాన్ని "కేసీఆర్"కు అంకితం చేయడం, ఆయన స్వీకరించడం ఎంతో ఆనందకరమైన విషయం. ఈ పుస్తకం కేసీఆర్ అభిమానులకు పండుగ. ఈ పుస్తకం చదివితే ప్రత్యర్థులు సైతం కేసీఆర్ అంటే అవుతారు ఫిదా.

# "ఆజాదీ"లో దాగిన కవిత్వలయ

ఇటీవల కరిపె రాజ్‌కుమార్ రచించిన ఆజాది కవితా సంపుటి సాహితీవేత్తలను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నది. ఆయన వస్తువు సమాంతర సామాజిక పరిస్థితులను ప్రతిపలిస్తున్నది. స్త్రీ ఉన్నతిని చాటుతూ ఆయన గజ ఈతగాండ్రు, సృష్టికర్తతో స్నేహం, స్ఫూర్తి జ్వాల, లాంటి కవితలు ఇందులో పొందుపరిచారు. గజ ఈతగాండ్రు కవితలో పురుషుల దౌష్ట్యం, అహంకారం కనిపిస్తుంది. సాధారణంగా నదిని ఏకవైనా పాజిటివ్‌గా చిత్రించడం ఇప్పటివరకు చూస్తున్నాం. కానీ కరిపె రాజకుమార్ అంగట్లో ముంగిసలు కవిత నదిని నెగిటివ్‌గా చిత్రించింది. అదేవిధంగా బర్డ్ వాక్ కవితలో ప్రభాత వర్ణన హృదయాన్ని కట్టిపడేస్తుంది. పుండాకోర్ లాంటి నెగెటివ్ పదాన్ని కూడా పాజిటివ్ కోణంలో చిత్రించడం కరిపెకే చెల్లింది. సంచార జాతులను వస్తువుగా ఈ కవిత కొనసాగుతుంది. స్ఫూర్తి జ్వాల అనే కవితలో ఝాన్సీ లక్ష్మీబాయి శౌర్యాన్ని వర్ణించారు. పులిబిడ్డలు లాంటి విప్లవ వీరుల వర్ణనతో పాటు మహబూబా లాంటి ప్రేమ కవితలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. కరిపె రాజ్‌కుమార్ వాడిన ప్రతీకలు ప్రత్యేకంగా గమనించదగ్గవి. సంతముచ్చులు కవితలో "ఏ సంబంధమూ లేని ఎదిగే మొక్కలు సైతం పత్ర హరితాన్ని కోల్పోయి నిర్దాక్షిణ్యంగా నిర్జించబడ తాయి" అంటూ వాక్య నిర్మాణంలో ఒక నిగారింపును చూపెడతారు. చిత్తు కాగితాలు గూడెంజనులకు ప్రతీక చేస్తారు. గట్టి విత్తనం కవిత శీర్షికే ఒక ప్రతీక. బీజవాపన, నీడలు మొలిచే చోట మొదలైన పదాలన్నీ కూడా ప్రతీకలే. మెహబూబా కవితలో సహస్ర అడుగులు, అభినవ భారత్ కవితలో అశేష వెన్నెల, తమాషా కొడుకులు దీర్ఘ కవితలో అనేక విచిత్రమైన సమాసాలు మనకు




కనబడతాయి. అదే విధంగా ఆయన అలిశెట్టి ప్రభాకర్ మీద రాసిన కవిత తిలక్‌ని గుర్తుకు తెస్తుంది. ఆ చీకటి రోజులు అనే దీర్ఘ కవితలో కరిపె రాజ్‌కుమార్ తాను సంయుక్త పాలనలోని చీకటి రోజులను సమగ్రంగా వర్ణించారు. 'కాళ్ల గోళ్లు తీసి' లాంటి జాతీయాలు ఈయన కవితా పాదాలలో చక్కగా అమరిపోయాయి. ఆయన రాసింది వచన కవిత్వమే అయినా ప్రాసల విన్యాసాలు చూస్తే ప్రాచీన ఛందస్సు ప్రభావం ఉందని సులభంగా గుర్తించవచ్చు. చలువ గదులు అని ఏసీ రూమ్స్‌ని అనడం ఒక విషయాన్ని కొత్తగా చెప్పాలని ఉబలాటానికి సంకేతం. స్థిత ప్రాజ్ఞత ధాతిరి, మేధో వికసిత ప్రభలు, పవిత్ర జ్యోతిర్లింగ శక్తిపీఠం, నిలయ శ్రవణీయ శబ్ద తరంగాలు, హరహర తాడిత అధర్వణ కాలాలు లాంటి పదప్రయోగాలు చిత్రంగా కనిపిస్తాయి. 'బాధా మధురవాణి' లాంటి పారడాక్సులు మనల్ని ఆకర్షిస్తాయి. నామవాచకాన్ని వ్యర్థించి అని క్రియాపదంగా వాడడం ఆయన ప్రయోగ విశేషానికి సంకేతం. ఆయన కవితల్లో కథన విధానం చోటు చేసుకుంటుంది. గేయం పోలికలతో నడిచిన ఆయన వెయ్యి ఉరుల మర్రి, ఆ ఆఖరి మజిలీలు ఇందుకు నిదర్శనాలు. ఏమైనా కరిపె రాజ్‌కుమార్ కవిత్వం చదవడం ఒక ఉద్వేగ భరితమైన అనుభూతి. ఆయన రచించిన ఆజాది అనే ఈ కవితా సంపుటం ప్రతి సాహిత్య అభిమాని చదవదగింది.

ప్రతులకు :
**పాలపిట్ట బుక్స్**
16-11-20/6/1/1/403,
విజయ సాయి రెసిడేన్సీ, సలీంనగర్, మలక్‌పేట్,
హైదరాబాద్.
సెల్ : 9848787284.
వెల : రూ. 150/-




## ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ

మార్చ్ 19, రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం వరంగల్ లో జరిగింది. రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల, వరంగల్ నందు ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఐదు గ్రంథాల ఆవిష్కరణ ఐదు సమావేశాలుగా నిర్వహించబడిన ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా అనిశెట్టి రజిత, నిర్వాహకులుగా కొమర్రాజు రామలక్ష్మి వ్యవహరించారు.

## ధిక్కార స్వరానికి ప్రతీక "గద్దెనెక్కినంక"



పాలమూరు యువకవి కె.పి. లక్ష్మీనరసింహ రచించిన "గద్దెనెక్కినంక" దీర్ఘ కవిత ధిక్కార స్వరానికి ప్రతీక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలమూరు సాహితి, పాలమూరు యువకవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 17 న మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలో గల లుంబిని హైస్కూలులో "గద్దెనెక్కినంక" పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా విచ్చేసిన ప్రముఖ కవి వల్లభాపురం జనార్దన మాట్లాడుతూ లక్ష్మీనరసింహ రచించిన "గద్దెనెక్కినంక" పుస్తకంలో కవి మనువు సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థలోని లోపాలను ఆవిష్కరిస్తూ రచన చేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ కవిత్వం సమకాలీనతను ప్రతిబింబిస్తుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కె. లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని కొందరు భ్రష్టుపట్టించడం దురదృష్టకరమన్నారు. మరొక అతిథి డా. పరిమళ్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ కవిత్వంలో ఆవేదన, ఆక్రోశం కనిపిస్తుందన్నారు. పుస్తక సమీక్ష చేసిన విఠలాపురం పుష్పలత మాట్లాడుతూ మనువు సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థలో ఇంకా బతుకుతున్నామన్నారు. గ్రంథ స్వీకర్త, ప్రముఖ న్యాయవాది బెక్కెం జనార్దన్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలోనూ ఇంకా మనుషులు కుల, మత చట్రంలో బతుకుతుండడం బాధేస్తుందన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, యువకవి బోల యాదయ్య మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ కవిత్వంలో ప్రధానంగా గాఢత కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నగంటి ప్రభాకర్, ఖాజా మైనోద్దీన్, పులి జమున, కె.ఎ.ఎల్. సత్యవతి, రావూరి వనజ, గుడిపల్లి నిరంజన్, వహీద్ ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది అభినందనీయం

**- పీచర సునీతారావు పురస్కార సభలో ముఖ్యం అతిథి నందిని సిధారెడ్డి**



తేదీ మార్చి 10, 2023 పైడి జయరాజు మినీ థియేటర్ రవీంద్రభారతిలో పీచర సునీతా రావు స్మృతిలో సాహితీవేత్తలకు పురస్కార ప్రదానం జరిగింది. కవిత్వానికి గజ్జెల రామకృష్ణ, కథకు చింతకింది శ్రీనివాస్, విమర్శకు ఆడెపు లక్ష్మీపతి, లక్షణ చక్రవర్తి ఈ సభలో పురస్కారాలు అందుకున్నారు. ఒక్కొక్కరికి 15000 నగదు, జ్ఞాపిక శాలువతో అతిథులు వారిని సత్కరించారు, ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి ఈ కార్యక్రమం జరపడంలో ఉన్న ఔచిత్యాన్ని వివరించారు. తన భార్య స్మృతిలో ఈ కార్యక్రమం జరపడం మంచి విషయమని సిద్ధారెడ్డి విజయేందర్ రావుని అభినందించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ ఇదొక అపురూప విషయమని పేర్కొన్నారు. సభకు మరొక విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ విమర్శకులు కాసుల ప్రతాపరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రముఖ విమర్శకులు కె.పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. పురస్కారాల కమిటీ చైర్మన్ ప్రముఖ కవి తంగేడు పత్రిక సహ సంపాదకులు కాంచనపల్లి గోవర్ధన్ రాజు మాట్లాడుతూ ఇదొక పవిత్ర కార్యమని అభినందించారు. చివరిగా పురస్కార కమిటీ ఫౌండర్ విజయేందర్ రావు తన భార్య జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సభకు ప్రముఖ కవి విమర్శకులు సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇంకా పి. రవీందర్ రావు, మన్మోహన్ రావు, బాలచందర్ తదితరులు సభలో పాల్గొన్నారు.


**స్వీకారం**




## స్పర్శవేది

ఎమ్వీ్వ రామిరెడ్డి

ముప్వ చిన్నబాపిరెడ్డి
మెమోరియల్ ట్రస్ట్
వెల : రూ.160/-




## కొత్త వేకువ

పద్మావతి రాంభక్త
సెల్ : 9966307777


పాలపిట్ట బుక్స్, నవ తెలంగాణ
ప్రజాశక్తి బుక్స్ సెంటర్
వెల : రూ.100/-




## వివేచన

డా॥ రాధేయ
సెల్ : 9985171411, 8247523474


వెల : రూ. 180/-




## కందిలి

లేదాళ్ళ రాజేశ్వర రావు
సెల్ : 9441873602


పాలపిట్ట బుక్స్, నవ తెలంగాణ
ప్రజాశక్తి బుక్స్ సెంటర్
వెల రూ. 100/-




## ఆకురాలిన చప్పుడు

శ్రీ వశిష్ఠ సోమేపల్లి
సెల్ : 8074779202


ఛాయా రిసోర్సెస్ సెంటర్
వెల : రూ. 120/-




## మనుషులమై బ్రతకాలి

డా॥ కె. దివాకరా చారి
సెల్ : 9391018972

పాలపిట్ట బుక్స్
వెల రూ. 100/-




## ప్రాణదీపం

గాజోజు నాగభూషణం
సెల్ : 9885462052


తెలంగాణ రచయితల వేదిక
వెల రూ. 150/-




## అరుగు

నక్షత్రం వేణుగోపాల్
సెల్ : 001 703 861 8368 (యుఎస్ఏ)

నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్
వెల రూ. 200/-





## కాలిబాటలు - తెలంగాణ కథా విమర్శ

డా॥ బి.వి.ఎన్. స్వామి
సెల్ : 9247817732

తెలంగాణ పబ్లికేషన్స్, హైదరాబాద్
వెల : రూ. 150/-

స్వీకారం కోసం మీ పుస్తకాలు ఈ చిరునామాకు పంపించండి వీలైతే సమీక్ష కూడా వేస్తాం.


**తెలంగాణ జాగృతి :** పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 4వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



తెలంగాణ తొలితరం కథకులు

## ఇరివెంటి కృష్ణమూర్తి

జననం : 12 జూలై, 1930